RNI Reg-No. 69176/96

# నేటి మనదేశం

తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Medchal Malkajgiri

CIRCULATED THROUGHOUT TELANGANA STATE

సంపుటి :32 సంచిక : 11 హైదరాబాద్ సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: మంగళవారం 18-08-2026 పేజీలు : 12 వెల: 1-00

## తెలంగాణలో సర్ జాబితా విడుదల

- 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు స్వీకరణ
- 2.73 శాతం మంది చనిపోయినవారిగా గుర్తింపు
- సుమారు 60 లక్షల మంది అనామలీస్ ఓటర్లు
- ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాల స్వీకరణ
- అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల

**హైదరాబాద్, ఆగస్ట్ 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణలో రాష్ట్ర ఎన్నికల సంఘం సర్ ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. సర్ ప్రక్రియలో మొదటి భాగం పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు అందినట్లు తెలిపారు. 2.73 శాతం మంది చనిపోయినవారిగా గుర్తించినట్లు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. మరోవైపు సుమారు 60 లక్షల మంది అనామలీస్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అలాగే 32 లక్షల మంది ఓటర్లు మ్యాపింగ్ చేసుకోలేదని గుర్తించారు. ఈ నేపథ్యంలో సుమారు 92 లక్షల మందికి నోటీసులు జారీ చేయనున్నట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. నోటీసులు మిగతా 2లో..

## 22ఎ భూములపై ఆందోళన వద్దు

అధికారుల తప్పిదం వల్లనే ఇలా జరిగింది... అందుకు ప్రజలను క్షమాపణలు కోరుతున్నాం

నిషేధిత జాబితా నుంచి భూములను తొలగిస్తాం... టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలి

ప్రజలను ఆఫీసులకు తిప్పే అధికారులపై చర్యలు తీసుకుంటాం... మీడియా సమావేశంలో రెవెన్యూమంత్రి పొంగులేటి వివరణ




**హైదరాబాద్, ఆగస్ట్ 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రైవేటు వ్యక్తుల ఆస్తికి ఆటంకం కలిగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రైవేటు భూమిని 22ఏలో పెట్టారంటూ మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి 750 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో పొంగులేటి మాటాడుతూ.. అధికారుల పొరపాటు వల్ల ఇలా జరిగిందన్నారు. 22ఏ భూములపై నాలుగు జిల్లాల్లోని అధికారులతో కలిసి చర్చించాం. గతంలో ఆ భూములు యూఎల్‌సీ జాబితాలో ఉన్నాయి. నిషేధిత జాబితాను అప్‌డేట్ చేయడంలో పొరపాటు జరిగిందన్నారు. అధికారుల తరపున క్షమాపణలు కోరుతున్నానని మంత్రి అన్నారు. ప్రైవేట్ ఆస్తుల్ని 22ఏ జాబితా నుంచి త్వరలోనే తొలగిస్తాం. దీనికి సంబంధించి ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ మిగతా 2లో..

## ప్రజల భద్రత, రక్షణ, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం

ఏకీకృత వ్యవస్థగా 'తెలంగాణ సేఫ్' తీసుకొచ్చాం

ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ స్పష్టీకరణ



**హైదరాబాద్, ఆగస్ట్ 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యతలను, ప్రజారోగ్య పరిరక్షణ దిశగా తీసుకున్న నూతన నిర్ణయాన్ని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల భద్రత, రక్షణ, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి అంశంలోనూ చట్టం ప్రకారమే పాలన సాగిస్తూ, ప్రజలకు సంపూర్ణ జవాబుదారీతనంతో సేవలు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన సంకల్పమని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో ఆహార పదార్థాలు, నిత్యవసర ఔషధాల నాణ్యతను, భద్రతను పర్యవేక్షించేందుకు మిగతా 2లో..

## పరిశ్రమలతో విద్యార్థుల కనెక్ట్ చేసే యత్నం

జాబ్ పోర్టల్ ప్రారంభించిన మంత్రి వివేక్



**మెదక్, ఆగస్ట్ 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దేశంలోనే మొదటిసారిగా పరిశ్రమలను విద్యార్థులను జాబ్ పోర్టల్ కనెక్ట్ చేస్తుందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. సోమవారం జిల్లాలోని మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపలి ్లలోని పారిశ్రామిక ప్రాంతంలో జాబ్ పోర్టల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో వెయ్యి పరిశ్రమలు ఉన్నాయని.. స్కిల్డ్ మ్యాన్ పవర్ అవసరం ఉందని అన్నారు. జిల్లా యంత్రాంగం, పరిశ్రమల మిగతా 2లో..

## బీహార్ అశోక్‌ధామ్ ఆలయంలో తొక్కిసలాట

ఏడుగురు భక్తుల దుర్మరణం



**పాట్నా, ఆగస్ట్ 17 (ఆర్ఎన్ఎ):** బిహార్‌లో విషాదం చోటుచేసుకుంది. లఖిసరాయ్ జిల్లాలోని అశోక్‌ధామ్ ఆలయంలో సోమవారం తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. శ్రావణమాసం సోమవారం కావడంతో ఈ శివాలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. అయితే వారి మధ్యలో ఒక ఎలక్ట్రిక్ వైర్ తెగిపడిపోవడంతో ఒక్కసారిగా భయపడిపోయారు. షాక్ కొడుతుందనే ఆందోళనతో అక్కడినుంచి బయటకు పరిగెత్తే క్రమంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో గాయపడినవారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంపై ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. క్షతగాత్రులకు సత్వర చికిత్స అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలు రూ.4 లక్షల పరిహారం ప్రకటించారు.భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి వచ్చారు. దానికి తగ్గట్టే మేం ఏర్పాట్లు చేశాం. భయాందోళన కారణంగా వారు పరిగెత్తడంతో బారికేడ్లు పడిపోయాయి. దాంతో ఒకరిపై ఒకరు పడిపోయారు. ఈ ఘటనకు ఎలక్ట్రిక్ వైర్ కారణంగా తెలుస్తోంది. ధ్రువీకరించుకున్న తర్వాతే పూర్తి వివరాలు వెల్లడిస్తామని లఖిసరాయ్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ శైలేంద్ర కుమార్ వెల్లడించారు.

## కళ్యాణ, షాదీముబారక్ కొనసాగుతుంది

గత ప్రభుత్వం పక్కాగా అమలు చేయలేదు... అందుకే కోర్టుల్లో కేసులు వచ్చాయి

దీనిపై డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేస్తున్నాం... ధర్నాలు చేసే వారు పథకలంఓ తప్పిదాలపై మాట్లాడాలి

మీడియా సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి



**హైదరాబాద్, ఆగస్ట్ 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కళ్యాణ లక్ష్మి షాది, ముబారక్ గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కళ్యాణ లక్ష్మి పథకంపై వివరించారు. కళ్యాణ్ లక్ష్మి పథకం పై ఇప్పటివరకు జారీ చేసిన 8 జీవోలను ఒక పిటిషన్ హైకోర్టులో వేసిందన్నారు. అందులో భాగంగా ఈ పథకాన్ని ఆపాలని హైకోర్టు మధ్యంతర ఆదేశాలకు ఇవ్వడం జరిగింది. దీనిపై డివిజనల్ బెంచ్ కు అప్పీల్ కై వెళుతున్నాము. సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నాం అని మంత్రి తెలిపారు. ఈ పథంలోని లొసుగులు ఏదైనా ఉంటే మిగతా 2లో..

## ఉప్పల్ పరిధిలో మెడికో ఆత్మహత్య

యువకుడి మృతితో కటుంబంలో విషాదం

**హైదరాబాద్, ఆగస్ట్ 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** హైదరాబాద్‌లోని ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న కె. భరద్వాజ్ రెడ్డి (18) అనే మెడికో నిర్మాణంలో ఉన్న ఒక భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మెడికో బలవన్మరణానికి గురికావడంతో ఆయన కుటుంబంలో, ఉస్మానియా మెడికల్ కాలేజీలో తీవ్ర శోకఛాయలు అలముకున్నాయి. పోలీసుల కథనం ప్రకారం.. భరద్వాజ్ రెడ్డి తెల్లవారుజామున 3:20 గంటల ప్రాంతం నుంచి కనిపించకుండా పోయాడు. అతను ఇంట్లో కనిపించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు, స్నేహితులు , బంధువులు పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఎంత వెతికినా అతని ఆచూకీ లభించక పోవడంతో కుటుంబ సభ్యులు ఆవేదనకు గురయ్యారు. ఉదయం 8:30 గంటల సమయంలో స్థానికులు డయల్-100కు సమాచారం అందించడంతో ఉప్పల్ పోలీసులు తక్షణమే సంఘటనా మిగతా 2లో..

## బెంగాల్ తారాపీఠ్ హోటల్‌లో మంటలు

మంట క్షణాల్లో వ్యాపించడంతో ఏడుగురు మృతి

నిద్రలో ఉండగా తెల్లవారు జామున ప్రమాదం



**కోల్‌కతా, ఆగస్ట్ 17 (ఆర్ఎన్ఎ):** పశ్చిమ బెంగాల్ లోని బీర్‌భూమ్ జిల్లా తారాపీఠ్‌లో ఒక హోటల్‌లో మంటలు చెలరేగడంతో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం తెల్లవారుజామున గ్రౌండ్‌ఫ్లోర్‌లోని హోటల్ రిసెప్షన్‌లో ఈ మంటలు మొదలయ్యాయి. క్షణాల్లోనే భవనమంతా వ్యాపించాయి. అప్పుడు అతిథులంతా నిద్రలో ఉన్నారు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. ఓ నాలుగు అంతస్తుల హోటల్ భవనంలో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి ఏడుగురు సజీవ దహనం కాగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈరోజు తెల్లవారుజామున సుమారు 4 గంటల ప్రాంతంలో హోటల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒక్కసారిగా మంటలు మిగతా 2లో..

## బీహార్ ఆలయ తొక్కిసలాట ఘటన

తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 17 (ఆర్ఎన్ఎ):** బిహార్ లఖిసరాయ్‌లోని అశోక్ ధామ్ ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతికి గురయ్యారు. తొక్కిసలాటలో ఏడుగురు మృతి చెందడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రధాని పోస్టు చేశారు. బిహార్‌లోని లఖిసరాయ్‌లో జరిగిన తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలు కోల్పోవడం తీవ్రంగా కలచివేసింది. ఈ దుఃఖ సమయంలో మృతుల కుటుంబాలకు మిగతా 2లో..

## ఎన్‌టిఎ తప్పులకు విద్యార్థుల మూల్యం

సోషియాలజీ, ఇంగ్లీష్ పరీక్షల రద్దు దారుణం... మండిపడ్డ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 17 (ఆర్ఎన్ఎ):** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తీరుపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోమారు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూజీసీ-నెట్ పరీక్షలో సోషియాలజీ, ఇంగ్లిష్, కామర్స్ పరీక్షలను రద్దు చేసి సెప్టెంబర్‌లో మళ్లీ నిర్వహించాలని ఎన్‌టీఏ నిర్ణయించడంపై రాహుల్ గాంధీ ఫైర్ అయ్యారు. ఎన్‌టీఏ తప్పులకు వేలాది మంది విద్యార్థులు మూల్యం చెల్లించాల్సి వస్తోందని విమర్శించారు. ఎక్స్ వేదికగా స్పందించిన రాహుల్ గాంధీ.. 'మోదీజీ.. మీ ఎన్‌టీఏ ఏం చేసిందో చూడండి. జూన్ 22 నుంచి 30 వరకు సోషియాలజీ, ఇంగ్లిష్, కామర్స్ యూజీసీ-నెట్ పరీక్షలు జరిగాయి. దాదాపు రెండు నెలల తర్వాత ప్రశ్నపత్రాల్లో లోపాలు, గత ప్రశ్నల పునరావృతం కారణంగా ఈ మూడు పరీక్షలను ఎన్‌టీఏ రద్దు చేసింది. ఎన్‌టీఏ నిర్ణయం వల్ల ఏళ్ల తరబడి పరీక్షకు సిద్ధమైన వేలాది మంది అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవడం, ఫీజులు చెల్లించడం, దూర ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలకు ప్రయాణించాల్సి వస్తోంది. తప్పు చేసింది ఎన్‌టీఏ.. కానీ, శిక్ష అనుభవించేది మాత్రం విద్యార్థులా?' అని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షా వ్యవస్థ విద్యార్థులను దోపిడీ చేసే వ్యవస్థగా మారిందని రాహుల్ ఆరోపించారు. దేశంలో సరైన పరీక్షా వ్యవస్థ లేదంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాను కోటా, డెహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్‌లలో ఇదే విషయాన్ని ప్రస్తావించానన్నారు. 'ఇది విద్యా వ్యవస్థ కాదు.. డబ్బు, కాలం, మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసాన్ని తీసుకుని చివరికి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని వ్యవస్థగా మిగతా 2లో..

**మొదటి పేజీ తరువాయిలు**

## బెంగాల్ తారాపీఠ్ హోటల్‌లో మంటలు

చెలరేగాయి. ఏసీ యూనిట్లలో సాంకేతిక లోపం కారణంగా మంటలు వ్యాపించాయి. భారీగా మంటలు చెలరేగడంతో గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం క్షణాల్లోనే పొగ అలుముకుంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న సహాయక బృందాలు.. స్థానికులతో కలిసి రక్షణ చర్యలు చేపట్టారు. ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపు చేసి మృతులను, గాయపడిన వారిని రాంపూర్‌హాట్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, బాధితులంతా ప్రసిద్ధ కాళీ ఆలయాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులుగా తెలుస్తోంది. అగ్నిప్రమాద ఘటనపై కోల్‌కతాకు చెందిన ఓ బాధిత మహిళ అతిథి స్పందించారు. హోటల్ మొత్తం పొగతో నిండిపోయిందని, దాని వల్ల చాలా మంది తప్పించుకోలేక పోయారని తెలిపారు. అలాగే, పలువురు శ్వాస తీసుకోవడంలోనూ ఇబ్బంది పడ్డారని వెల్లడించారు. బయటకు వచ్చేందుకు దారీ కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు, ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హోటల్‌లో కనీస అగ్నిమాపక భద్రతా చర్యలు లేవని ప్రాథమిక దర్యాప్తులో తేల్చారు. ÷ర్ అలారం కూడా పనిచేయలేదని పేర్కొన్నారు. బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బీహార్ ఆలయ తొక్కిసలాట ఘటన

నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాను. బాధితులకు స్థానిక యంత్రాంగం సహాయం అందిస్తోంది' అని ప్రధాని మోదీ అన్నారు. మరోవైపు, బాధితులకు బిహార్ ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ప్రమాదం గురించిన వివరాలను లఖిసరాయ్ జిల్లా మేజిస్ట్రేట్ శైలేంద్ర కుమార్ వెల్లడించారు. శ్రావణ మాసం సందర్భంగా జలాభిషేకం చేసేందుకు వేలాది మంది భక్తులు అశోక్ ధామ్ ఆలయానికి చేరుకున్నట్లు తెలిపారు. దర్శనం కోసం మహిళలు, పురుషులు రెండు క్యూ లైన్లలో నిలబడి ఉండగా.. పురుషుల క్యూ లైన్‌కు సమీపంలో విద్యుత్ స్తంభం అకస్మాత్తుగా కూలిపోయిందన్నారు. స్తంభానికి ఉన్నది కేబుల్ వైర్ అయినప్పటికీ.. విద్యుత్ వైర్ అనే పుకారు క్షణాల్లో వ్యాపించిందని పేర్కొన్నారు. దీంతో తొక్కిసలాట జరిగిందని తెలిపారు. రెండు నిమిషాల వ్యవధిలో ఏడుగురు మృతి చెందగా.. దాదాపు 12 మందికి పైగా గాయపడినట్లు జిల్లా మేజిస్ట్రేట్ పేర్కొన్నారు. బాధితులను వెంటనే చికిత్స నిమిత్తం సదర్ ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు. మృతులు, గాయపడిన వారి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు.

## ఎన్‌టిఎ తప్పులకు విద్యార్థుల మూల్యం

మారింది' అని రాహుల్ విమర్శలు గుప్పించారు. యూజీసీ-నెట్ ప్రశ్నపత్రాలు పరీక్షకు ముందే లీకయ్యాయా? అని రాహుల్ గాంధీ సందేహం వ్యక్తం చేశారు. ఈ ప్రశ్నకు ఎన్‌టీఏ ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారాయన. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మొదటి అడుగు మాత్రమేనన్న రాహుల్ గాంధీ.. ఎన్‌టీఏ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'సెప్టెంబర్‌లో మళ్లీ పరీక్ష రాయనున్న ప్రతి విద్యార్థికి చెబుతున్నా.. మీరు సమస్య కాదు. పరీక్షను నిర్వహించలేని వ్యవస్థను ప్రధాని మోదీ ప్రభుత్వం నిర్మించింది. ఆ వ్యవస్థ చేసిన తప్పులకు ఇప్పుడు విద్యార్థులనే బాధ్యులుగా చేస్తోంది. మీ విలువైన సంవత్సరాలు వృథా అవుతున్నాయి. దీనిపై మోదీ సమాధానం చెప్పే వరకు మేము ప్రశ్నిస్తూనే ఉంటాం' అని రాహుల్ గాంధీ అన్నారు.

## తెలంగాణలో సర్ జాబితా విడుదల

అందుకున్న ఓటర్లు సంబంధిత పత్రాలను సమర్పించి తమ వివరాలను నిర్ధారించు కోవాలని సూచించారు. నోటీసులు అందుకున్న వారు వీలైనంత త్వరగా స్పందించాలని కోరారు. ఏ కారణంతో నోటీసు జారీ చేశామో స్పష్టంగా తెలియజేస్తామని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఓటు తొలగింపుపై అభ్యంతరాలు ఉన్నవారు తమ అభ్యంతరాలను సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాలు, సంబంధిత దరఖాస్తులను పరిశీలించనున్నట్లు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. పరిశీలన పక్రియ పూర్తయిన అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. సర్ పక్రియను పూర్తి చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మందికి పైగా అధికారులు పాల్గొంటారని సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. ఎవరి ఓట్లు అయినా లేకపోతే ఫారం 6ఏ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ముసాయిదా జాబితాను ఎన్నికల అధికారులు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

## ఉప్పల్ పరిధిలో మెడికో ఆత్మహత్య

స్థలానికి చేరుకున్నారు. నిర్మాణంలో ఉన్న భవనం కింద తీవ్ర గాయాలతో పడి ఉన్న భరద్వాజ్ రెడ్డి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. భరద్వాజ్ రెడ్డి ఆత్మహత్యకు గల స్పష్టమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, చదువుల ఒత్తిడి లేదా ఇతర వ్యక్తిగత కారణాలు ఏవైనా ఉన్నాయా అనే కోణంలో విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

## పరిశ్రమలతో విద్యార్థుల కనెక్ట్ చేసే యత్నం

యజమానులు కలిసి చేస్తున్న మంచి ప్రయత్నం ఇది అని చెప్పుకొచ్చారు. ఈ ప్రాంతంలో, దేశంలో నిరుద్యోగం పెద్ద సమస్యగా మారిందన్నారు. టామ్ కామ్ సంస్థ ద్వారా విదేశాల్లో ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. స్థానిక పరిశ్రమలకు కూడా ఉద్యోగులను, స్కిల్డ్ లేబర్‌ను అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యార్థులు కేవలం సాఫ్ట్‌వేర్ పైనే దృష్టి సారించకుండా... ఇంకా చాలా రంగాల్లో కూడా మంచి అవకాశాలు ఉన్నాయని అన్నారు. సింగరేణి ప్రాంతం మందమర్రిలో జర్మన్ నేర్పిస్తున్నామని.. వారిలో బీ2 లెవల్ వచ్చిందన్నారు. వారి కోసం రూ.25 లక్షల జీతం ఎదురుచూస్తోందని తెలిపారు.

## ప్రజల భద్రత, రక్షణ, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

ఏకీకృత వ్యవస్థగా 'తెలంగాణ సేఫ్' తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ ను అమలులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు వేర్వేరుగా ఉన్న ఆహార భద్రత, ఔషధ నియంత్రణ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి, ప్రజారోగ్య పరిరక్షణకు ఈ నూతన అథారిటీ ద్వారా కఠిన ప్రమాణాలు అమలు చేయనున్నట్లు తెలియజేశారు. దీని ద్వారా మార్కెట్లో లభించే ఆహార పదార్థాల్లో కల్తీని నిరోధించడం, నకిలీ , ప్రమాదకర మందుల విక్రయాలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. క్షేత్రస్థాయిలో తనిఖీలు పెరిగి, నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిపై తక్షణ చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది. ఫలితంగా పౌరులకు సురక్షితమైన ఆహారం, సమర్థవంతమైన మందులు అందుబాటులోకి వచ్చి, ప్రజారోగ్యానికి సంపూర్ణ భద్రత చేకూరుతుంది. నాణ్యమైన ఆహారం, సురక్షితమైన మందులు అందించడమే లక్ష్యంగా పనిచేసే సేవలను ఉపయోగించుకుంటూ, ఆరోగ్యవంతమైన, సురక్షితమైన తెలంగాణ నిర్మాణంలో రాష్ట్ర పౌరులందరూ భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

## కళ్యాణ, షాదీముబారక్ కొనసాగుతాయి

(మొదటి పేజీ తరువాయి)

అది గత ప్రభుత్వం 2014లో చేసిన పొరపాటు వల్ల తలెత్తినది. అప్పుడు సరైన రీతులో ఉత్తర్వులు ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. తమ ప్రభుత్వం త్వరలో గత ప్రభుత్వం చేసిన అన్ని తప్పిదాలను సరిచేసి ఈ పథకం కొనసాగేలా చేస్తామన్నారు. గత ప్రభుత్వం పథకం లోప భూయిష్టమైన జీవోలు ఇవ్వడం వల్లే ఈ పథకం ఇలా అయిందన్నారు. కౌంటర్ ఫైల్ చేయడానికి అధికారుల లోపమా లేదా ప్రభుత్వంలో న్యాయపరమైన అంశాలు చూసే వారి లోపమా అని విచారణ చేస్తున్నాం.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ ప్రజలకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లు పేద కుటుంబాలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలని అన్నారు. పేదింటి ఆడబిడ్డ వివాహ సమయంలో కుటుంబంపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించడమే ఈ పథకాల ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. ఈ పథకాలను గత ప్రభుత్వం ప్రారంభించింది. రాజకీయాలకు అతీతంగా పేదల ప్రయోజనం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. పేదలకు నష్టం కలగకుండా న్యాయపరంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ప్రభుత్వం వినియోగిస్తుంది. రాజకీయ పిటిషన్లు పై ఈ పథకం ఎందుకు కొనసాగిస్తున్నారు అని స్టే ఇచ్చింది.. పథకాన్ని ఎత్తివేయలేదు..ఇది గత ప్రభుత్వ పథకం దీనిని ఎత్తివేయాలని మేము ఆలోచన చేయలేదు. గతంలో నిధులు కేటాయింపులకు సంబంధించిన ఇబ్బంది ఉన్న మేము వచ్చిన తర్వాత గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేసాం. వాళ్లు చేసిన అప్పులు.. దానిని తొలగించడానికి నిధుల సకాలంలో విడుదల చేయడానికి వ్యవస్థ ఏర్పాటు చేయలేదు.. పేద ల పిల్లల వివాహాలకు సామాజికంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి ప్రభుత్వం బాసటగా ఉండాలని ప్రభుత్వం భావిస్తుంది. 12 తారీకు స్టే విధించింది.. వచ్చే నెల 9 వరకు అవకాశం ఉన్నప్పటికీ అప్పటి వరకు వెయిట్ చేయకుండా కోర్టులో స్టే తొలగించడానికి ముందుకు పోయాం.. రోడ్ల మీద నిరసనలు చేస్తున్న నాయకులకు చెప్తున్న మీరు చేసిన జీవోల వల్లే పథకానికి ఈ పరిస్థితి వచ్చింది. అయినా మేము కొనసాగిస్తున్నాం అన్నారు. బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, పీసీసీ,మంత్రులు ,ఎమ్మెల్యేలు ,ఎమ్మెల్సీలు , ఎంపీలు, ప్రజా ప్రతినిధులు ,బలహీన వర్గాల నాయకులు ,కుల సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మొన్ననే ట్యాంక్ బండ్ పక్కన సామాజిక ఉద్యమ నాయకుడు మహాత్మా జ్యోతిబాపూలే సావిత్రి బాయ్ పూలే విగ్రహావిష్కరణ చేసుకున్నామని మంత్రి వివరించారు.

## 22ఎ భూములపై ఆందోళన వద్దు

(మొదటి పేజీ తరువాయి)

18005994788కు సంప్రదించాలన్నారు. భూములకు సంబంధించి అన్నీ సక్రమంగా ఉన్నవారు ఆందోళన చెందవద్దని పొంగులేటి అన్నారు. 22ఎ వల్ల ఇబ్బంది పడుతున్న ప్రజలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పారు. దీన్ని బూచిగా చూపి ప్రజలను ఆఫీస్‌ల చుట్టూ తిప్పితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వ్యవహారంలో సత్వర కేసుల పరిష్కారం కోసం ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జెన్యూన్ కేసుల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18005- 994788కి ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా 511 అప్లికేషన్లు, రంగారెడ్డి జిల్లాలో 146 అప్లికేషన్లు వచ్చాయి. హైదరాబాద్‌లో 49, సంగారెడ్డిలో 38 అప్లికేషన్లు వచ్చాయి. ప్రైవేటు భూమిని 22-ఎ కింద పెట్టారని 757 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇవన్నీ 22-ఎ జాబితాలోకి ఎందుకు వచ్చాయనే అంశంపై చర్చించాం. ప్రైవేటు ఆస్తుల యజమానులను ఇబ్బందిపెట్టాలనే ఉద్దేశం మాకు లేదు. గ్రౌండ్ రియాలిటీ ఎలా ఉందనే అంశంపై సమీక్షించాం. న్యాయంగా ఉన్నవాటిని త్వరలోనే నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం'.. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. కోర్టులకు వెళ్లాల్సిన పనిలేదు. అధికారులకు అప్లికేషన్స్ ఇస్తే చాలని మంత్రి వివరించారు. న్యాయబద్ధమైన మీ ఆస్తులకు తొందరగా క్లియరెన్స్ అభిస్తుంది. ప్రజలు ఆందోళన చెందవద్దు. కొన్ని ప్రాంతాల్లో అధికారుల తప్పిదాలను గుర్తించాం. కోర్టు ఆదేశాలను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయకపోవడం వల్లే సమస్య ఏర్పడింది. అధికారుల తప్పిదాలను సవరణ చేస్తున్నాం. నిజమైన కేసులు త్వరలోనే పరిష్కారం అవుతాయని అన్నారు.

## డబ్బులు దండుకోవడానికే నిషేధిత జాబితా

**ప్రజల్లో గందరగోళం రేపిన 22ఎ జాబితా... సీలింగ్ చట్టం ఎత్తేశాక మళ్లీ ఎందుకొచ్చింది**

**సిఎం రేవంత్ ఇల్లు జాబితాలో వచ్చాకనే చురుకు.... పాలనపై పట్టు లేదనడానికి ఇదే పెద్ద నిదర్శనం**

**మీడియా సమావేశంలో ప్రభుత్వ తీరుపై హరీష్ ఆగ్రహం**

**హైదరాబాద్, ఆగస్ట్ 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో 22ఎ సెక్షన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా భూములను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను తీవ్ర గందరగోళానికి, అయోమయానికి గురిచేస్తోందని.. బిఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. ఎవరి భూమి 22ఎలో ఉందో, ఎవరిది లేదో తెలియక రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారని మాజీ హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 1999లోనే అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశారు. మన రాష్ట్రంలో 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ చట్టాన్ని పూర్తిగా ఎత్తేశారు. కానీ ఆనాడు సీలింగ్ పరిధి నుంచి బయటపడి, క్లియర్ అయిన భూములను కూడా ఈ ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ తీసుకొచ్చి సీలింగ్ యాక్ట్ కింద 22ఎలో పెట్టడం ఏ రకమైన న్యాయం..ఈ ప్రభుత్వానికి కనీస అవగాహన, పాలనపై పట్టు లేదనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఏకంగా ఎయిర్‌పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు లాంటి ప్రభుత్వ భూములను కూడా 22ఎ నిషేధిత జాబితాలో పెట్టారంటే ఈ అధికారుల పనితీరు ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. హైదరాబాద్ నగరంలో లక్షలాది ప్రాపర్టీలను రాత్రికి రాత్రి ప్రొహిబిషన్ లిస్ట్‌లో చేర్చారు. శ్రీనగర్ కాలనీ సర్వే నంబర్ 8, 9లలో గత 20 ఏళ్లుగా ఇళు కట్టుకుని ప్రశాంతంగా నివసిస్తున్న ప్రజల ప్రాపర్టీలను కూడా ఇప్పుడు 22ఎలో పెట్టడం దుర్మార్గం. 30 ఏళ్ల క్రితం కొనుక్కున్న అపార్ట్‌మెంట్ ఎ÷-లాట్లను కూడా నిషేధిత జాబితాలో పెడితే ఆ ప్రజలు ఇప్పుడు ఎక్కడికి పోవాలని హరీశ్ రావు ప్రశ్నించారు. తమ ప్రాపర్టీ 22ంలో ఉందన్న విషయం చాలామంది సామాన్యులకు తెలియడం లేదు. తీరా రిజిస్ట్రేషన్ కోసం చలాన్లు కట్టి, డబ్బులు చెల్లించిన తర్వాత.. చివర్లో మీ భూమి 22ఎ లో ఉందని చెప్పి రిజిస్ట్రేషన్ ఆపేస్తున్నారు. పైగా రిజిస్ట్రేషన్ కోసం కట్టిన చలాన్ డబ్బులు కూడా వాపస్ ఇవ్వకుండా ప్రభుత్వం ప్రజల సొమ్మును నిలువునా దోచుకుంటోందని మండిపడ్డారు. గతంలో ప్రభుత్వం నుంచి అధికారికంగా ఔక్షఅ వచ్చిన భూములకు బ్యాంకులు కూడా లోన్లు ఇచ్చాయి. ఇప్పుడు అవే భూములను తీసుకొచ్చి 22ఎ లో పెట్టడంతో అటు ప్రజలు, ఇటు బ్యాంకులు ఇద్దరూ ఆగం అవుతున్నారు. బంజారాహిల్స్ హౌసింగ్ సొసైటీ లాంటి ప్రాంతాలను సైతం ప్రొహిబిషన్ లో పెట్టారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు హరీశ్ రావు. 22ఎ అనేది ఈ ప్రభుత్వానికి ప్రజలను అడ్డగోలుగా దోచుకునే ఒక ఆయుధంగా మారిందన్నారు. రెవెన్యూ శాఖలో ఏ పని కావాలన్నా, 22ం నుంచి భూమిని బయటకు తీయాలన్నా 30 శాతం కమిషన్ ఇవ్వాలనేది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. 30 శాతం కమిషన్ లేనిదే రెవెన్యూ శాఖలో ఒక్క ÷ల్ కూడా కదలడం లేదు. చివరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఎ ప్రొహిబిషన్ లిస్ట్‌లో ఉందంటే ఆశ్చర్యం కలుగుతోంది. తన సొంత ఇంటికి సెగ తగిలే సరికి ప్రభుత్వంలో హడావిడి మొదలైందన్నారు హరీశ్ రావు. మీకు చురుకు తగిలితేనే కానీ సామాన్యుల బాధలు పట్టవా.. ? స్వయంగా ముఖ్యమంత్రి పరిస్థితే ఇలా ఉంటే, ఇక రాష్ట్రంలో సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి..? వాళ్ల గోడు ఎవరు వినాలి. హంతకుడే సంతాప సభ పెట్టినట్లు ఉంది ఈ ప్రభుత్వ తీరని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. ముందు అడ్డగోలుగా భూములను 22ఎలో వేయడం, ఆ తర్వాత దాన్ని సరిచేయడానికి జీవోలు తెస్తాం, రివ్యూలు చేస్తాం అని డ్రామాలు ఆడటం ఎందుకు.. తప్పు జరిగినప్పుడు తక్షణమే ఆ భూములను 22ం నుంచి తొలగించాలి కానీ.. ఈ రివ్యూల పేరుతో కాలయాపన చేయడం వెనుక ఉన్న ఆంతర్యం ఏంటి..? కమిషన్ల కోసమేనా..? అసలు ఈ ప్రాపర్టీలను అందులో ఎవరు పెట్టారు? కమిషన్లు తీసుకుని ఎవరు తొలగిస్తున్నారు..? దీనిపై తక్షణమే విచారణ జరగాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 7, 2023 నుంచి భూములను ప్రొహిబిషన్ లిస్ట్ లో పెట్టిన వివరాలు ప్రభుత్వం వెంటనే వైట్ పేపర్ విడుదల చేసి నిజాలను ప్రజల ముందు ఉంచాలి. అప్పటిలోగా ఈ ఆస్తులన్నింటినీ దాని పరిధి నుంచి మినహాయించాలన్నారు .

## ఇక మండలస్థాయిలోనే ప్రజావాణి ఫిర్యాదులు

**గోవిందరావుపేటలో ప్రారంభించిన సీతక్క**

**ములుగు, ఆగస్ట్ 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని గోవిందరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో మంత్రి సీతక్క సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. గతంలో ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రతి సోమవారం ములుగు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని మంత్రి తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి మండల కేంద్రంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని



నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇకపై గోవిందరావుపేట మండల ప్రజలు సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానిక అధికారులకు దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలను స్వీకరించి, పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని మంత్రి సీతక్క సూచించారు. ఎమ్మార్వో సృజన్‌కుమార్, ఎంపీడీవో వరుణ్‌కుమార్‌లు ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో సృజన్‌కుమార్, ఎంపీడీవో వరుణ్‌కుమార్, వ్యవసాయ అధికారి జితేందర్, మండల విద్యాధికారి దివాకర్, మార్కెట్ చైర్మన్ కళ్యాణి, గ్రంథాలయ చైర్మన్ రవిచందర్, గోవిందరావుపేట మండల సహకార సంఘం చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి, పస్రా సర్పంచ్ సుమలతతో పాటు వివిధ శాఖల అధికారులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## దృష్టి మళ్లించి బంగారు ఆభరణాల చోరీ

**దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా గుట్టురట్టు**

**ఆరుగురు నిందితుల అరెస్ట్..భారీగా ఆభరణాలు స్వాధీనం**

**హైదరాబాద్, ఆగస్ట్ 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** హైదరాబాద్ నగరంలో గత కొంత కాలంగా అమాయకుల దృష్టి మళ్లించి బంగారు ఆభరణాల చోరీలకు పాల్పడుతున్న ముఠా గుట్టును లంగర్‌హౌస్ పోలీసులు ఛేదించారు. ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి భారీగా బంగారు ఆభరణాలు, నగదు, వాహనాలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితులు అమాయకులను టా÷-గ్గ్÷ట్ చేసుకొని వారి దృష్టిని మళ్లించి విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలను అపహరిస్తున్నారు. వరుసగా జరుగుతున్న చోరీలపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. సీసీటీవీ టీవీ ఫుటేజీలను పరిశీలించి, నిందితుల కదలికలను గుర్తించారు. ఆధారాలను సేకరించిన అనంతరం ఆరుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా.. దృష్టి మళ్లించి చోరీలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో సయ్యద్ అసద్, ఒమర్ ఖాన్, సయ్యద్ మొయిన్, అజర్ హుస్సేన్, మహ్మద్ ఇబ్రహీం, సయ్యద్ అబ్దుల్ మజీద్ ఉన్నారు. అరెస్టైన నిందితుల నుంచి మొత్తం 13.5 తులాల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో నాలుగు బంగారు గాజులు, మూడు బంగారు గొలుసులు, ఒక లాకెట్, మూడు ఉంగరాలు ఉన్నాయి. వీటితో పాటు రూ.7.40 లక్షల నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. చోరీలకు ఉపయోగించినట్లు అనుమానిస్తున్న ఆటో, ఒక ద్విచక్ర వాహనం, ఆరు సెల్‌ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన నిందితుల్లో కొందరిపై గతంలోనే వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో షీటర్ కేసులు ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది

## యువతిని హత్య చేసిన ప్రియుడు

**గర్భం దాల్చడంతో తప్పింకునే యత్నం**

**దుండగుడి కోసం పోలీసులు గాలింపు**

**హైదరాబాద్, ఆగస్ట్ 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** హైదరాబాద్‌లోని బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి దారుణ హత్యకు గురైంది. ప్రియురాలిని ప్రియుడు హత్య చేసినట్లు తెలుస్తోంది. ప్రియురాలిపై అనుమానమే ఈ హత్యకు కారణమని బాలాపూర్ పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందగానే ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని, క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. మృతురాలిని బిహార్‌కు చెందిన యువతిగా గుర్తించారు. స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్లో మృతురాలు పనిచేస్తోంది. మృతురాలికి ప్రేమ పేరుతో బాలాపూర్‌కు చెందిన అహ్మద్ దగ్గరయ్యాడు. ఇటీవల యువతి గర్భం దాల్చింది. ఈ విషయాన్ని అహ్మద్‌కు మృతురాలు చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఆమె గర్భం దాల్చడంతో తనను పెళ్లి చేసుకోవాలని అతడిని బలవంతం చేసింది. దీంతో ప్రియురాలిని అడ్డు తొలగించుకోవడానికి ప్రియుడు ప్లాన్ చేశాడు. తల్లిదండ్రులతో కలిసి యువతిని అహ్మద్ హత్య చేసినట్లు సమాచారం. నిన్న (ఆదివారం) రాత్రి మృతదేహాన్ని గోనే సంచిలో తరలిస్తుండగా స్థానికులు అనుమానించారు. వెంటనే పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. స్థానికుల సమాచారంతో రెడ్ హ్యాండెడ్‌గా అహ్మద్‌ను పోలీసులు పట్టుకున్నారు. అహ్మద్‌తో పాటు అతని తల్లిదండ్రులను కూడా అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ప్రస్తుతం ఉస్మానియా మార్చురీలో యువతి మృతదేహాన్ని ఉంచారు.

## హిందూమతంపై అనుచిత వ్యాఖ్యలు

**కేసు నమోదు చేసిన బిజెపి నేతలు**

**హైదరాబాద్, ఆగస్ట్ 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రముఖ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్‌కు షాక్ తగిలింది. ఈ మేరకు బోరబండ పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకులు ఆమెపై కేసు నమోదు చేశారు. హిందూమతంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని బీజేపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె వ్యాఖ్యలు కోట్లాదిమంది హిందువుల మనోభావాలను దెబ్బతీశాయంటూ ఫిర్యాదులో తెలిపారు. సోషల్ మీడియాలో మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని అనసూయకు బీజేపీ నేతలు వార్నింగ్ ఇచ్చారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసిన అనసూయపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'జై శ్రీరామ్' ముసుగులో కొందరు దాడులకు దిగుతున్నారంటూ అనసూయ సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ పోలీస్ కేసుపై తగ్గేదేలేదని అనసూయ అంటున్నారు. తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని ఆమె స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలతో దొంగలంతా బయటకు వస్తున్నారని.. ఈ విమర్శకులకు అనసూయ కౌంటర్ ఇచ్చారు.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం

**హైదరాబాద్, ఆగస్ట్ 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** హైదరాబాద్‌లోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బోడుప్పల్ శ్రీ సాయిరామ్ నగర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. 29 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రేగు మహేశ్ బలవన్మ రణానికి పాల్పడ్డాడు. బేగంపేటలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న మహేశ్.. కొన్ని రోజులుగా ముభావంగా ఉంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం మహేశ్ కుటుంబ సభ్యులు సొంతూరుకు వెళ్లారు. దీంతో మహేశ్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు, చెల్లిని మిస్ అవుతున్నానంటూ తన చెల్లికి మెసేజ్ పంపించాడు. ఆ మెసేజ్‌పై అనుమానం వచ్చిన చెల్లి.. సమీప బంధువు గిరిబాబుకు సమాచారం అందించి ఇంటికి వెళ్లి చూడాలని కోరింది. గిరిబాబు మహేశ్ ఇంటికి వెళ్లి పరిశీలించగా.. పడక గదిలో ఉరివేసుకున్న స్థితిలో మహేశ్ కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మహేశ్ బలవన్మరణానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. వ్యక్తిగత, కుటుంబ లేదా ఉద్యోగ సంబంధిత కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడికానున్నాయి.

## బిఆర్ఎస్ సంక్షేమ పథకాలకు ఎసరు

**కోటగిరి తహసిల్ ముందు బిఆర్ఎస్ ధర్నా**

**నిజామాబాద్, ఆగస్ట్ 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కేసీఆర్ తెచ్చిన సంక్షేమ పథకాలను నీరు గార్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారని కోటగిరి మండల బీఆర్ఎస్ నాయకులు తెల్ల రవికుమార్, మోరే కిషన్ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని తహశీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ సర్కార్ పథకాలను కొనసాగిస్తే కేసీఆర్ కు ఎక్కడ పేరు వస్తుందోనని కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. 2023 ఎన్నికల సమయంలో మహిళలకు ప్రతినెల మహాలక్ష్మి పథకం కింద రూ.2500, భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ప్రతినెల 1000 , ఆటో రిక్షా కార్మికులకు నెలనెలా 1000 పెన్షన్ ఇస్తామని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చి 33 నెలలు గడుస్తున్నా వాటిని అమలు చేయలేదని విమర్శించారు.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# సోలార్ పవర్‌లో స్వయం సమృద్ధి సాధించాలి!

దేశం అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించాలని, విదేశాలపై ఆధారపడడం మానుకోవాలని ప్రధాని మోడీ ఎర్రకోట్ నుంచి ఇచ్చిన సందేశం ఆలోచింపచేసేదిగా ఉంది. అయితే దేశాన్ని స్వయం సమృద్ధిగా నిలపాల్సిన బాధ్యత పాలకులదే. ముఖ్యంగా ఇంధన, ఆహార రంగాల్లో మనం మరింత బలం కావాల్సి ఉంది. 140 కోట్ల జనాభా కలిగిన భారత్ తన ఇంధన అసవరాల కోసం విదేశాలపై ఎక్కువగా ఆధారపడు తోంది. 88.5 శాతం ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటోంది. సహజవాయువు, పెట్రోలియం ఇలా అన్నింటికి గల్ఫ్, రష్యా, అమెరికా వంటి దేశాలే దిక్కు. అంతర్జాతీయ పరిణామాలకు భారత ఇంధన భద్రత ఒడిదొడు కులకు లోనవుతోంది. ఇటీవల హోర్ముజ్ జలసంధి, ఇరాన్ అమెరికా యుద్ధం వల్ల భారత్ లో ఎల్పీజీ కొరత ఏర్పడింది. ఎక్కువ దిగుమతుల వల్ల విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయి. ఒక్క యుద్ధం వస్తే ఎంతగా ఒడిదుడుకులకు లోనవుతాం. అందువల్ల సహజ వనరులను అభివృద్ధి చేసుకుంటూ పోవాలి. విదేశాల నుంచి అదేపనిగా అవసరం ఉన్నా లేకున్నా దిగుమతలును చేసుకోవడం వల్ల దేశీయంగా ధరలు పరుగులు పెడుతున్నాయి. ఈ దుస్థితి నుంచి మనం బయటపడాలి. ముఖ్యంగా ఉప్పులు, పప్పులు, నూనెలపై ఆంక్షలు విధించుకోవాలి. దేశీయంగా ఆహార ఉత్పత్తులను పెంచుకోవాలి. సేంద్రియ వ్యవసాయం తప్పనిసరి చేయాలి. ఇకపోతే గ్యాస్, పెట్ర తదితర ఉత్పత్తులపైనా ఆన్వేషణ సాగాలి. మన సముద్ర భాగాల్లోనే గ్యాస్ లేదా పెట్రోలియం నిల్వలు వెలుగులోకి వస్తే భారతదేశానికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ప్రధాని మోడీ కూడా సముద్ర మథనం గురించి చెప్పారు. ఆగస్టు 15 స్వాతంత్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్రమోడీ ప్రసంగిస్తూ.. సముద్ర మంథన్ ప్రాజెక్టు గురించి ప్రస్తావించారు. భారత జలాల్లో సముద్ర అడుగు భాగాల్లో ఇంధన వనరుల కోసం అన్వేషన కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్ని వెల్లడించారు. భారత్ తన ఇంధన అవసరాల్లో మెజారిటీ దిగుమతులపై ఆధారపడు తోంది. అయితే, గతంలో భారత్‌లో ఆఫ్‌షోర్ అన్వేషణకు సంబంధించిన ప్రాంతాల్లో దాదాపు 99 శాతం ప్రాంతాన్ని గతంలో 'నో-గో' జోన్‌లుగా ప్రకటించినట్లు, ఇప్పుడు వాటిలో చాలా ప్రాంతాలను అన్వేషణ కోసం తెరిచినట్లు ఆయన వెల్లడించారు. దీనివల్ల గ్యాస్, పెట్రోలియం వంటి ఇంధనాన్ని గుర్తించే పక్రియ మరింత వేగవంతం కానుంది. భారత్ ఇంధన నిల్వల్ని అన్వేషించేందుకు 'సముద్ర మంథన్' అనే నేషనల్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప÷-లోరేషన్ స్కీమ్ ప్రకటించింది. భారతదేశ సముద్ర తీర ప్రాంతాల్లోని బేసిన్లలో చమురు, సహజ వాయువు నిల్వలను గుర్తించి భవిష్యత్తులో ఉత్పత్తి పెంచడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. 2026 జూలై 31న కేంద్ర మంత్రివర్గం ఈ పథకానికి 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు రూ.84,084 కోట్ల వ్యయం చేయాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టులో సముద్ర అడుగుభాగంలోని భౌగోళిక నిర్మాణాలను గుర్తించేందుకు సిస్మిక్ సర్వేలు, డీప్ సీ, అల్ట్రా డీప్ వాటర్ డ్రిల్లింగ్,సైంటిఫిక్ డ్రిల్లింగ్, సాధారణ ఆఫ్‌షోర్ మౌలిక వసతులు, చమురు-గ్యాస్ తయారీ వంటివి ఉంటాయి. ఈ పథకం ద్వారా 600 మిలియన్ మెట్రిక్ టన్నులకు పైగా ఆయిల్ ఈక్వివలెంట్ హైడ్రోకార్బన్ నిల్వలు దేశానికి సమకూర్చవచ్చని, దేశీయ ఉత్పత్తి పెరుగుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ ప్రకారం భారత్‌కు తొమ్మిది ఆఫ్‌షోర్ బేసిన్లు ఉన్నాయి. ఇవి మొత్తం సుమారు 17.3 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్నాయి. ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం నో-గో ఏరియా ప్రాంతాలను 13.67 లక్షల చదరపు కిలోమీటర్ల నుంచి 24,832 చదరపు కిలోమీటర్లకు తగ్గించారు. దీని ద్వారా భారత్‌కు చెందిన 23.6 లక్షల చదరపు కిలోమీటర్ల ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్(ఇఇజి)లో సుమారు 99 శాతం ప్రాంతం అన్వేషణకు అందుబాటులోకి వచ్చింది. ఈ ఏరియాల్లో అన్వేషణ పెరుగుతుంది. అన్వేషణ పెరిగినంత మాత్రాన ఖచ్చితంగా గ్యాస్, పెట్రోలియం ఉంటుదని హామీ ఇవ్వదు. డీప్-సీ ఎక్స్‌ప్లోరేషన్ చాలా ఖరీదైనది, సాంకేతికంగా క్లిష్టమైనది, ఫలితాలు అనిశ్చితంగా ఉండే పక్రియ. అందుకే మెరుగైన భౌగోళిక డేటా, మరిన్ని డ్రిల్లింగ్ కార్యకలాపాలు, కొత్త మౌలిక వసతుల ద్వారా అన్వేషణ నుంచి ఉత్పత్తి దశకు చేరే అవకాశాలను 'సముద్ర మథన్' పెంచే ప్రయత్నం చేస్తోంది. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే భారత ఇంధన అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటం తగ్గుతుంది. అదే సమయంలో బయో ఇంధనాలపైనా ప్రయత్నాలు సాగాలి. పరిశోధనలు చేపట్టాల్సి ఉంది. సోలార్ పవర్ పరిశోధనలు విస్తృతం కావాలి. దీనిలో విజయం సాధిస్తే ఇంధన కొరతను అధిగమించవచ్చు. ఈ దిశగా పరిశోధనలు పెరగాలి. సోలార్ పవర్‌ను చౌకగా ఉత్పత్తి చేసుకునే దశకు చేరుకోవాలి. అప్పుడే మనకు భవిష్యత్ సులువు కాగలదు. అతిగా విదేవాలపై ఆధారపడాల్సిన ఆగత్యం పోతుంది. దీంతో ఇంధన అవసరాలతో పాటు, విద్యుత్ సంక్షోభం కూడా తొలగనుంది.

# సుప్రీంలో రాహుల్‌కు ఊరట

## ఆదాయిని మించిన ఆస్తుల కేసులో విచారణ నిలిపివేత



**న్యూఢిల్లీ,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ):** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై అలహాబాద్ హైకోర్టులో కొనసాగుతున్న విచారణను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు నిలిపివేయాలని ఆదేశించింది. అలాగే ఈ కేసులో సీబీఐ, ఈడీ ఎలాంటి నివేదికను ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టుకు సమర్పించకూడదని స్పష్టం చేసింది. రరాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చి, వి. మోహనాలతో కూడిన ధర్మాసనం విచారించింది. అలహాబాద్ హైకోర్టు ఇప్పటికే ఈ కేసులో తదుపరి విచారణను ఆగస్టు 20న చేపట్టనుంది. అయితే హైకోర్టు విచారణను తదుపరి ఆదేశాల వరకు వాయిదా వేయాలని తాజాగా సుప్రీంకోర్టు ఆదేశించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తమ దర్యాప్తు లేదా పరిశీలనకు సంబంధించిన ఎలాంటి నివేదికను హైకోర్టుకు సమర్పించకుండదని పేర్కొంది. రాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త విఘ్నేశ్ శిశిర్ చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ వ్యవహారం అలహాబాద్ హైకోర్టుకు వెళ్లింది. రాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలను పరిశీలించాలని సీబీఐ, ఈడీకి హైకోర్టు గతంలో సూచించింది. ఈ ఆదేశాలను రాహుల్ గాంధీ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అంతేకాకుండా ఈ కేసు విచారణను అలహాబాద్ హైకోర్టు నుంచి ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని ప్రత్యేక పిటిషన్ కూడా దాఖలు చేశారు.

# అప్పడు అర్బన్ నక్సల్స్...ఇప్పడేమో దిమాగీ నక్సల్స్

## ప్రధాని ఎర్రకోట్ ప్రసంగంలో ప్రస్తావనపై విమర్శలు... మండిపడుతున్న వివిధ రాజకీయ పార్టీల నేతలు

**న్యూఢిల్లీ,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ):** ప్రధాని నరేంద్రమోడీ స్వాతంత్య దినోత్సవ వేడుకల్లో ఎర్రకోట పై నుంచి దిమాగీ నక్సల్స్ అనే వ్యాఖ్యలు చేయడం ప్రతిపక్షాల్లో ఆగ్రహానికి కారణమవుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగంలో ఉపయోగించిన దిమాగీ నక్సల్ పదంపై రాజకీయ వివాదం కొనసాగుతోంది. ప్రధాని మోడీ ఈ వ్యాఖ్యపై కాంగ్రెస్, సీపీఐ, సమాజ్‌వాదీ తదితర ప్రతిపక్షాలు మండిపడ్డాయి. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ.. మోదీ గతంలో తన రాజకీయ ప్రత్యర్థులను అర్బన్ నక్సల్స్ అని పిలిచారని, ఇప్పుడు దిమాగీ నక్సల్స్ అంటున్నారని విమర్శించారు. ఇది ప్రధాని నిరాశకు సంకేతమని అన్నారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు దిమాగీ నక్సల్స్ అంటే ఎవరో చెబుతూ సోషల్ మీడియా పోస్ట్ పెట్టారు. దీనికి కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం వ్యంగ్యంగా స్పందిస్తూ.. తాను 'దిమాగీ నక్సల్స్‌గా ఉండటానికి గర్విస్తున్నారని అన్నారు. రిజిజు ప్రకారం, దిమాగీ నక్సల్స్ అంటే.. మావోయిస్టులకు మద్దతు ఇస్తూ భారత రాజ్యాంగాన్ని తిరస్కరించే వారు, వేర్పాటువాదులకు మద్దతు ఇచ్చేవారు, ఆర్టికల్ 370కు మద్దతు ఇచ్చేవారు, దేశ ఈశాన్య ప్రాంతాన్ని భారతదేశం నుంచి వేరు చేయడానికి చికెన్ నెక్‌ను తెంచాలని కోరుకునేవారు అని అన్నారు. ఇప్పుడు దిమాగీ నక్సల్స్ అనే పదంపై సీపీఎం, కాక్రోచ్ జనతా పార్టీ సహా పలువురు కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఎర్రకోటపై నుంచి జాతిని ఉద్దేశిస్తూ ప్రసంగించిన ప్రధాని నరేంద్రమోడీ.. అడవుల్లో ఆయుధాలు పట్టుకుని పోరాడిన నక్సలైట్లను దాదాపుగా అంతం చేశామని చెప్పారు. అయితే మావోయిస్టు భావజాలంతో ఉన్న దిమాగీ నక్సల్స్‌ఇంకా అవకాశాల కోసం చూస్తున్నారని, హింస, అశాంతికి దారి తీసే ప్రయత్నాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. దేశాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నాలను అడ్డుకోవాలంటే అలాంటి వారిని గుర్తించి ఏకాకులు చేయాలని మోడీ అన్నారు. ఈ పదాన్ని ఉపయోగించడంపై సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ స్పందించారు. ఈ పదాన్ని ప్రభుత్వాన్ని విమర్శించే వారిని, జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేపట్టే వారిని ఉద్దేశించి చేశారని ఆయన అన్నారు. గతంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లను విమర్శించే వారిని 'అర్బన్ నక్సల్స్'గా ముద్ర వేశారని, ఇప్పుడు ఇదే తరహాలో 'దిమాగీ నక్సల్స్' అనే కొత్త పదాన్ని తీసుకువచ్చారని బేబీ అన్నారు. మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా నక్సలిజాన్ని అంతం చేశామని చెబుతున్న విధానంపై బేబీ ప్రశ్నలు లేవనెత్తారు. యువకులు, యువతను పట్టుకుని న్యాయపక్రియ ముందు నిలబెట్టే బదులుగా ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఆరోపించారు. ఇది ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదమని అభివర్ణించారు. వామపక్షాలు నక్సలిజాన్ని ఎప్పుడూ సమర్థించలేదని బేబీ స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే, దిమాగీ నక్సల్స్ ఇప్పుడు రాజకీయ రచ్చకు దారి తీసింది.

# ఆటో డ్రైవర్ ఇంట్లో డబ్బుల మూటలు

## ఆయుధాల కోసం వెతికితే పట్టుబడ్డ నగదు

## 3 కోట్లుగా స్వాధీనం చేసుకున్న పోలీసులు

**భోపాల్,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ):** ఓ ఆటో డ్రైవర్ ఇంట్లో రూ.3 కోట్లు లభ్యమైన ఘటన మధ్యప్రదేశ్‌లోని సాగర్‌లో చోటుచేసుకుంది. ఆటో డ్రైవర్ ఇంట్లో మారణాయుధాలు ఉన్నాయని సమాచారం రావడంతో పోలీసులు సోదా చేసేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున నగదు సంచులు కనిపించడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. దాదాపు ఐదు గంటల పాటు శ్రమించి నగదును లెక్కించారు. అనంతరం దానిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాగర్‌లోని గోపాల్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో డ్రైవర్ రాజేశ్ అహిర్వార్ తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతని కుమారుడు సౌరభ్ అహిర్వార్ ఇటీవల సోషల్ మీడియాలో ఓ ఫొటోను షేర్ చేశాడు. తుపాకీతో దిగిన ఆ ఫొటో స్థానికులను భయాందోళనలకు గురి చేసింది. అతని వద్ద మారణాయుధాలు ఉన్నాయనే ప్రచారం జోరుగా సాగింది. దీంతో విషయం పోలీసులకు చేరింది. ఆటో డ్రైవర్ ఇంట్లో ఆయుధాలు ఉన్నాయన్న కారణంతో వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడి ఇంటికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఎంత వెతికినా ఆయుధాలు లభించలేదు. అయితే, పెద్దఎత్తున నగదు సంచులు బయటపడ్డాయి. ఆటో డ్రైవర్ ఇంట్లో ఇంత పెద్దమొత్తంలో నగదు కనిపించడంతో పోలీసులు షాక్ అయ్యారు. వెంటనే నగదు లెక్కించే యంత్రాలను తెప్పించారు. సుమారు ఐదు గంటల పాటు శ్రమించి దాని విలువ రూ.3 కోట్లుగా తేల్చి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఈ నగదు ఎక్కడి నుంచి వచ్చిందని ఆటో డ్రైవర్ కుటుంబాన్ని పోలీసులు ప్రశ్నించారు. అయితే, ఆ డబ్బుతో తమకు ఎలాంటి సంబంధం లేదని వారు తెలిపారు. భోపాల్‌లో ప్రభుత్వ ఇంజనీర్‌గా పనిచేస్తున్న తమ బంధువు కుటుంబ సభ్యులదని వెల్లడించారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# అమెరికా గగనతలంలో తప్పిన ముప్పు

## ఢీకొనేంతగా దగ్గరకు వెళ్లిన రెండు విమానాలు... ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ చాకచక్యంతో ప్రయాణికులు సేఫ్

**న్యూయార్క్,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ):** ఆకాశంలో అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన రెండు విమానాలకు పెను ప్రమాదం తప్పింది. రెండింటికి ఒకటే నంబర్ ఉండటంతో అవి ఒకే మార్గంలోకి వచ్చి దాదాపు ఢీకొన్నంత పని అయ్యింది. అయితే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. అమెరికాలోని ఆరిజోనా రాష్ట్రం ఫీనిక్స్ ప్రాంతంలో అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన రెండు విమానాలు గాల్లో ఎదురెదురుగా వచ్చాయి. ఫీనిక్స్ స్కైహార్బర్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన జరిగింది. అందులో ఒక బోయింగ్ విమానం షికాగో నుంచి వస్తుండగా.. మరో విమానం అప్పుడే ఫీనిక్స్ నుంచి బయల్దేరింది. రెండింటికి ఒకటే ÷÷-లట్ నంబర్ ఉండటం (అమెరికన్ 2482), ప్రతికూల వాతావరణంవల్ల షికాగో విమానం ఆలస్యం కావడం రెండు విమానాలు ఒకే లైన్‌లోకి రావడానికి కారణమయ్యాయి. వేర్వేరు మార్గాల్లో వెళ్లే విమానాలకు ఎయిర్‌లైన్స్ ఇలా ఒకే నంబర్ ఇవ్వడం సాధారణమే. అయితే ఒకే కాల్ సైన్ ఉన్న విమానాలు ఒకే సమయంలో ఒకే ప్రదేశంలో ఉండటం మాత్రం అరుదుగా జరుగుతుంది. షెడ్యూలింగ్ పొరపాటు కారణంగా ఇలాంటి ఘటన చోటుచేసుకుంది. అయితే ఈ అసాధారణ పరిస్థితిని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ గుర్తించారు. అరైవల్, డిపార్చర్‌లో ఉన్న విమానాలకు వెంటనే వేర్వేరు సూచనలు చేశారు. అరైవల్‌లో ఉన్న విమానాన్ని ఎక్కువ ఎత్తు తీసుకోమని, డిపార్చర్‌లో ఉన్న విమానాన్ని తక్కువ ఎత్తులో ప్రయాణించమని సూచించారు. ఆ సూచనకు తగ్గట్టుగానే పైలట్లు తమతమ మార్గాలను మార్చుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. తాను 25 ఏళ్లుగా ఈ విధులు నిర్వర్తిస్తున్నానని, ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదని కంట్రోలర్ చెప్పారు. అయితే ఈ భద్రతాలోపంపై దర్యాప్తు జరుగుతున్నది.

# వేగంగా వెళుతూ డివైడర్‌ను ఢీకొన్న విద్యార్థి

## కాళీమందిర్ వద్ద ప్రమాదంలో విద్యార్థి మృతి

**హైదరాబాద్,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ):** నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాళీ మందిర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బీటెక్ విద్యార్థి డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మృతుడిని 23 ఏళ్ల వికాస్‌గా గుర్తించారు. కాళీ మందిర్ వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వికాస్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వికాస్ ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదం ఎలా జరిగింది? వాహనం అదుపుతప్పడానికి కారణమేంటి? రహదారి పరిస్థితులు, వేగం తదితర అంశాలు ప్రమాదానికి దారితీశాయా? అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. మృతుడి తల్లిదండ్రుల నుంచి పూర్తి వివరాలను సేకరిస్తున్నారు.

# విద్యార్థులను కలవండి..చర్చించండి

## జార్ఖండ్ సిఎం సోరెన్‌కు రాహుల్ లేఖ

**న్యూఢిల్లీ,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ):** జార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ విద్యార్థులు చేపట్టిన ఆందోళనపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను స్వయంగా కలిసి వారి సమస్యలను వినాలని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను కోరారు. ఈ మేరకు ఆగస్టు 14న సోరెన్‌కు రాహుల్ గాంధీ లేఖ రాశారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ , జార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించిన నియామక పరీక్షల్లో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీక్, నియామక పక్రియలో పారదర్శకత లోపించిందంటూ విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. రాంచీలో కొనసాగుతున్న ఈ నిరసనలు సోమవారం నాటికి 24వ రోజుకు చేరుకున్నాయి. విద్యార్థుల ఆందోళన ఇప్పటివరకు శాంతియుతంగానే సాగుతోందని, వారి డిమాండ్లు న్యాయమైనవని రాహుల్ గాంధీ తన లేఖలో పేర్కొన్నారు గత కొన్ని నెలలుగా దేశవ్యాప్తంగా ప్రశ్నపత్రాల లీకులు, విద్యా వ్యవస్థలో అవకతవకలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది జార్ఖండ్‌లోని పరిస్థితి మరింత తీవ్రతరం కాకుండా చూడటానికి ముఖ్యమంత్రి స్వయంగా విద్యార్థులను కలిసి వారి ఆందోళనలను వినాలి.

# టివికె మంత్రుల అవినీతి బాగోతం

## లంచాలు డిమాండ్ చేస్తున్నారన్న అన్నామలై

**చెన్నై,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ):** తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ ప్రభుత్వంపై మాజీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై సంచలన ఆరోపణలు చేశారు. ప్రభుత్వ టెండర్లు దక్కించుకునే కాంట్రాక్టర్ల నుంచి కొందరు మంత్రులు కమిషన్లు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆడియో రికార్డులు తన వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. అన్నామలై తాజా వ్యాఖ్యలు తమిళనాడు రాజకీయాలను ఒక్కసారిగా వేడెక్కించాయి. చెన్నైలో నిర్వహించిన పర్యావరణ అవగాహన కార్యక్రమంలో అన్నామలై పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి విజయ్ అవినీతికి వ్యతిరేకంగా స్పష్టమైన వైఖరితో ఉన్నారని, కానీ కొందరు మంత్రుల వ్యవహారశైలి అందుకు విరుద్ధంగా ఉందని ఆరోపించారు. గతంలో కీలక టెండర్ల విషయంలో కమిషన్ల డిమాండ్లు లేవని, ఇప్పుడు కొందరు మంత్రులు కాంట్రాక్టర్ల నుంచి వాటాలు అడుగుతున్నారని విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో తాము డబ్బులు ఖర్చు చేశామని చెబుతూ.. కాంట్రాక్టర్ల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని అన్నామలై ఆరోపించారు. రెండు శాతం ఇవ్వాలని, మూడు శాతం ఇవ్వాలని, అవసరమైతే నాలుగు శాతం ఇవ్వాలని అడుగుతున్నట్లుగా ఆడియో రికార్డులు తన వద్ద ఉన్నాయని అన్నారు. సందర్భంగా మంత్రులు, ఉన్నతాధికారులపై ముఖ్యమంత్రి విజయ్ మరింత నిఘా పెట్టాలని అన్నామలై సూచించారు. ప్రభుత్వం అవినీతి రహిత పాలనను లక్ష్యంగా పెట్టుకున్నప్పుడు, కిందిస్థాయిలో జరుగుతున్న అక్రమాలపైనా కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, విజయ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలానికే అవినీతి ఆరోపణలు రావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఆలోచన..ఆచరణ కెసిఆర్‌ది

## ప్రచారం..ఫలితం మాత్రం కాంగ్రెస్‌ది... సనత్‌నగర్ టిమ్స్‌పై హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ):** ఆలోచన, ఆచరణ కేసీఆర్‌ది అయితే.. ప్రచారం కాంగ్రెస్‌ది అన్నట్లుగా ఉందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు రేవంత్ రెడ్డి నియామక పత్రాలు ఇచ్చినట్టే.. కేసీఆర్ ప్రారంభించిన టిమ్స్ హాస్పిటల్స్ ప్రారంభోత్సవాల పేరుతో కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. సనత్‌నగర్‌లోని టిమ్స్ హాస్పిటల్ ప్రారంభోత్సవంపై ఆయన స్పందించారు. డేట్లు, డెడ్‌లైన్లు మార్చుకుంటూ పోయి, చివరకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తున్న దవాఖానలో కూడా పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురాకపోవడం శోచనీయమన్నారు. వెయ్యి కోట్ల రూపాయలతో నిర్మించిన హాస్పిటల్‌ను కేవలం ఓపీ సేవలకే పరిమితం చేయడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పేరు మార్చినంత సులువుగా హాస్పిటల్ కట్టిన చరిత్ర మార్చలేవన్నారు. హైదరాబాద్‌కు మూడు వైపులా మూడు టిమ్స్ హాస్పిటల్స్ (అల్వాల్, సనత్‌నగర్, ఎల్బీనగర్) ఏర్పాటు చేసి, పేదలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలన్నది కేసీఆర్ ఆలోచన. కరోనా తర్వాత భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని, వందేళ్ల ముందు చూపుతో కేసీఆర్ ÷ుఎఓ÷ూలకు రూపకల్పన చేశారన్నారు. 2022 ఏప్రిల్ 26న ఒకేరోజు మూడు ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ దవాకానలకు శంకుస్థాపన చేసి చరిత్ర సృష్టించారు. ప్రణాళిక కేసీఆర్‌ది.. శంకుస్థాపన కేసీఆర్‌ది.. నిధులు విడుదల చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. ఒక్కో ఆసుపత్రి వెయ్యి పడకల సామర్థ్యంతో తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ పేరుతో నిర్మించే మూడింటి నిర్మాణానికి రూ.2,679 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో శరవేగంగా సాగిన పనులు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నత్తనడకన సాగాయి. సకాలంలో పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. మూడున్నరేళ్ల సుదీర్ఘ కాలంలో పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించకుండా, కేవలం ప్రచారం కోసం నేడు ÷ుఎఓ÷ూ సనత్‌నగర్‌ను ప్రారంభిస్తున్నారు. కనీసం హాస్పిటల్‌కు నీటి సరఫరా కూడా కల్పించలేదు అంటే పేదల వైద్యం పట్ల వీరికి ఉన్న శ్రద్ధ ఏమిటో అర్థం అవుతుంది. కేసీఆర్ పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందించాలని ఆలోచిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పేదల నుంచి ఫీజులు వసూలు చేయాలని నిర్ణయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కండ్లు తెరవండి. కేసీఆర్ ఎంతో ముందుచూపుతో మొదలు పెట్టిన టిమ్స్, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పేదల నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయకుండా పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.

# అంజీర్ పండ్లతో అద్భుతమైన ఆరోగ్యం



ఎండబెట్టి డ్రై ఫ్రూట్స్ రూపంలోకి మార్చిన అంజీర్ పండ్లు మార్కెట్‌లో మనకు లభ్యమవుతున్నాయి. వీటిని అందరూ చూసే ఉంటారు. అయితే డ్రై ఫ్రూట్స్ రూపంలో దొరికే అంజీర్ పండ్లే కాదు, సాధారణ పండు రూపంలోనూ అంజీర్ మనకు లభిస్తుంది. ఈ పండును రెగ్యులర్‌గా తింటే దాంతో మనకు ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగుతాయి. మన శరీరానికి కావల్సిన ముఖ్యమైన పోషకాలు లభిస్తాయి. పలు అనారోగ్య సమస్యలు నయమవుతాయి. అంజీర్ పండ్లను తినడం వల్ల ఎలాంటి అద్భుతమైన లాభాలు కలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.

1. అంజీర్ పండ్లలో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది మనం తిన్న ఆహారాన్ని సులువుగా జీర్ణం చేసేందుకు ఉపయోగపడుతుంది. జీర్ణ వ్యవస్థ బాగా పనిచేస్తుంది. గ్యాస్, అసిడిటీ, మలబద్దకం వంటి జీర్ణ సంబంధ సమస్యలన్నీ దూరమవుతాయి.

2. అంజీర్‌లో పొటాషియం, సోడియం బాగా లభిస్తాయి. ఇవి రక్తపోటు (హైబీపీ) సమస్య నుంచి ఉపశమనాన్ని కలిగిస్తాయి. బీపీని కంట్రోల్‌లో ఉంచుతాయి.

3. రక్తహీనత సమస్య నేడు చాలా మందిని బాధిస్తోంది. అలాంటి వారు నిత్యం రెండు అంజీర్ పండ్లను భోజనానికి ముందు తిన్నట్టయితే వారిలో రక్తం బాగా పడుతుంది. హిమోగ్లోబిన్ స్థాయిలు పెరుగుతాయి. మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి విష జ్వరాల బారిన పడి ప్లేట్‌లెట్లు తగ్గిన వారికి ఈ పండ్లను తినిపిస్తే వెంటనే ప్లేట్‌లెట్లు పెరుగుతాయి.

4. అంజీర్ పండ్లను రెండు పూటలా భోజనానికి ముందు తింటే దాంతో పొట్ట నిండిన భావన కలుగుతుంది. దీనివల్ల ఎక్కువగా ఆహారం తీసుకోవడం తగ్గుతుంది. ఫలితంగా బరువు కూడా తగ్గుతారు. అంతేకాదు అంజీర్‌లో ఉండే పోషకాలు మన శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను కూడా తగ్గిస్తాయి.

5. నిత్యం అంజీర్ పండ్లను తింటుంటే గుండె సంబంధ సమస్యలు కూడా దూరమవుతాయి. అంజీర్ పండ్లలో ఉండే పెక్టిన్ అనే పదార్థం శరీరంలోని వ్యర్థ పదార్థాలను తొలగిస్తుంది. రక్తాన్ని శుద్ధి చేస్తుంది.

6. అంజీర్ పండ్లలో మెగ్నిషియం, మాంగనీస్, జింక్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి సంతానం కావాలనుకునే వారికి మేలు చేస్తాయి.

7. శరీర రోగ నిరోధక వ్యవస్థ పటిష్టమవుతుంది. క్యాన్సర్‌కు కారణమయ్యే పదార్థాలు నాశనమవుతాయి.

8. అంజీర్ పండ్లు మధుమేహం ఉన్నవారికి ఎంతగానో మేలు చేస్తాయి. భోజనానికి ముందు వీటిని తింటే అనంతరం రక్తంలో షుగర్ స్థాయిలు అంతగా పెరగవు.

9. ఆస్తమా వంటి శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు అంజీర్ పండ్లను తింటే ఆ అనారోగ్యాల నుంచి ఉపశమనం లభిస్తుంది.

10. అంజీర్ పండ్లలో కాల్షియం కూడా పుష్కలంగానే ఉంటుంది. వీటిని తినడం వల్ల ఎముకలు దృఢమవుతాయి. ఎముకలు విరిగి ఉన్న వారికి వీటిని పెడితే ఎముకలు త్వరగా అతుక్కుంటాయి.

11. గొంతు నొప్పి ఉన్నవారు అంజీర్ పండ్లను తింటే వెంటనే ఉపశమనం లభిస్తుంది. దగ్గు కూడా తగ్గుతుంది.

12. జ్వరం, చెవి నొప్పి, కడుపు నొప్పి వంటి సమస్యలు ఉంటే అంజీర్ పండ్లను తినాలి. దీంతో ఆయా సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.

## రోజుకో కప్పు



మన శరీరానికి శక్తినిచ్చే అద్భుతమైన ఆహారాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి వాటిలో శనగలు కీలకపాత్ర పోషిస్తాయి. వీటిని చాలా మంది గుగ్గిళ్ల రూపంలో తీసుకుంటారు. కొందరు వేయించిన శనగలను తింటారు. అయితే వీటిని రోజూ ఒక కప్పు మోతాదులో తీసుకుని వాటిని ఉడకబెట్టుకుని తింటే దాంతో అద్భుతమైన లాభాలు కలుగుతాయి. శరీరానికి శక్తి వస్తుంది. పోషకాలు అందుతాయి. శనగలను రోజూ తినడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.

1. శనగల్లో పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. ఇది శరీరంలో ఉన్న చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. దీంతోపాటు గుండె సంబంధ సమస్యలు రాకుండా ఉంటాయి.

2. నాన్‌వెజ్ తినలేని వారికి శనగలను ఒక వరమని చెప్పవచ్చు. ఎందుకంటే మాంసంలో ఉండే ప్రోటీన్లన్నీ శనగలలో లభిస్తాయి. రోజూ కప్పు శనగలను తింటే శరీరానికి కావల్సిన ప్రోటీన్లన్నీ లభిస్తాయి.

# మరి కాస్త మెరుగ్గా మేకప్





**మేకప్ చేసుకున్నా ముఖం ఎందుకలా డల్ గామారుతుందో తెలుసా** మన ఫేసియల్ ఫీచర్స్ ని హైలైట్ చేయడానికి మనం మేకప్ ని వాడతాము. తద్వారా, మంచి లుక్ ని పొందుతాము. అయితే, కొన్నిసార్లు మేకప్ అనేది లుక్ ని మరింత డల్ గా మార్చే ప్రమాదం ఉంది. మేకప్ ముఖ్య లక్ష్యం ముఖాన్ని మరింత కాంతివంతంగా అలాగే ప్రకాశవంతంగా మార్చడం. మరి, మేకప్ వలన మన లుక్ మరింత డల్ అవటం మనల్ని బాధిస్తుంది. కొన్నిసార్లు, కొన్ని మిస్టేక్స్ వలన మొత్తం మేకప్ దెబ్బతింటుంది. మేకప్ అనేది మేజిక్ టూల్ వంటిది. మన ఫేస్ ని కాంతి వంతంగా మార్చేందుకు తోడ్పడుతుంది. నిద్రలేనప్పుడు, ఆ ఒత్తిడి ముఖంపై స్పష్టంగా కనిపిస్తుంది. కాంకీలర్ తో ఈ లోపాన్ని దిద్దుకోవచ్చు. హైలైటర్ ను కూడా వాడవచ్చు. అంతేకాక, మేకప్ అనేది ముఖంలోని ఫీచర్స్ ని మరింత షార్ప్ గా మారుస్తుంది. ఒకవేళ మేకప్ ని సరైన విధానంలో అప్లై చేసుకోకపోతే పూర్తిగా వ్యతిరేకమైన ఫలితాలను పొందుతారు. ముఖంలోని అందం హైడ్ అయిపోతుంది. మేకప్ లోని పొరపాట్ల వలన డల్ గా నిస్తేజంగా కనిపిస్తారు. కాబట్టి, మేకప్ వేసుకునే సమయంలో ఈ విషయాలను గుర్తుంచుకుంటే మీ మేకప్ అనేది మ్యాజిక్ టూల్‌లా పని చేసి మీ ముఖాన్ని కాంతి వంతంగా అలాగే ప్రకాశ వంతంగా మారుస్తుంది.

1. అతి ఎక్కువ ప్రోడక్ట్స్ ని వినియోగించడం మేకప్ అనేది మన ముఖంలోని ఫీచర్స్ లుక్ ని మెరుగుపరిచేందుకు ఉపయోగపడుతుందన్న విషయం వాస్తవమే. అయితే, అన్ని రకాల ప్రోడక్ట్స్ ని వినియోగించడం సరైన ఆలోచన కాదు. అతిగా మేకప్ ప్రోడక్ట్స్ ని వినియోగించడం వలన మీ లుక్ పాడయ్యే ప్రమాదం ఉంది. అవును, బ్లష్, బ్రోన్జర్స్, కాంటర్ ప్రోడక్ట్స్ ని కలిపి ఎలా వాడాలో మనకు మేకప్ గురుస్ వివరించి ఉన్నారు. అయితే, వీటన్నిటినీ కలిపి వాడినప్పుడు, ముఖ్యంగా మీరు మేకప్ కి తక్కువ టైమ్ మాత్రమే కేటాయించగలిగినప్పుడు వీటిని ఎలాగోలాగా అప్లై చేసుకుంటే మీ లుక్ మొత్తం స్పాయిల్ అవుతుందన్న విషయాన్ని మీరు గ్రహించాలి. దానికి బదులుగా, క్లీన్సింగ్ తరువాత బీబీ లేదా సీసి వంటి మల్టీ టాస్కింగ్ క్రీమ్ ను వాడి మీ ముఖాన్ని మేకప్‌కి అనుగుణంగా మార్చుకుంటే మంచి ఫలితం లభిస్తుంది. ఒక ప్రోడక్ట్ తరువాత ఒక ప్రోడక్ట్ తో ముఖంపై లేయర్స్ ని తయారుచేసే బదులు అవసరమైన ప్రోడక్ట్స్ ని మాత్రమే వాడి అందాన్ని రెట్టింపు చేసుకోండి. ఈ క్రీమ్స్ కవరేజ్ తో పాటు బ్రైటెనింగ్ ఎఫెక్ట్ ని ఎస్ పీ ఎఫ్ తో పాటు అందిస్తాయి. ఇప్పుడు, బ్లష్ మరియు కాంటర్ ని అప్లై చేయండి.

2. రాంగ్ కలర్ ఈ మిస్టేక్ ని మనలో చాలా మంది చేస్తూ ఉంటారు. ఇంటెన్షనల్ గా కాకపోయినా పొరపాటుగా ఈ మిస్టేక్ జరుగుతూ ఉంటుంది. స్కిన్ టోన్ కి మ్యాచ్ అయ్యే మేకప్ ని ఎంచుకోవడం కాస్తంత కష్టమైన విషయమే. అందుకే, ప్రొఫెషనల్స్ హెల్ప్ ను మీరు తీసుకోవాలి. స్కిన్ టోన్ కి తగిన మేకప్ ప్రోడక్ట్స్ ని ఎంచుకోవాలి. మేకప్ ఆర్టిస్ట్ హెల్ప్ ని తీసుకోండి లేదా సేల్స్ కౌంటర్ లో ఉండే వాళ్ళ సహాయాన్ని తీసుకోండి. చాలా హై ఎండ్ మేకప్ స్టోర్స్ లో మంచి మేకప్ ఆర్టిస్ట్స్ అందుబాటులో ఉంటారు. ఫౌండేషన్ లో బాగా డార్క్ షేడ్స్ ని వాడితే మీరు మీరు ఏజ్డ్ గా కనిపించే ప్రమాదం ఉంది. బాగా లైట్ షేడ్ ని వాడితే మీ స్కిన్‌అనేదియాషీగా కనిపిస్తుంది.

3. చర్మానికి శ్వాస అందకపోవటం కొన్ని మేకప్ ప్రోడక్ట్స్ అనేవి స్కిన్ పోర్స్ ని శ్రిన్క్ చేస్తాయి. ఎక్కువగా అటువంటి ప్రోడక్ట్స్ ని వాడితే పోర్స్ క్లాగ్ అవుతాయి. ఇటువంటి, మేకప్ ప్రోడక్ట్స్ ని తరచూ వినియోగించకండి. అప్పుడప్పుడు మాత్రమే వీటిని వాడండి. వీటిని వలన చర్మం ఉక్కిరిబిక్కిరి అవుతుంది. నిర్జీవంగా మారుతుంది. మీ చర్మానికి అన్ని విధాలా మేలు చేసే ఫార్ములాస్ ఉన్న మేకప్ ప్రోడక్ట్స్ ని ఎంచుకోండి. మీ స్కిన్ టైప్ ని మైండ్ లో ఉంచుకుని ప్రోడక్ట్స్ ని ఎంచుకోండి. ఆయిలీ స్కిన్ కి సూట్ అయ్యే ప్రోడక్ట్స్ ని డ్రై స్కిన్ వారు వాడకూడదు.

4. ఎక్స్ఫోలియెట్ చేయకపోవటం చర్మంపై డెడ్ స్కిన్ పేరుకుపోయినప్పుడు మేకప్ ఫినిషింగ్ అనేది స్మూత్ గా జరగదు. మేకప్ అనేది యాషీగా కనిపిస్తుంది. డెడ్ స్కిన్ వలన చర్మం రఫ్ గా మారుతుంది కాబట్టి ఇలా జరుగు తుంది. హెవీ డ్యూటీ ఫౌండేషన్ ని వాడే ముందు జెంటిల్ స్క్రబ్‌తో చర్మాన్ని ఎక్స్ఫోలియేట్ చేసుకోవాలి. ఆ తరువాత టోనర్ మరియు మాయిశ్చర్ సహాయంతో చర్మాన్ని తగినంతగా హైడ్రేట్ చేసుకోవాలి. చర్మం ఆరోగ్యంగా ఉంటే మేకప్ తో చర్మ సౌందర్యం మరింత రెట్టింపవుతుంది.

5. ఎక్కువగా హైలైట్ చేయడం మెరుస్తున్నట్టు కనిపించడం ఈ రోజుల్లో ట్రెండీగా మారింది. అయితే, కొంతమంది ఈ లుక్‌ను అతిగా కోరుకుంటారు. అందువలన, హైలైటర్ ను విపరీతంగా వాడతారు. దాంతో, లుక్ మొత్తం పాడవుతుంది. ముఖంపై సహజసిద్ధంగా లైట్ పడే చోటే హైలైటర్ ను వాడాలి. నోస్ బ్రిడ్జ్, చీక్స్ వద్ద హై పాయింట్స్ మరియు క్యూపిడ్స్ బో వద్ద హైలైటర్ ను వాడాలి. హైలైటర్ వినియోగంలో తీసుకునే కొన్ని జాగ్రత్తలు మీ సౌందర్యాన్ని రెట్టింపు చేస్తాయనడంలో సందేహం లేదు.

6. కాంకీలర్ లో రాంగ్ షేడ్స్ ఫ్లాస్ నికవర్ చేసేందుకు కాంకీలర్ ఉపయో గకరంగా ఉంటుంది. బ్లేమిషెస్ ని కవర్ చేసి అండర్ ఐ ఏరియాని ప్రకాశ వంతంగా మార్చేందుకు అలాగే ముఖాన్ని కాంతివంతంగా మార్చేందుకు కాంకీలర్ తోడ్పడుతుంది. మీ యాక్చువల్ స్కిన్ టోన్ కంటే ఇది వన్ షేడ్ లైటర్ గా ఉండాలి. అంతకంటే తక్కువ షేడ్‌ను వాడితే ముఖంలోనిఫ్లాస్‌అనేవిఎక్కువగా కనిస్తాయి.

7. రాంగ్ లిప్ స్టిక్ షేడ్ ను వాడటం మీ స్కిన్ అనేది డల్ గా ఉన్నప్పుడు బ్రౌన్ మరియు న్యూడ్ వంటి కొన్ని షేడ్స్ ని మీరు అవాయిడ్ చేయాలి. ట్రూ రెడ్ లిప్స్టిక్ ని ప్రిఫర్ చేయండి. అందులో సరైన మోతాదులో బ్లూ మరియు ఆరెంజ్ టోన్స్ నిక్షిప్తమై ఉంటాయి. ఇవి ఇన్స్టెంట్ గా మీ ముఖాన్ని బ్రైటన్ చేసేందుకు తోడ్ప డతాయి. తద్వారా, మీ ముఖం కాంతి వంతంగా అలాగే ప్రకాశ వంతంగా మారుతుంది. ఈ షేడ్ అన్ని రకాల స్కిన్‌టోన్స్‌కిబాగా సూట్ అవుతుంది.



# వర్షాభావం వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

**ఏలూరు, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వర్షాభావం వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, డాక్టర్ ఎమ్ ఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అనుసరించి అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించి, చట్టబద్ధత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి రాయాంకుల లక్ష్మణరావు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మరియు కౌలు రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మార్పు రావాలి మార్పు కోరాలి అనే కార్యక్రమం సందర్భంగా రెండు సంఘాల ఏలూరు జిల్లా సమితుల ఆధ్వర్యంలో సోమవారం నాడు కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించడం జరిగింది. ధర్నా కార్యక్రమానికి ఏపీ కౌలు రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ను వెంకట్రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వలె మన రాష్ట్రంలో కూడా 2 లక్షల రూపాయల వరకు రైతుల రుణాలను మాఫీ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. పెరిగిన సాగు ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంట రుణాలు ఇవ్వాలని, ఎలాంటి హామీలు లేకుండా కౌలు రైతులకు ఆర్బిఐ నిబంధనల ప్రకారం రెండు లక్షల వరకు పంట రుణాలు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. పకృతి వైపరీత్యాలు వల్ల నష్టపోయిన రైతులకు గత మూడు సంవత్సరాల పంటల బీమా పరిహారం బకాయిల సుమారు 4400 కోట్లను వెంటనే చెల్లించాలని, ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించాలని వారు విజ్ఞప్తి చేశారు. వర్షాభావం వల్ల నష్టపోయిన రైతులకు గత రెండేళ్ల ఇన్పుట్ సబ్సిడీ బకాయిలు 1200 కోట్ల రూపాయలు తక్షణమే విడుదల చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, రైతులకు ఇస్తున్న అన్ని రైతులు కౌలు రైతులకు వర్తింపచేయాలని వారు కోరారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు రైతులందరికీ సబ్సిడీ కి అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. మొత్తం 25 డిమాండ్లతో వినతి పత్రాన్ని నాయకులు కలెక్టర్ కు సమర్పించారు. రైతుల ధర్నా కార్యక్రమానికి ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే, రైతు మరియు కౌలు రైతు సంఘాల నాయకులు కె. ఆనందరావు, కూచిపూడి నాగేశ్వరరావు, పంతగాని తిరుపతిరావు, మల్లిపూడి రంగారావు, ఎస్ నాగార్జున రావు, కే రామకృష్ణ, చందమాల వెంకటరత్నం, మేటకట్ల అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# ఆడబిడ్డలకు భరోసా ఏదీ

## కళ్యాణలక్ష్మిపై ఎందుకీ మౌనం... మండిపడ్డ మాజీమంత్రి పువ్వాడ అజయ్



**ఖమ్మం,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ):** సంక్షేమాన్ని సంక్షోభంలోకి నెట్టే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరి స్తోందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విమర్శించారు. పేదింటి ఆడబిడ్డలకు ఆర్థిక భరోసా కల్పించే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న ఉదాసీనతకు నిదర్శనమని ఆయన అన్నారు. ఆడబిడ్డ భారం కాదు.. భరోసా అనే భావనకు గత కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా రూపం ఇచ్చిందని అన్నారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహం ఆర్థిక భారంగా మారకుండా అండగా నిలిచిన ఈ పథకాలను నిర్వీర్యం చేయడానికి కుట్రలు చేసినా లేదా రద్దు చేసే ప్రయత్నాలు చేస్తే తెలంగాణ ఆడబిడ్డలు, వారి కుటుంబాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని పువ్వాడ హెచ్చరించారు.కల్యాణలక్ష్మి అంశం హైకోర్టు పరిధిలో ఉన్న సమయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు అనేక అనుమానాలకు తావిస్తోందని హైకోర్టు నాలుగుసార్లు గడువు ఇచ్చినా ప్రభుత్వం కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించారు. పేదింటి ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన కీలకమైన అంశంలో ప్రభుత్వం సరైన వాదనలు ఎందుకు వినిపించలేకపోయిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## తహసిల్దార్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు




**ఏలూరు, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గ్రామీణ పేదలకు సామాజిక న్యాయం–ఆత్మగౌరవం కల్పించాలని కోరుతూ ఆగస్టు 21వ తేదీ న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బి కే ఎం యు) ఆధ్వర్యంలో మండల తహసిల్దార్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలకు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల గురవయ్య బండి వెంకటేశ్వరరావు వ్యవసాయ కార్మికులకు పిలుపునిచ్చారు. మార్పు రావాలి--మార్పు తేవాలి అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఈనెల 21న జరిగే ఆందోళన కార్యక్రమాలను మండలాలలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కార్యకర్తలు పేద ప్రజల సమీకరించి పెద్ద ఎత్తున చేయాలని వారు కోరారు.పేద ప్రజలకు సాగుభూములు పంచాలని, దశాబ్దాల తరబడి సాగు చేస్తున్న భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని, పోడు భూములకు పట్టాలివ్వాలని, వి ఎస్ ఎస్ లో కేటాయించిన భూములను వైఎస్ఆర్ సభ్యులకు వ్యక్తిగత హక్కుపత్రాలు ఇవ్వాలని, గ్రామీణ ప్రాంతాలలో ఇంటి స్థలం లేని పేదలకు మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందన్నారు. 2005లో సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిత్ భారత్ జి రామ్ జి పథకాన్ని రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం కోరుతుందని గురవయ్య వెంకటేశ్వరరావు తెలిపారు.

## కళ్యాణలక్ష్మిని నిషేధించే కుట్ర... భూపాల్లపలిలో మాజీ ఎమ్మెల్యే ధర్నా

**జయశంకర్ భూపాలపల్లి,ఆగస్ట్17(ఆర్ఎన్ఎ):** కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిషేధించాలని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను నిరసిస్తూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ లో జాతీయ రహదారిపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిషేధించే కుట్రను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే మానుకోవాలని అన్నారు.

# కళ్యాణలక్ష్మిని అటకెక్కించే యత్నం

## ఇచ్చిన హామీలపై నోరుమెదపని ప్రభుత్వం... మండిపడ్డ మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి

**నిజామాబాద్, ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బకల్యాణలక్ష్మి అంశం హైకోర్టు పరిధిలో ఉన్న సమయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు అనేక అనుమానాలకు తావిస్తోందని హైకోర్టు నాలుగుసార్లు గడువు ఇచ్చినా ప్రభుత్వం కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు. పేదింటి ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన కీలకమైన అంశంలో ప్రభుత్వం సరైన వాదనలు ఎందుకు వినిపించలేక పోయిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కార్‌పై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి మొదలైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజాసంక్షేమం తిరిగి గాడిన పడాలంటే కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని స్పష్టం చేశారు. ఎన్నికల వేళ మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని, పింఛన్లను రూ.2000 నుంచి రూ.4 వేలకు పెంచుతామని, రూ.500లకే గ్యాస్ సిలిండర్, కల్యాణలక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఒక్క హామీని కూడా సంపూర్ణంగా నెరవేర్చలేకపోయిందని మండిపడ్డారు. వ్యవసాయంపై ఆధారపడిన గిరిజనులు, సాధారణ రైతులకు రేవంత్ సర్కార్ తీరని అన్యాయం చేస్తున్నదని ఆరోపించారు. రూ.2లక్షల రుణమాఫీ సగం మంది రైతులకు కూడా అందలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిరంతరాయంగా అందిన రైతుబంధును రూ.15 వేలకు పెంచుతామని చెప్పి ఉన్న రూ. 10వేలను కూడా సక్రమంగా ఇవ్వకుండా ఎగ్గొట్టి రైతులను ఆగం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలు ప్రతిరోజూ గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఫోన్ చేయగానే పొలాల వద్దకే ఎరువులు చేరే పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో యాప్‌ల పేరుతో రైతులను గందరగోళానికి గురి చేస్తున్నారని ఆరోపించారు. యూరియా, ఎరువుల కోసం అన్నదాతలు రోడ్లపై నిలబడాల్సిన దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరైన నిర్వహణ లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. క్వింటాలుకు 10 కిలోల వరకు తరుగు తీస్తూ రైతుల శ్రమను దోచుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో లగచర్లలో లంబాడాల భూములను కాపాడేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ నాయకులతో

## మహబూబ్‌నగర్‌లో ఘనంగా నిజాం మీర్ మహబూబ్ అలీ ఖాన్ 160వ జయంతి వేడుకలు



**మహబూబ్‌నగర్ ఆగస్టు 17 (నేటి మనదేశమ్):** : అసఫ్‌జాహీ రాజవంశానికి చెందిన ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీ ఖాన్ బహదూర్ 160వ జయంతి వేడుకలు మహబూబ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. నిజాం మీర్ మహబూబ్ అలీ ఖాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహబూబియా హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి రాజకీయ, సామాజిక, మత, ప్రజా రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిజాం మహబూబ్ అలీ ఖాన్ సేవలను, అసఫ్‌జాహీ పాలనలో చేపట్టిన సంక్షేమ, విద్యా, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు.కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన కెప్టెన్ బండారు రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తమీరే మిల్లత్ అధ్యక్షుడు జియావుద్దీన్ నాయర్, హజ్రత్ సయ్యద్ మర్దాన్ అలీ షా ఖాద్రీ దర్గా సజ్జాదా నషీన్ హజ్రత్ సయ్యద్ అబ్దుర్రజాక్ షా ఖాద్రీ, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబైదుల్లా కొత్వాల్, మహమ్మద్ అబ్దుల్ హాదీ అడ్వకేట్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కెప్టెన్ బండారు రంగారెడ్డి మాట్లాడుతూ అసఫ్‌జాహీ పాలన సెక్యులర్ భావాలతో అన్ని మతాలను కలుపుకొని సాగిందన్నారు. నిజాం మీర్ మహబూబ్ అలీ ఖాన్ బహదూర్ విశాల దృక్పథం, మానవతా విలువలు కలిగిన పాలకుడని పేర్కొన్నారు. ఆయన సేవలు, పాలనా విధానం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు.జియావుద్దీన్ నాయర్ మాట్లాడుతూ అసఫ్‌జాహీ కాలంలో చేపట్టిన పలు సంక్షేమ, విద్యా, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజల సంక్షేమానికి నిజాం మీర్ మహబూబ్ అలీ ఖాన్ చేసిన సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు.మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబైదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ మీర్ మహబూబ్ అలీ ఖాన్ మంచి మనసున్న, మానవతావాది, సెక్యులర్ భావాలు కలిగిన పాలకుడని అన్నారు. ఆయన పాలనలో అన్ని మతాల ప్రజలకు అభివృద్ధి అవకాశాలు లభించాయని పేర్కొన్నారు. మహబూబియా హాల్ అభివృద్ధి, ఆధునీకరణ, సుందరీకరణకు తెలంగాణ ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమం ముగింపులో హజ్రత్ సయ్యద్ అబ్దుర్రజాక్ షా ఖాద్రీ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలు ప్రేమ, సోదరభావం, శాంతి, పరస్పర ఐక్యతతో జీవించాలని పిలుపునిచ్చారు.నిజాం మీర్ మహబూబ్ అలీ ఖాన్ ఫౌండేషన్ మహబూబ్‌నగర్ అధ్యక్షుడు అబ్దుల్ రహీమ్ కార్యక్రమానికి హాజరైన అతిథులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ, సామాజిక నాయకులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఏడాది అసఫ్‌జాహీ పాలకుల చరిత్ర, సేవలు, జ్ఞాపకార్థ కార్యక్రమాలను నిర్వహిస్తూ నూతన తరానికి చారిత్రక వారసత్వంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.కార్యక్రమంలో మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ మహబూబ్‌నగర్ అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ హాదీ అడ్వకేట్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సంజీవ్ మోడీ రాజ్, ఖ్వాజా ఫయాజుద్దీన్, అన్వర్ పాషా, కార్పొరేటర్ పర్వీన్, మహమ్మద్ ఖలీల్, మహమ్మద్ హనీఫ్ అహ్మద్, సయ్యద్ అఫ్రోజ్ షా ఖాద్రీ, మహమ్మద్ జబ్బార్ ముజాహిద్, తయ్యబ్ బష్వార్, మహమ్మద్ ఇమ్రాన్ ప్రిన్స్, ఖాలిద్ నవీద్, సయ్యద్ సాదాతుల్లా హుస్సైనీ, మహమ్మద్ మొహ్సిన్ ఖాన్, మహమ్మద్ సలీం, మీర్ షోయబ్ అలీ, మహమ్మద్ ఫారూక్ ఖాన్, మహమ్మద్ ఇల్యాస్ ముజాహిద్, మహమ్మద్ అబ్దుర్రహ్మాన్, మహమ్మద్ కౌసర్, తఖీ హుస్సేన్ తఖీ, అబ్దుల్లా సున్నీ, పీర్ సాదిక్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అసఫ్‌జాహీ చరిత్ర, నిజాం మీర్ మహబూబ్ అలీ ఖాన్ బహదూర్ సేవలు, ప్రేమ, సోదరభావం, ఐక్యత సందేశాలను ప్రజలకు వివరించారు.

## హల్ద్వానీ ఘటనకు నిరసనగా మహబూబ్‌నగర్ లో భారీ ర్యాలీ,సత్యాగ్రహం



**మహబూబ్‌నగర్ ఆగస్టు 17 (నేటి మనదేశమ్):** : హల్ద్వానీ ఘటనను నిరసిస్తూ, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సంఘీభావంగా మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, సత్యాగ్రహ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి ఆధ్వర్యం వహించగా, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పసుల రాజు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. హల్ద్వానీ ఘటనపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. అణగారిన వర్గాల హక్కులు, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్‌రెడ్డి, కార్పొరేటర్ ఎంపీ ప్రవీణ్‌కుమార్, ఎస్సీ సెల్ టౌన్ అధ్యక్షుడు బొర్ర సురేష్, ఎస్సీ సెల్ టౌన్ వైస్ ప్రెసిడెంట్ వినయ్‌కుమార్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు, ఎస్సీ కుల పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులే టార్గెట్.. తాడు ఆటతో జూదం

– ఇద్దరి అరెస్ట్



**వేములవాడ, ఆగస్ట్ 18: నేటి మన దేశమ్ ప్రతినిధి** ఆలయానికి వచ్చే భక్తులను టార్గెట్‌గా చేసుకుని 'తాడు ఆట' పేరుతో జూదం నిర్వహిస్తున్న ఇద్దరిని వేములవాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండ జిల్లా ఐనవోలుకు చెందిన రాయపురం సురేందర్ (42), ఆత్మకూరుకు చెందిన పల్లకొండ దేవేందర్ (33)లను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. తాడు ఆట నిర్వహిస్తున్న ప్రాంతంపై దాడి చేసి నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి తాడు ఆటకు ఉపయోగించే సామగ్రి, అప్పర పెన్సిళ్లు, రూ.2 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. భక్తులు రద్దీగా ఉండే ప్రాంతాల్లో అమాయకులను మోసం చేస్తూ జూదం, ఇతర అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ హెచ్చరించారు. ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారమిచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలదే కీలక పాత్ర

**ప్రతి గ్రామం, పట్టణం నిఘా కెమెరాలతో అనుసంధానం కావాలి**

**ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార సంస్థలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి**

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**మల్యాల గ్రామ పంచాయతీలో 48 నూతన సీసీ కెమెరాల ప్రారంభం**





**జగిత్యాల/మల్యాల, ఆగస్టు 17(నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆధునిక కాలంలో నేరాల నియంత్రణ, కేసుల ఛేదన, నిందితుల గుర్తింపు, ప్రజల భద్రత పరిరక్షణలో సీసీ కెమెరాలు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నాయని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. ప్రతి పట్టణం, ప్రతి గ్రామం సీసీ కెమెరాల నిఘాలోకి వచ్చినప్పుడు పోలీసింగ్ మరింత సమర్థవంతంగా మారుతుందని పేర్కొన్నారు.కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మల్యాల గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన 48 నూతన సీసీ కెమెరాలను సోమవారం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజల రక్షణ, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు అమూల్యమైన సాధనాలుగా మారాయని అన్నారు. గ్రామంలోని ప్రతి వీధి, ప్రధాన కూడలి, రహదారి, మార్కెట్ ప్రాంతం, రద్దీగా ఉండే ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా అనుమానాస్పద కదలికలను సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు.నేరం జరిగిన సమయంలో ప్రత్యక్ష సాక్షులు అందుబాటులో లేకపోయినా సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలు పోలీసులకు కీలక ఆధారాలుగా ఉపయోగపడుతున్నాయని ఎస్పీ వివరించారు. దొంగతనాలు, చోరీలు, గొడవలు, రోడ్డు ప్రమాదాలు తదితర ఘటనల్లో నిందితుల కదలికలను గుర్తించేందుకు సీసీ కెమెరాల ఫుటేజీ ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు.ఇటీవల మల్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఓ దొంగతనం కేసులో కూడా సీసీ కెమెరాల సహాయంతో నిందితుడిని గుర్తించి అరెస్టు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. నేరం జరిగిన ప్రాంతం నుంచి నిందితుడు ఏ దిశగా వెళ్లాడు, ఎవరెవరిని కలిశాడు, ఏ వాహనాన్ని ఉపయోగించాడు వంటి వివరాలను సీసీ కెమెరాల ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.నేరాలను ముందుగానే అరికట్టడంలో కూడా సీసీ కెమెరాలు దోహదపడతాయని అన్నారు. నిఘా కెమెరాలు ఉన్న ప్రాంతాల్లో నేరాలకు పాల్పడే వ్యక్తులు అప్రమత్తంగా ఉంటారని, నేరం జరిగిన అనంతరం కూడా దర్యాప్తు వేగంగా పూర్తి చేసేందుకు కెమెరాల ఫుటేజీ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ప్రజల భాగస్వామ్యంతోనే కమ్యూనిటీ పోలీసింగ్ మరింత విజయవంతమవుతుందని ఎస్పీ అన్నారు. పోలీసులే ప్రతి ప్రాంతంలో కెమెరాలు ఏర్పాటు చేయడం సాధ్యం కాదని, అందువల్ల ప్రజలు కూడా బాధ్యతగా ముందుకు వచ్చి తమ పరిసరాల్లో నిఘా వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని సూచించారు.ప్రతి ఇంటి యజమాని తమ ఇంటి ప్రధాన ద్వారం, పార్కింగ్ ప్రాంతం, పరిసరాలను కవర్ చేసే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వ్యాపార సంస్థలు, దుకాణాలు, అపార్ట్‌మెంట్లు, గోదాములు, పెట్రోల్ బంకులు తదితర ప్రాంతాల్లో కూడా నాణ్యమైన కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.ప్రధాన రహదారులు, క్రాస్ రోడ్లు, బస్టాండ్లు, మార్కెట్ ప్రాంతాలు, రద్దీ కూడళ్లు వంటి ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రత్యేకంగా అవసరమని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలు తమ భద్రత కోసం ఏర్పాటు చేసుకునే కెమెరాలు వ్యక్తిగత రక్షణతో పాటు మొత్తం సమాజ భద్రతకు కూడా ఉపయోగపడతాయని అన్నారు.జగిత్యాల జిల్లాలోని పలు పట్టణాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో ఇప్పటికే పెద్ద సంఖ్యలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. జగిత్యాల, మెట్‌పల్లి, ధర్మపురి, కోరుట్లతో పాటు తాజాగా మల్యాలలో కూడా సీసీ కెమెరాల నెట్‌వర్క్‌ను విస్తరించడం జరిగిందన్నారు.సీసీ కెమెరాల ద్వారా పోలీసులకు అందుతున్న సమాచారం నేరాల దర్యాప్తులో కీలకంగా మారుతోందని తెలిపారు. నిందితుల గుర్తింపు, వారి కదలికలను ట్రాక్ చేయడం, నేరాలకు సంబంధించిన ఆధారాలను సేకరించడం వంటి అంశాల్లో సీసీ కెమెరాల ఫుటేజీ పోలీసులకు ఎంతగానో సహాయపడుతోందన్నారు.నేరం జరిగిన తర్వాత నిందితులను గుర్తించి అరెస్టు చేయడమే కాకుండా, కేసుల దర్యాప్తులో లభించే సీసీ కెమెరాల దృశ్యాలు న్యాయస్థానాల్లో కూడా కీలక ఆధారాలుగా నిలుస్తున్న సందర్భాలు అనేకం ఉన్నాయని ఎస్పీ వివరించారు.మల్యాల గ్రామ పంచాయతీ పరిధిలో 48 నూతన సీసీ కెమెరాల ఏర్పాటు కోసం సహకరించిన గ్రామ పంచాయతీ పాలక మండలి, ప్రజాప్రతినిధులు, స్థానికులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు. ప్రజల భద్రత కోసం గ్రామస్థాయిలో ఇలాంటి చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు.మల్యాల తరహాలో పరిసర గ్రామాల ప్రజలు కూడా ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. పోలీసు శాఖ, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే నేరాలను మరింత సమర్థవంతంగా నియంత్రించవచ్చని ఎస్పీ అన్నారు.సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామంలో భద్రతా వాతావరణం మరింత మెరుగుపడుతుందని, ప్రజలు నిర్భయంగా జీవించేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. నేరం జరిగిన తర్వాత స్పందించడం కంటే నేరాలకు ముందే అడ్డుకట్ట వేసే విధంగా నిఘా వ్యవస్థను బలోపేతం చేయడమే పోలీసుల లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మల్యాల సీఐ రాజ్‌కుమార్, ఎస్ఐ సందీప్, గ్రామ సర్పంచ్ బొట్ల జయప్రసాద్, ఉపసర్పంచ్ కట్కం వినయ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విదేశీ కలుపు జాతి మొక్కల నిర్మూలనపై అవగాహన

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**




**కామారెడ్డి,ఆగస్టు 17. (నేటి మనదేశమ్ ప్రతినిధి)** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆక్రమణ జాతి కలుపు మొక్కలను గుర్తించి నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు.కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఈకో ఫాన్ సొసైటీ ఆధ్వర్యంలో ఆక్రమణ జాతి కలుపు మొక్కల గుర్తింపు, నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు వి. విక్టర్, ఎన్ వై గిరి, అసిస్టెంట్ కలెక్టర్ రవి తేజ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఆక్రమణ జాతి కలుపు మొక్కలను అధికారులు, సిబ్బంది గుర్తించి తొలగించారు. ఆక్రమణ జాతి మొక్కల వ్యాప్తిని అరికట్టాలనే సంకల్పానికి ప్రతీకగా ఈకో ఫాన్ సొసైటీ రూపొందించిన 'థంబ్స్ డౌన్' సంకేతాన్ని కార్యక్రమంలో పాల్గొన్న వారంతా ప్రదర్శించారు.జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, ఆక్రమణ జాతి కలుపు మొక్కలు పంటల ఉత్పాదకతను తగ్గించడంతో పాటు స్థానిక వృక్షజాతుల పెరుగుదలను అడ్డుకుంటాయని, జీవ వైవిధ్యానికి హాని కలిగిస్తాయని తెలిపారు. నీటి వనరులు, వ్యవసాయ భూములు, అటవీ ప్రాంతాల్లో వీటి వ్యాప్తిని ప్రారంభ దశలోనే గుర్తించి నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి శాఖ అధికారులు, సిబ్బంది చొరవ చూపాలని సూచించారు. ఆక్రమణ జాతి మొక్కల నిర్మూలన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు నిర్వహించాలని, ప్రజల్లో కూడా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఈకో ఫాన్ సొసైటీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి మేట్టు సాయి సంపత్ మాట్లాడుతూ, ఆక్రమణ జాతి కలుపు మొక్కల వల్ల వ్యవసాయం, అటవీ ప్రాంతాలు, నీటి వనరులు, జీవ వైవిధ్యంపై కలిగే ప్రతికూల ప్రభావాలను వివరించారు. వీటి నిర్మూలనకు ప్రభుత్వ శాఖలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈకో ఫాన్ సొసైటీ రాష్ట్ర సమన్వయకర్త తలారి విక్రమ్ తెలంగాణలో సాధారణంగా కనిపించే ప్రధాన ఆక్రమణ జాతి కలుపు మొక్కలను గుర్తించే విధానాన్ని వివరించారు. ప్రతి శాఖ తమ కార్యాలయ పరిసరాల్లో ఎప్పటికప్పుడు నిర్మూలన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.అనంతరం అధికారులు, సిబ్బంది ఆక్రమణ జాతి కలుపు మొక్కల నిర్మూలనకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. స్థానిక జీవ వైవిధ్యాన్ని పరిరక్షించేందుకు అవగాహన కార్యక్రమాలను కొనసాగించాలని నిర్ణయించారు.

## నాగ దేవత ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా: నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ

**సిద్దిపేట ప్రజలకు నాగుల పంచమి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హరికృష్ణ**



**సిద్ద్‌పేట ఆగస్టు 17 నేటి మనదేశమ్ ప్రతినిధి :** సిద్దిపేట పట్టణంలో నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని నాగ దేవత ఆలయాన్ని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా నాగ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండేలా మంచి వర్షాలు కురవాలని ప్రార్థించారు.అనంతరం ఆలయ పూజారులు పూజల హరికృష్ణ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాగ దేవత ఆలయానికి ఎంతో విశిష్టత ఉందని, పురాతన ఆలయం అని ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.సిద్దిపేట ప్రజలందరికీ నాగుల పంచమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం, శాంతి వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశీస్సులతో ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తానని హరికృష్ణ పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపిక్రిష్ణ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొమ్మల యాదగిరి,కలీముద్దున్ అహ్మద్,దాస అంజన్న,మార్క సతీష్,డీసీసీ మహిళా అధ్యక్షులు ముద్దం లక్ష్మి,బర్మా రాములు,అంజి రెడ్డి,ఖఎషి వైస్ చైర్మన్స్ బుస్స రాజశేఖర్ ,సాదుల పవన్ , కొడారి మల్లారెడ్డి,పుల్లూరి టెంపుల్ చైర్మన్ రాములు,వెంకట్ రెడ్డి,బంక చిరంజీవి,ఆత్మ కమిటీ మెంబెర్ చోట అజమాత్,టెంపుల్ డైరెక్టర్ ఉప్పెరెట్ల సంతోష,సుధీర్,దుర్గా ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు

## వాజ్‌పేయినగర్ రైల్వే గేట్ వద్ద ట్రాఫిక్ మళ్లింపు

**నేరెడ్‌మెట్ నుంచి వినాయక్‌నగర్ వైపు వాహనాలకు అనుమతి లేదు**



**నేరెడ్ మెట్ ఆగష్టు 17 (నేటి మనదేశమ్):** వాజ్‌పేయినగర్ రైల్వే గేట్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు మంగళవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు అమలు చేయనున్నట్లు మల్కాజ్‌గిరి ట్రాఫిక్ సీఐ బి. నర్సయ్య తెలిపారు. నిర్మాణ పనుల కారణంగా పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సూచించినట్లు చెప్పారు.నేరెడ్‌మెట్ ఎక్స్ రోడ్డు నుంచి వినాయక్‌నగర్ జంక్షన్, సఫీల్‌గూడ వైపు వెళ్లే సాధారణ వాహనాలను అనుమతించబోమన్నారు. వాహనదారులు నేరెడ్‌మెట్ ఎక్స్ రోడ్డు నుంచి సైనిక్‌పురి, కెనరా బ్యాంక్ జంక్షన్, ఓల్డ్ సఫీల్‌గూడ, వినాయక్‌నగర్ మీదుగా ఆనంద్‌బాగ్‌కు చేరుకోవచ్చని సూచించారు. మరో మార్గంగా వాయుపురి, కాకతీయనగర్, నేరెడ్‌మెట్ పాత పోలీస్‌స్టేషన్ సర్కిల్, వినాయక్‌నగర్ మీదుగా వెళ్లవచ్చని తెలిపారు.అదేవిధంగా సఫీల్‌గూడ, వినాయక్‌నగర్ జంక్షన్ నుంచి నేరెడ్‌మెట్ ఎక్స్ రోడ్డు వైపు వెళ్లే వాహనాలను ఓల్డ్ సఫీల్‌గూడ, డి-మార్ట్ వైపు మళ్లిస్తామని సీఐ తెలిపారు. అక్కడి నుంచి కెనరా బ్యాంక్ జంక్షన్, సైనిక్‌పురి మీదుగా నేరెడ్‌మెట్ ఎక్స్ రోడ్డుకు చేరుకోవచ్చన్నారు. ప్రత్యామ్నాయంగా నేరెడ్‌మెట్ పాత పోలీస్‌స్టేషన్ సర్కిల్, కాకతీయనగర్, వాయుపురి మీదుగా నేరెడ్‌మెట్ ఎక్స్ రోడ్డుకు వెళ్లవచ్చని వివరించారు.నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని, సూచించిన ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించి ప్రయాణించాలని బి. నర్సయ్య కోరారు. వాహనదారుల భద్రత, ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు ఈ మళ్లింపులు అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఖర్గేను అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**సామాజిక సమానత్వం, రాజ్యాంగ విలువలను కాపాడాలి**

**జగిత్యాలలో కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ధర్నా--నిరసన**



**జగిత్యాల, ఆగస్టు 17(నేటి మన దేశమ్ ప్రతినిధి):** ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే పాల్గొన్న కార్యక్రమం అనంతరం ఉత్తరాఖండ్ లోని రామ్‌లీలా మైదానాన్ని గంగాజలంతో శుద్ధి చేశారనే ఆరోపణలను నిరసిస్తూ జగిత్యాల జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. కుల వివక్ష, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసనకారులు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి జగిత్యాల జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం చైర్మన్, 16వ వార్డు కౌన్సిలర్ దూమాల రాజకుమార్ నాయకత్వం వహించారు. కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు.ఈ సందర్భంగా దూమాల రాజకుమార్ మాట్లాడుతూ.. మల్లికార్జున ఖర్గే దేశంలోని కోట్లాది మంది కాంగ్రెస్ కార్యకర్తలకు నాయకత్వం వహిస్తున్న జాతీయ స్థాయి నాయకుడని అన్నారు. అలాంటి నాయకుడు పాల్గొన్న వేదికను ఆయన వెళ్లిన అనంతరం గంగాజలంతో శుద్ధి చేశారనే ఆరోపణలు అత్యంత బాధాకరమైనవని పేర్కొన్నారు.ఇది ఒక వ్యక్తిని అవమానించడానికే పరిమితం కాదని, సామాజిక సమానత్వం, మానవ గౌరవం, రాజ్యాంగ విలువలపై దాడిగా భావించాల్సి ఉంటుందని అన్నారు. కులం, మతం, వర్గం ఆధారంగా ఎవరినీ తక్కువ చేసి చూడటానికి ఎవరికీ హక్కు లేదని స్పష్టం చేశారు.భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, సమాన గౌరవాన్ని కల్పించిందని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులుగా ఉన్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.దేశంలో సామాజిక సమానత్వం కోసం అనేక మంది మహనీయులు పోరాటం చేశారని రాజకుమార్ అన్నారు. కుల వివక్ష, అంటరానితనం వంటి భావజాలాలకు ఆధునిక భారతదేశంలో ఎలాంటి స్థానం ఉండకూడదని పేర్కొన్నారు.సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం దక్కేలా రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పౌర సమాజం బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. వ్యక్తుల రాజకీయ భావజాలాలు వేరుగా ఉన్నప్పటికీ వ్యక్తిగత గౌరవం, రాజ్యాంగ విలువలను కాపాడటం అందరి బాధ్యత అని అన్నారు.కాంగ్రెస్ ఎస్సీ విభాగం సామాజిక న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. దళితులు, వెనుకబడిన వర్గాలు, అణగారిన ప్రజల గౌరవాన్ని దెబ్బతీసే ఎలాంటి చర్యలను సహించేది లేదన్నారు.నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఖర్గేకు జరిగిన అవమానంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.సామాజిక సమానత్వం, మానవ గౌరవం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు."సామాజిక సమానత్వం కోసం పోరాటం కొనసాగిస్తాం.. రాజ్యాంగ విలువలను కాపాడుతాం" అని కాంగ్రెస్ ఎస్సీ విభాగ నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర కార్యదర్శి కొండ్లెపు అర్జున్, కౌన్సిలర్లు బడుగు రాజేందర్, బొల్లారపు గిరిధర్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పులి నర్సయ్య, నకుమాల్ల రాజు, దుమాల గంగాధర్, సర్పంచ్ గంగ నర్సయ్య, కొంగర పవన్ బాబు, దాసరి సతీష్, మ్యాదరి శ్రీహరి, గజ్జెల రాజు, సంకె మహేష్, మోర్తాటి రాజశేఖర్, తడగొండ లక్ష్మణ్, భూమేష్, దొబ్బలా వేణు, ఏనుగందుల బాబు, బాపూరాపు రమేష్, మల్యాల గంగాధర్, దుమాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గోగితా చిక్వాడ్జే దర్శకత్వంలో ..వారణాసి మేకింగ్ వీడియో




దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మహేశ్ బాబు, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి స్టార్ కాస్ట్‌తో తెరకెక్కుతున్న ఈ గ్లోబల్ అడ్వెంచర్‌పై రోజుకో ఆసక్తికరమైన వార్త బయటకు వస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మేకింగ్‌పై ఓ ఇంట్రెస్టింగ్ విషయం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాజమౌళితో పాటు మరో దర్శకుడు కూడా 'వారణాసి' ప్రాజెక్ట్‌లో భాగమయ్యారనే వార్త ఆసక్తిని పెంచుతోంది. అయితే ఆయన ప్రధాన సినిమాకు దర్శకత్వం వహించడం లేదు. 'వారణాసి' ఎలా రూపుదిద్దుకుంటోంది? రాజమౌళి టీమ్ ఎలాంటి కష్టపడుతోంది? నటీనటులు ఎలాంటి వర్క్‌షాప్స్‌కు హాజరయ్యారు? భారీ సెట్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ఎలా తెరకెక్కుతున్నాయి? వంటి అంశాలను చూపించే ప్రత్యేక మేకింగ్ డాక్యుమెంటరీని రూపొందించే బాధ్యతను ఆయన తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేకింగ్ డాక్యుమెంటరీ కోసం జార్జియాకు చెందిన దర్శకుడు గోగితా చిక్వాడ్జేను ఎంపిక చేసినట్లు సమాచారం. డాక్యుమెంటరీ చిత్రీకరణలో అనుభవం ఉన్న ఆయన.. 'వారణాసి' ప్రీ-ప్రొడక్షన్ దశ నుంచే తన కెమెరాలతో ఈ ప్రయాణాన్ని రికార్డ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నటీనటుల వర్క్‌షాప్స్, పాత్రల కోసం వారు చేస్తున్న ప్రత్యేక శిక్షణ, భారీ సెట్స్ నిర్మాణం, షూటింగ్ ప్రక్రియ, యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ వంటి అనేక కీలక అంశాలను ఈ డాక్యుమెంటరీలో చూపించనున్నట్లు సమాచారం. సాధారణంగా సినిమా విడుదలకు ముందు లేదా షూటింగ్ చివరి దశలో మేకింగ్ వీడియోలను రూపొందిస్తుంటారు. కానీ 'వారణాసి' విషయంలో మాత్రం సినిమా రూపకల్పన ప్రారంభమైనప్పటి నుంచే మేకింగ్‌ను డాక్యుమెంట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రాజమౌళి ఆలోచనా విధానం, ప్రీ-ప్రొడక్షన్‌లో ఆయన చేసే ప్లానింగ్, నటీనటుల ప్రిపరేషన్, భారీ స్థాయిలో విజువల్స్‌ను రూపొందించే విధానం వంటి విషయాలను ప్రేక్షకులు మరింత దగ్గరగా చూసే అవకాశం ఉంటుంది. రాజమౌళి సినిమాల మేకింగ్‌కు ప్రత్యేకమైన క్రేజ్ ఉంటుంది. 'బాహుబలి' చిత్రానికి సంబంధించిన మేకింగ్ కంటెంట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే 'ఆర్‌ఆర్‌ఆర్'కు సంబంధించిన మేకింగ్ వీడియోలు, షూటింగ్ విశేషాలు కూడా సోషల్ మీడియాలో భారీగా వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో 'వారణాసి' మేకింగ్ డాక్యుమెంటరీని మరింత భారీ స్థాయిలో రూపొందిస్తు న్నట్లు తెలుస్తోంది. సినిమా వెనుక ఉన్న అసలు శ్రమను, రాజమౌళి విజన్‌ను, అంతర్జాతీయ స్థాయిలో ప్రాజెక్ట్‌ను రూపొందిస్తున్న విధానాన్ని ఇందులో చూపించనున్నట్లు సమాచారం. 'వారణాసి' కేవలం భారతీయ మార్కెట్‌ను మాత్రమే కాకుండా అంతర్జాతీయ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్న సినిమా కావడంతో.. మేకింగ్ డాక్యుమెంటరీకి కూడా గ్లోబల్ స్థాయిలో మంచి డిమాండ్ ఏర్పడే అవకాశం ఉందని చిత్ర వర్గాలు భావిస్తున్నట్లు టాక్. సినిమా డిజిటల్ హక్కులతో పాటు మేకింగ్ డాక్యుమెంటరీని కూడా ప్యాకేజీలో భాగంగా చేసే ఆలోచనపై చర్చలు జరుగుతున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.




## రాముడి సుగుణాలు కనిపించాలంటే రావణుడి పాత్ర బలంగా ఉండాల్సిందే: యశ్



కన్నడ స్టార్ యశ్ ప్రస్తుతం 'టాక్సిక్', 'రామాయణ' చిత్రాలతో వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'రామాయణ' గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. రావణుడి పాత్రకి ఎందుకు ఓకే చెప్పారో వెల్లడించగా.. ఆ సమాధానం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. రాముడి మంచితనాన్ని, సుగుణాలను చూపించాలంటే రావణుడి పాత్రలో బాగా నటించాలి. నేను విలన్ పాత్రలకు న్యాయం చేయగలను. మంచి పాత్రలు చేసినా నావంతు ప్రయత్నం తప్పకుండా చేస్తాను. 'రామాయణ' కోసం మేమంతా ఇగోని పక్కన పెట్టాం. బెస్ట్ టీమ్‌తో కలిసి పనిచేస్తున్నాం. రామాయణం గురించి ప్రతి ఒక్కరికీ తెలిసే ఉంటుంది. నేను చిన్నప్పుడు మా తాత చెబితే ఒకలాగా ఊహించుకునే వాడిని. టీవీలో, సినిమాల్లో చూసిన తర్వాత ఆ ఊహ మారింది. అందరికీ తెలిసిన కథైనప్పటికీ దాన్ని కొత్తగా చూపించగలగాలి. అలా అని మతపరమైన భావాలను దెబ్బతీయకూడదు. ఇది చాలా కష్టమైన పని. నా స్నేహితుడు నమిత్ మల్హోత్రా ఈ సినిమా కోసం బాగా రిస్క్ తీసుకుంటున్నారు. ప్రేక్షకులు దీన్ని ఆదరిస్తారని నమ్ముతున్నానని యశ్ పేర్కొన్నారు. నితీశ్ తివారి దర్శకత్వంలో ముస్తాబైన ఈ బహుభాషా చిత్రంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్ నటించగా.. సీత పాత్రను సాయిపల్లవి పోషించారు. యశ్ ఇందులో రావణుడి పాత్ర పోషిస్తూనే నమిత్ మల్హోత్రాతో కలిసి నిర్మించారు. ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుండగా.. 'రామాయణ: పార్ట్ 1' ఈ దీపావళికి విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఇటీవల ట్రైలర్‌ని విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇక, యశ్ మరో సినిమా 'టాక్సిక్'.. ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ మూవీలో కియారా అద్వాణీ, నయనతార, రుక్మిణీ వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా తదితరులు కీలక పాత్రలు పోషించారు.

## పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తున్న విశ్వనాథ్ అండ్ సన్స్




సూర్య హీరోగా నటించిన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' తెలంగాణ బాక్సాఫీస్ వద్ద ఊహించని రీతిలో దూసుకెళ్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమా.. తొలి వీకెండ్‌లోనూ అదే జోరును కొనసాగించింది. ముఖ్యంగా నైజాం ఏరియాలో ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. వీకెండ్‌లో భాగంగా ఆదివారం మూడో రోజు నైజాం ప్రాంతంలో 'విశ్వనాథ్ అండ్ సన్స్' రూ.5.2 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. దీంతో తొలి మూడు రోజుల్లో నైజాంలో ఈ సినిమా మొత్తం రూ.14 కోట్ల గ్రాస్ మార్కును అందుకుంది. మొదటి మూడు రోజుల్లోనే ఈ స్థాయి వసూళ్లు రావడం సినిమాపై ఉన్న క్రేజ్‌ను తెలియజేస్తోంది. దేశవ్యాప్తంగా ఈ చిత్రానికి అత్యుత్తమంగా స్పందించిన ప్రాంతంగా నైజాం నిలిచినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. వీకెండ్‌లో భారీ వసూళ్లు సాధించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. సోమవారం నాటికి జీఎస్టీ మినహాయించి బ్రేక్ ఈవెన్ టా÷-గ్గ÷ట్‌ను అందుకునే అవకాశం ఉందని సమాచారం. ఇదే జోరు వర్కింగ్ డేస్‌లోనూ కొనసాగితే నైజాం డిస్ట్రిబ్యూటర్లకు మంచి లాభాలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే కథ, సూర్య నటన, వెంకీ అట్లూరి దర్శకత్వం సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తున్నాయి. విడుదలకు ముందు ఉన్న అంచనాలకు తగ్గట్టుగానే సినిమా ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంటోంది. దీంతో రోజురోజుకూ థియేటర్లలో ఆక్యుపెన్సీ పెరుగుతున్నట్లు తెలుస్తోంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో సూర్యకు జోడీగా మమితా బైజు నటించారు. సితార ఎంటర్‌టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. మొత్తానికి తొలి మూడు రోజుల్లోనే నైజాంలో రూ.14 కోట్ల గ్రాస్ సాధించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. రాబోయే రోజుల్లో ఎలాంటి వసూళ్లను నమోదు చేస్తుందో చూడాలి.

## చిరంజీవి పాత్రను ఎలివేట్ చేసేలా బాబీ సినిమా

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మరో క్రేజీ ప్రాజెక్ట్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ మూవీకి సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు మెగా అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. భారీ యాక్షన్ షెడ్యూల్‌లో భాగంగా కీలకమైన పోరాట సన్నివేశాలను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్స్ రామ్,లక్ష్మణ్ మాస్టర్స్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో ఫైటర్లతో ఈ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. సినిమాలో యాక్షన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉండటంతో ఈ సన్నివేశాలను అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి అభిమానులను ఆకట్టుకునేలా యాక్షన్ ఎపిసోడ్స్‌ను డిజైన్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇక ఈ సినిమా నుంచి మరో క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న యాక్షన్ షెడ్యూల్ పూర్తయిన తర్వాత వచ్చే వారం నుంచి స్పెషల్ సాంగ్ షూటింగ్ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ పాటలో చిరంజీవి పూర్తిగా స్టైలిష్ లుక్‌లో కనిపించనున్నారట. ఈ స్పెషల్ సాంగ్ కోసం మెగాస్టార్ లుక్‌ను ఇప్పటికే లాక్ చేసినట్లు సమాచారం. చిరంజీవి ఎనర్జీకి తగ్గట్టుగా పాటను డిజైన్ చేస్తున్నారని, తెరపై ఆయన స్టైలిష్ అవతార్ అభిమానులను మెస్మరైజ్ చేయడం ఖాయమని చిత్ర వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ సినిమాలో చిరంజీవి పాత్రను దర్శకుడు బాబీ చాలా ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. మెగాస్టార్ పాత్రలో పలు రకాల వేరియేషన్స్ ఉంటాయని సమాచారం. ఇప్పటివరకు చిరంజీవిని చూడని ఓ కొత్త కోణంలో ప్రేక్షకులకు చూపించాలనే ఉద్దేశంతో బాబీ ఈ కథను సిద్ధం చేసినట్లు టాక్. అదే సమయంలో సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్‌కు కూడా పెద్దపీట వేస్తున్నట్లు తెలుస్తోంది. యాక్షన్, ఎమోషన్, ఫ్యామిలీ డ్రామాతో పాటు చిరంజీవి స్టైల్, కామెడీ, మాస్ ఎలిమెంట్స్‌ను మేళవించి కథను రూపొందిస్తున్నట్లు సమాచారం.



# బిజినెస్ న్యూస్



## నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితుల వేళ.. ఐటీ, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో అమ్మకాల కారణంగా సూచీలు ఒత్తిడి ఎదుర్కొన్నాయి. దీంతో సెన్సెక్స్ వరుసగా రెండో సెషన్‌లో నష్టాలు చవిచూడగా.. నిఫ్టీ ఐదో రోజూ నష్టాల్లో ముగిసింది. ఇంట్రాడే కనిష్ఠాల నుంచి సూచీలు కోలుకోవడం ఊరటనిచ్చే అంశం. సెన్సెక్స్ ఉదయం 77,892.92 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,009.25) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో ఓ దశలో 77,453.75 వద్ద కనిష్ఠానికి పడిపోయిన సూచీ... చివరికి 281.09 పాయింట్ల పతనమై 77,728.16 వద్ద ముగిసింది. నిఫ్టీ 78.35 పాయింట్లు కోల్పోయి 24,287.65 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.61గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటాస్టీల్, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, బీఈఎల్, హెచ్‌డీఎఫ్‌సీ, ఎల్‌అండ్‌టీ, బజాజ్‌ఫైనాన్స్ షేర్లు మాత్రమే లాభాల్లో ముగిశాయి. మిగతా కంపెనీల షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 89.54 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 4,394.13 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## వాట్సప్‌లో పాన్, ఆధార్ వివరాలు.. రిస్క్ కొని తెచ్చుకున్నట్లే!



: రుణాల కోసం బ్యాంకు ఏజెంట్‌ను కలిసినప్పుడు.. పాన్, బ్యాంకు స్టేట్‌మెంట్ వంటి వివరాలు పంపించాలని అడుగుతుంటారు. ఏదైనా హోటల్ గదిలో దిగినప్పుడు ఆధార్ వివరాలు వాట్సప్ చేయాలని కోరుతుంటారు. స్థలం కోసం ఎవరైనా ప్రాపర్టీ బ్రోకర్‌ను కలిసినా కావాల్సిన వివరాలను వ్యక్తిగత నంబర్‌కు వాట్సప్ చేయాలని చెప్తుంటారు. వారు వివరాలు అడగ్గానే.. సులువుగా ఉంది కదా అని మీ వ్యక్తిగత వివరాలను వాట్సప్ చేయడమంటే కోరి రిస్కును కొనితెచ్చుకున్నట్లే. దీనివల్ల వ్యక్తిగత డేటా బహిర్గతం అయ్యే అవకాశం ఉందని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సమస్య ఇక్కడే..

ఒకసారి వ్యక్తిగత ధ్రువీకరణ పత్రాలను వాట్సప్ ద్వారా ఇతరులకు పంపినప్పుడు, అవతలి వ్యక్తి వాటిని తమ ఫోన్‌లో లేదా ల్యాప్‌టాప్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటారు. ఆ పత్రాలు ఆటోమేటిక్‌గా వారి క్లౌడ్ బ్యాకప్‌లో సేవ్ అవుతాయి. వాస్తవానికి మోసం చేయాలన్న ఉద్దేశం ఆ వ్యక్తికి లేకపోయినా.. ఎప్పుడైనా ఆ డివైజ్ లేదా వారి ఖాతా సైబర్ దాడికి గురైనప్పుడు మీ డేటా దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉంది. రేప్పొద్దున ఫలానా కంపెనీకి ఆయా వివరాలు పంపినప్పుడు దుర్వినియోగం అయ్యిందని చెప్పడానికీ ఉండదు. ఎందుకంటే మీరు పంపిన డేటా పద్ధతి ఆ కంపెనీకి సంబంధించిన సైబర్ సెక్యూరిటీ పరిధిలోకి రాదనే విషయం గుర్తుంచుకోవాలి.

మరేం చేయాలి?

ఆధార్, పాన్, బ్యాంక్ వివరాలు అడిగినప్పుడు వాట్సప్ ద్వారా ఎట్టి పరిస్థితుల్లోనూ వివరాలు పంపించొద్దు. కంపెనీ లేదా బ్యాంక్‌కు చెందిన అధికారిక లింక్‌ను లేదా డాక్యుమెంట్ అప్‌లోడ్ చేసే సెక్యూర్ పోర్టల్ లింక్‌ను పంపాలని అడగండి.

బ్యాంకులకు, రుణదాతలకు లేదా హోటల్ వంటి వ్యాపార అవసరాలకు ప్రత్యామ్నాయ వెరిఫికేషన్ పద్ధతులు ఉన్నాయోమో అడిగి తెలుసుకోండి. డిజిలాకర్ లేదా ఉడాయ్‌కి చెందిన ఆఫ్-లైన్ వెరిఫికేషన్ పద్ధతులు అందుబాటులో ఉంటే ఆ రూపంలో మీ వివరాలు ధ్రువీకరించుకోవాలని సూచించొచ్చు.

ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో వ్యక్తిగత ఫోన్ నంబర్‌కే పత్రాలను పంపాల్సి వస్తే, ఆ ఫైల్‌ను పాస్‌వర్డ్ ప్రొటెక్ట్‌తో షేర్ చేయడం మంచిది. ఆ పాస్‌వర్డ్‌ను విడిగా తెలియజేయండి. వీలైనంత వరకు ఆధార్‌లోని చివరి 4 అంకెలు మాత్రమే కనిపించే మాస్క్‌డ్ ఆధార్ కాపీలను ఉపయోగించండి.

## వంటగ్యాస్ కొరత రాకుండా చూద్దాం



పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో, సరఫరాలకు ఆటంకాలు ఏర్పడి, మన దేశంలో వంటగ్యాస్ (ఎల్‌పీజీ)కు తీవ్ర కొరత వచ్చి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భవిష్యత్తులో దిగుమతులకు అంతరాయం ఏర్పడినా, దేశీయంగా వంటగ్యాస్ కొరత రాకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపడుతోంది. అందుకే ప్రభుత్వ, ప్రైవేట్ రంగ రిఫైనరీలు, అప్‌స్ట్రీమ్ చమురు కంపెనీలకు తొలిసారిగా 'ఉత్పత్తి లక్ష్యాలను' కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ నిర్దేశించింది. దేశవ్యాప్తంగా ఉన్న 21 రిఫైనరీలు, అప్‌స్ట్రీమ్ కంపెనీలు కలిపి రోజుకు గరిష్ఠంగా 63,810 టన్నుల ఎల్‌పీజీని ఉత్పత్తి చేయగలవు. ఇది 2025-26లో దేశీయంగా జరిగిన ఎల్‌పీజీ ఉత్పత్తి కంటే రెట్టింపు కాగా, దేశ రోజువారీ అవసరాల్లో దాదాపు 70 శాతానికి సమానం. దేశంలో కొరత తలెత్తినప్పుడు ఈ లక్ష్యాలు తక్షణమే అమల్లోకి వస్తాయి. ఇందులో రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు అధిక కోటా లభించింది.

ఉత్పత్తి లక్ష్యాలు ఇలా..

రిలయన్స్ ఇండస్ట్రీస్: గుజరాత్ జామ్‌నగర్‌లోని రిలయన్స్ రిఫైనరీకి దేశంలోనే అత్యధికంగా రోజుకు 18,000 టన్నుల ఎల్‌పీజీ ఉత్పత్తి లక్ష్యాన్ని విధించారు. ఎగుమతుల కోసం ఉద్దేశించిన 35.2 మి.టన్నుల సామర్థ్యం కలిగిన యూనిట్‌కు ఎటువంటి లక్ష్యాన్ని పెట్టలేదు.

ప్రభుత్వ రంగ రిఫైనరీలు: ప్రభుత్వ రంగ చమురు సంస్థలకు చెందిన 18 రిఫైనరీలు సంయుక్తంగా రోజుకు 31,470 టన్నుల ఎల్‌పీజీని ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది.

నయారా ఎనర్జీ: వడినార్‌లోని నయారా రిఫైనరీకి రోజుకు 4,480 టన్నుల ఎల్‌పీజీ ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించారు.

అప్‌స్ట్రీమ్ కంపెనీలు: సహజవాయువు, ఎల్‌పీజీని వెలికి తీసే అప్‌స్ట్రీమ్ కంపెనీలైన ఓఎన్‌జీసీ, గెయిల్ సంస్థలకు రోజుకు 6,460 టన్నుల ఉత్పత్తి పరిమితిని కేటాయించారు.

రోజుకు 91,000 టన్నుల వినియోగం 2025-26లో దేశంలో మొత్తం 33.2 మిలియన్ టన్నుల ఎల్‌పీజీ వినియోగమైంది. అంటే రోజువారీ వినియోగం 91,000 టన్నులుగా ఉంది. ఇందులో దేశీయ ఉత్పత్తి 13.1 మి.టన్నులు మాత్రమే. మిగిలిన 21.3 మి.టన్నుల (రోజుకు 58,400 టన్నుల) అవసరాలు దిగుమతుల ద్వారానే తీరాయి. వంటగ్యాస్ అవసరాల్లో దాదాపు 64% దిగుమతులే తీర్చాయి. పశ్చిమాసియా సంక్షోభ సమయంలో పెట్రోరసాయనాల ముడిసరకును ఎల్‌పీజీకి మళ్లించడం, వంటి తాత్కాలిక చర్యలతో ఉత్పత్తిని రోజుకు 55,000 టన్నులకు పెంచగలిగారు.

## 12.5 కోట్ల మంది ప్రయాణించేలా దిల్లీ విమానాశ్రయ విస్తరణ



దేశంలోనే పెద్దదైన దిల్లీ విమానాశ్రయం.. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాబోయే 10 ఏళ్లకు మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తోంది. విమానాశ్రయ వార్షిక ప్రయాణికుల నిర్వహణ సామర్థ్యాన్ని ప్రస్తుత 10.6 కోట్ల నుంచి 12.5 కోట్లకు పెంచేందుకు దిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (డయల్) ప్రస్తుతం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం మూడు టెర్మినల్స్ సామర్థ్యం 10.6 కోట్లుగా ఉంది. ఇందులో టీ1 4.2 కోట్లు, టీ2 1.4 కోట్లు, టీ3 టెర్మినల్ 5 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయి. 2030 ఏప్రిల్ నాటికి ప్రయాణికుల వార్షిక నిర్వహణ సామర్థ్యాన్ని 11.6 కోట్లకు పెంచనున్నారు. 2032కి రెండో దశలో 12.5 కోట్లు చేయనున్నారు. 2036 ప్రణాళికలను భాగస్వాములందరితో చర్చించాక, ఖరారు చేయనున్నారు. టెర్మినల్ 3 వద్ద అదనంగా కోటి మంది ప్రయాణికుల సామర్థ్యంతో కొత్త 'పియర్ ఈ'ని 2030 ఏప్రిల్ నాటికి నిర్మించాలని ప్రతిపాదించారు. టెర్మినల్ 1 నుంచి టీ2, టీ3 మధ్య ప్రయాణికులు సులభంగా రాకపోకలు సాగించేందుకు ప్రతిపాదించిన 7.5 కిలోమీటర్ల ఆటోమేటెడ్ పీపుల్ మూవర్ (ఏపీఎం) వ్యవస్థకు ప్రస్తుతానికి తక్షణ నిర్ణయం తీసుకోకపోయినా, మాస్టర్ ప్లాన్‌లో స్థలాన్ని కేటాయిస్తారు. భవిష్యత్తు అవసరాలు, రద్దీని బట్టి టీ2ని టీ4గా మార్చే అంశాన్ని పరిశీలించనున్నారు. ఈ ఏడాది జులైలో దిల్లీ విమానాశ్రయం నుంచి 60 లక్షల మంది ప్రయాణించారు. 2026-27 ఏప్రిల్-జులై మధ్య 2.64 కోట్ల మంది ప్రయాణికుల రాకపోకలు నమోదయ్యాయి.

# బీడీ మహిళలు, వృద్ధులకు వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలి

**కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి**

**బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు**

**కోరుట్లలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా**



**కోరుట్ల, ఆగస్టు 17(నేటి మన దేశమ్ ప్రతినిధి):** బీడీ కార్మిక మహిళలు, వృద్ధులకు కొత్త పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం కోరుట్ల పట్టణంలో ధర్నా నిర్వహించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని కోరుతూ చేపట్టిన ఈ ఆందోళనలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, బీడీ కార్మికులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ధర్నా కార్యక్రమానికి జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు నినాదాలు చేశారు.ధర్నా కార్యక్రమంలో మహిళలు, బీడీ కార్మికులు, వృద్ధులు వివిధ డిమాండ్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. బీడీ మహిళలకు, వృద్ధులకు పెన్షన్లు మంజూరు చేయాలని, కొత్తగా అర్హత పొందిన వారికి వెంటనే పెన్షన్ అందించాలని నినాదాలు చేశారు. పేదలు, బలహీన వర్గాల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించకూడదని నాయకులు డిమాండ్ చేశారు.ఎళ్ల తరబడి బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న మహిళా కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి సామాజిక భద్రత కల్పించడంలో భాగంగా పెన్షన్లు ఎంతో అవసరమని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. వృద్ధాప్యంలో ఉన్న వారికి కూడా పెన్షన్ జీవనాధారంగా ఉంటుందని, అర్హత ఉన్నప్పటికీ పెన్షన్ అందని వారిపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాల్లోని ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని నాయకులు తెలిపారు. ఈ పథకాల ద్వారా ఎంతోమంది నిరుపేద కుటుంబాలకు ప్రయోజనం కలుగుతోందని, వాటిని కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు.పథకాల అమలులో జాప్యం కారణంగా పేద కుటుంబాలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు.పెన్షన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ తదితర సంక్షేమ పథకాల విషయంలో ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పేదలు, మహిళలు, వృద్ధులు, బీడీ కార్మికుల సమస్యలను రాజకీయ కోణంలో చూడకుండా మానవీయ దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. సంక్షేమ పథకాల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు మరింత జాప్యం చేయకుండా తక్షణమే ప్రయోజనాలు అందించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. పేదలు, మహిళలు, వృద్ధులు, బీడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. అర్హులైన వారికి పెన్షన్లు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని నాయకులు పేర్కొన్నారు.ఈధర్నా కార్యక్రమంతో కోరుట్ల పట్టణంలో కొద్దిసేపు నిరసన వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ డిమాండ్లను వినిపించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, బీడీ కార్మికులు, వృద్ధులు, పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ఐడీఓసీలో 136 దరఖాస్తుల రాక**

**రెవెన్యూ డివిజన్ కార్యాలయాలకు 09**

**ఎంపీడీఓ కార్యాలయాలకు మొత్తం 107 దరఖాస్తుల రాక**



**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు- 17: నేటి మన దేశమ్ ప్రతినిధి** ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.అధికారులు బాధ్యతగా వ్యవహరించి ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కాగా ప్రజావాణి మొత్తం 136 దరఖాస్తులు వచ్చాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 02 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 07 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు.

**మండలాల్లో స్వీకరణ** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 01 గంట వరకు ప్రజావాణి ఎంపీడీఓలు నిర్వహించి.. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించార. మండలాల వారీగా దరఖాస్తులు వివరాలు..బోయినపల్లి ఎంపీడీఓ కార్యాలయానికి 11, చందుర్తి మండలం 02, ఇల్లంతకుంట మండలం 07, గంభీరావుపేట మండలం 07, కోనరావుపేట మండలం 15, ముస్తాబాద్ 18, రుద్రంగి మండలం 0, తంగళ్లపల్లి మండలం 20, వీర్నపల్లి మండలం 08, వేములవాడ అర్బన్ మండలం 07, వేములవాడ రూరల్ మండలం 05, ఎల్లారెడ్డిపేట ఎంపీడీఓ కార్యాలయానికి 07 చొప్పున వచ్చాయి.

**మండల, డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి** జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం తో పాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాలు, అన్ని ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగుతుందని, స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అన్ని చోట్ల అప్లికేషన్లు అటెండ్ చేస్తారని పేర్కొన్నారు. ఐడీఓసీ ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# 109-ములుగు నియోజకవర్గంలో 2,09,128 మంది ఓటర్లు

**1,01,964 మంది పురుష ఓటర్లు..**

**1,07,143 మంది మహిళా ఓటర్లు 21 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు**

**ప్రతి ఓటరూ జాబితాలో తమ వివరాలను పరిశీలించుకోవాలి**

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు**



**ములుగు, ఆగస్టు:17(నేటిమన దేశమ్ ప్రతినిధి)**ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం--2026లో భాగంగా 109-ములుగు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను సోమవారం ప్రచురించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. 109-ములుగు నియోజకవర్గ పరిధిలోని 308 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మొత్తం 2,09,128 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వీరిలో 1,01,964 మంది పురుష ఓటర్లు, 1,07,143 మంది మహిళా ఓటర్లు, 21 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారని వెల్లడించారు.ముసాయిదా ఓటర్ల జాబితాలో ప్రతి ఓటరూ తమ పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు. అర్హత కలిగిన పౌరుల పేరు ముసాయిదా జాబితాలో లేకపోయినా, ఇప్పటికే నమోదైన ఓటర్ల వివరాల్లో ఏవైనా తప్పులు, మార్పులు ఉన్నా నిర్ణీత గడువులోగా సంబంధిత దావాలు, అభ్యంతరాలు సమర్పించవచ్చని తెలిపారు.ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు ఫారం-6, నమోదుపై అభ్యంతరం లేదా పేరు తొలగింపునకు ఫారం-7, ఓటరు వివరాల్లో సవరణలు చేసుకోవడానికి లేదా నివాసం మారిన సందర్భంలో నమోదు మార్పు కోసం ఫారం-8ను ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు.ఓటర్లు తమ దావాలు, అభ్యంతరాలను నేరుగా తమ పరిధిలోని బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ)కు సమర్పించవచ్చని తెలిపారు. అదేవిధంగా ఈసీఐనెట్ యాప్ లేదా ఓటర్ సర్వీస్ పోర్టల్ ద్వారా కూడా సంబంధిత దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించుకోవచ్చని పేర్కొన్నారు.ఆఫ్‌లైన్‌లో దావాలు, అభ్యంతరాలను ములుగు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం, 109-ములుగు నియోజకవర్గ పరిధిలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాలు, అన్ని పోలింగ్ కేంద్రాలలో సమర్పించవచ్చని తెలిపారు. దావాలు, అభ్యంతరాల సమర్పణకు సెప్టెంబర్ 16వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు.అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, ఓటర్ల వివరాలు ఖచ్చితంగా, పారదర్శకంగా ఉండేలా ప్రత్యేక సమగ్ర సవరణ--2026 ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. 109-ములుగు నియోజకవర్గ ప్రజలందరూ ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించి తమ పేరు, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని, అవసరమైన సందర్భంలో సెప్టెంబర్ 16వ తేదీలోగా ఫారం-6, ఫారం-7 లేదా ఫారం-8 ద్వారా దావాలు, అభ్యంతరాలు సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు కోరారు.

# ప్రజల సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం

**గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రతి దరఖాస్తుపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలి**

**ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలి**

**అత్యవసర సమస్యలపై తక్షణమే స్పందించాలి**

**ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలి**

**ఒంటరి మహిళలు, వితంతువుల పింఛన్ దరఖాస్తులను 31లోగా స్వీకరించాలి**

**మారుమూల గ్రామాలు, గూడేల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలి**

**అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి**

**మంత్రి దనసరి అనసూయ సీతక్క**




**ములుగు, ఆగస్టు17(నేటిమన దేశమ్ ప్రతినిధి)**ప్రజల సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం చూపాలని,మండల ప్రజావాణి కి వచ్చిన ప్రతి దరఖాస్తుపై స్పష్టమైన సమాధానం తెలియ జేయాలని,ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని,అత్యవసర సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని,ప్రజలను సమస్యలను పరిష్కరించడంలో అధికారులు కాలయాపన చేయకూడదని,ఒంటరి మహిళలు, వితంతువుల,వికలాంగుల పింఛన్ దరఖాస్తులను 31లోగా స్వీకరించాలని,స్థానిక అధికారులు మారుమూల గ్రామాలు, గూడేల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని,అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని,ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రాలు, హైదరాబాద్ వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే గ్రీవెన్స్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి సమస్యలకు పరిష్కారం చూపాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు.సోమవారం గోవిందరావుపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల ప్రజావాణి కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమానికి వచ్చే ప్రజల నుంచి దరఖాస్తులను క్రమపద్ధతిలో స్వీకరించాలని, స్థానికంగా పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను సంబంధిత జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు పంపించి వాటిపై సమాధానం తెప్పించి దరఖాస్తుదారులకు తెలియజేయాలని అన్నారు.గ్రీవెన్స్‌కు వచ్చే ప్రతి దరఖాస్తుదారుడి సెల్‌ఫోన్ నంబర్‌ను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సమాచారం అందించాలన్నారు. సమస్య పరిష్కారానికి ఎంత సమయం పడుతుందో ముందుగానే తెలియజేయడంతో పాటు, నిర్ణీత సమయంలో దరఖాస్తు పరిష్కారమైందా లేదా, పరిష్కారం కాకపోతే కారణం ఏమిటనే విషయాన్ని సంబంధిత వ్యక్తికి స్పష్టంగా తెలియజేయాలని పేర్కొన్నారు.అత్యవసర సమస్యల విషయంలో అధికారులు వెంటనే స్పందించి చర్యలు ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. జిల్లా లేదా రాష్ట్ర స్థాయిలో పరిష్కరించాల్సిన అంశాలకు అవసరమైన సమయాన్ని అంచనా వేసి, కనీసం వారం రోజుల్లో దరఖాస్తుదారులకు పురోగతిపై సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు ఒకే సమస్య కోసం పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకూడదన్నారు.మండలాల వారీగా గ్రీవెన్స్ కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించడం ద్వారా జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజల సంఖ్య తగ్గడంతో పాటు స్థానికంగానే సమస్యలకు వేగంగా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అధికారులు విధులను బాధ్యతగా, చిత్తశుద్ధితో నిర్వహించి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కార దిశగా పరిశీలించాలని సూచించారు.ఒంటరి మహిళలు, వితంతువులకు, సంబంధించిన పింఛన్ దరఖాస్తులను ఈ నెల 31వ తేదీలోగా అన్ని గ్రామాల నుంచి పూర్తిస్థాయిలో స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. వికలాంగులు, గీత కార్మికులు, నేత కార్మికులు, తలసేమియా బాధితులు తదితర అర్హుల పింఛన్లకు ప్రభుత్వం దశలవారీగా చర్యలు చేపడుతోందని తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోలేదనే పరిస్థితి తలెత్తకుండా ఎంపీడీఓలు, తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా మారుమూల గ్రామాలు, అంతర్గత వాడలు, గూడేల్లో పర్యటించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలన్నారు. పస్రా, గోవిందరావుపేట, చల్వాయి తదితర ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చామని, ఎస్టీ తండాలు, గూడేల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి సుమారు రూ.50 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అంతర్గత, సీసీ రహదారుల సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, తహసిల్దార్ సృజన్ కుమార్, ఎంపీడీవో వరుణ్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# జనగణన లో కులగణన చేర్చాలి

**నీల నాగరాజు బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు**



**కామారెడ్డి,ఆగస్ట్ 17.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో నీల నాగరాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణలో బీసీల కులగణన చేపట్టాలని అన్నారు.గత ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీన ఢిల్లీలో జరిగిన కేంద్రమంత్రి మండలి సమావేశంలో జాతీయ జనగణనలో బీసీ కులగణనను కూడా చేపడతామని కేంద్ర మంత్రులు ప్రకటించారు. ప్రధాని మోదీ సైతం కులగనన జరుగుతుందని వెల్లడించారు.ఈ నెల 14న కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ లో బీసీ కులాల ప్రస్తావన లేదు. కేంద్రం బీసీలను నమ్మించి మోసం చేస్తుంది .ఇకనైనా బీసీలకు యూనిక్ కోడ్ కేటాయించి శాస్త్రీయంగా కులగణన చేపట్టాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. మరాష్టం లో అధిక జనాబా ఉన్నటివంటి బిసిల లెక్కలు తెల్చాలని అప్పుడే బిసిలకు జనాబా దామాషా ప్రకారం విద్యా,ఉద్యోగ,రాజకీయ రంగాల్లో ప్రాతినిత్యం ఉంటుందని అన్నారు. అలాగే మహిళా బిల్లులో బిసిలకు ప్రత్యేక కోటా కేటాయించిన తర్వాతనే మహిళా బిల్లు ని ప్రవేశపెట్టాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రశాంత్,రాజేందర్ నవీన్,సురేష్,నితిన్, శ్రీధర్,పవన్,సంతోష్, విక్రమ్,రమేష్,శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# వందేమాతరం పట్ల కాంగ్రెస్ అగ్రనేతల అవమానకర వైఖరిని ఖండిస్తూ కరీంనగర్ బీజేవైఎం నిరసన

**కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ దేశ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్**



**కరీంనగర్, ఆగస్ట్ 17: నేటి మన దేశమ్ ప్రతినిధి** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా దేశ అత్యున్నత జాతీయ గేయమైన 'వందేమాతరం' ఆలాపన వేళ కాంగ్రెస్ అగ్రనేతలు ప్రదర్శించిన నిర్లక్ష్యం, గేయం పట్ల అవలంబించిన అవమానకర వైఖరిపై కరీంనగర్ బిజేవైఎం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. సోమవారం రోజున కరీంనగర్ కోర్టు చౌరస్తాలో భారతీయ జనతా యువ మోర్చా కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు.ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వందేమాతరం సంపూర్ణ ఆలాపన జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులు అత్యంత బాధ్యతారహితంగా వ్యవహరించారని బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సంగ నరేష్ తీవ్రంగా మండిపడ్డారు. జాతీయ గేయం పట్ల కనీస గౌరవం ప్రదర్శించకపోగా, ఇతరులతో మాట్లాడుతూ ఆలాపనకు ఆటంకం కలిగించేలా ప్రవర్తించడం దేశ ప్రజల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందని ఆయన ధ్వజమెత్తారు.ఈ నిరసన కార్యక్రమంలో బీజేవైఎం కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశభక్తిని చాటాల్సిన పవిత్ర వేదికపైనే జాతీయ గేయానికి అవమానం జరగడం క్షమించరాని నేరమని వారు ఆరోపించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో అగ్రగణ్యమైన స్థానం ఉన్న వందేమాతరం గేయాన్ని అవమానించిన కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ వెంటనే దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిజేవైయం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరెడ్ల ప్రవీణ్ రెడ్డి,బిజెపి జిల్లా నాయకులు గుజ్జ శ్రీనివాస్ రావు,బిజేవైయం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునిగంటి కుమార్, ఎస్టి మోర్చా రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ నాయక్, ఎస్ టి మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్, ఎడవెల్లి శశిధర్ రెడ్డి,నక్క ప్రమోద్,గుర్రం వెంకటేశ్ గౌడ్,ఆకుల మనోహర్,సతీష్,తాడూరి కిరణ్,సుదమల్ల నాగరాజు,రమేష్ యాదవ్,రాసబక్తుల వినయ్,గడ్డం సందీప్,జాగిరి రాజేందర్,కార్తిక్,శ్రీకర్,నవీన్,గణేష్ బిజేవైయం నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్సై, కానిస్టేబుల్ ఉచితంగా శిక్షణ కార్యక్రమాలు



**మందమర్రి ఆగస్టు 17 (నేటి మనదేశమ్):** ఎస్సై కానిస్టేబుల్ ఉచిత శిక్షణ శిబిరాలను.ఇతర అన్ని పోటీ పరీక్షల కోసం కాక ఫ్రీ కోచింగ్ సెంటర్. 60 రోజుల ఉచిత శిక్షణ కార్యక్రమానికి తాసిల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న షెడ్డు స్థలాన్ని పరిశీలిస్తున్న తహసిల్దార్ సతీష్ కుమార్ శర్మ, మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాయలింగు,ఇతర అధికారులు.కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు తిరుమల్ రెడ్డి , నాయకులు గుడ్ల రమేష్,సునీల్,సాగర్, విజయ్,తదితరులు ఉన్నారు.

# పూలే,అంబేద్కర్ జీవితమే సందేశం

**మహనీయుల ఆశయాలను ఆచరించడమే నిజమైన నివాళి**

**విద్యతోనే సామాజిక మార్పు సాధ్యం: ఎంపీ మల్లు రవి,ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**



**మహబూబ్‌నగర్ ఆగష్టు 17 (నేటి మనదేశమ్):** : పూలే, అంబేద్కర్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం మహబూబ్‌నగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని విద్యుత్ భవన్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను మల్లు రవి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ.. మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం పూలే, అంబేద్కర్ అడుగుజాడల్లో పయనించాలని సూచించారు.ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే, అంబేద్కర్ తమ జీవితాలను అంకితం చేశారని తెలిపారు. విద్య, జ్ఞానం ద్వారానే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత విద్యను అభ్యసించినప్పుడే రాజకీయ, ఆర్థిక, సామాజిక స్వాతంత్ర్యాన్ని సంపూర్ణంగా సాధించగలరని పేర్కొన్నారు.పేద, అణగారిన వర్గాల పిల్లలకు విద్య అందించడం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించేలా అందరూ సహకరించాలని కోరారు.

**విద్యారంగానికి ప్రాధాన్యం** మహబూబ్‌నగర్‌లో విద్యారంగ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ట్రిపుల్‌ఐటీ, ఇంజినీరింగ్, లా కళాశాలల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ట్రిపుల్‌ఐటీలో మహబూబ్‌నగర్ విద్యార్థులకు గణనీయ సంఖ్యలో సీట్లు సాధించామని తెలిపారు.రాబోయే ఐదేళ్లను విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితం చేయాలని పిలుపునిచ్చారు. పిల్లలకు పుస్తకాలు, విద్యా సహాయం, కౌన్సెలింగ్ అందించడంతో పాటు ఉన్నత విద్యా అవకాశాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

**పూలమాలలతో సరిపోదు** పూలే, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేయడంతో కార్యక్రమం ముగిసిపోకూడదని యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వారి ఆశయాలను జీవితంలో ఆచరణలో పెట్టినప్పుడే నిజమైన నివాళి లభిస్తుందని చెప్పారు. ప్రతి కుటుంబం తమ పిల్లలను చదివించాలని, ప్రతి విద్యార్థి జ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, సత్తూర్ చంద్రకుమార్‌గౌడ్, సిరాజ్ ఖాద్రీ, సాయిబాబా, చీఫ్ ఇంజినీర్ బాలస్వామి, ఎస్‌ఈ భీమానాయక్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఆసిఫాబాద్, ఆగస్టు17 (నేటి మనదేశమ్ (ప్రతినిధి)):**ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా కేంద్రం లోని జనకాపూర్ కు చెందిన సొన్నాయిల మానస తనకు దివ్యాంగుల పింఛను ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాగజ్ నగర్ మండలం అంకుసాపూర్ కు చెందిన సోగల కోమల్ తనకు జనకాపూర్ శివారులో గల పట్టా భూమిని కొలతలు నిర్వహించి హద్దులు నిర్ధారించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం పర్వానంబల గ్రామానికి చెందిన దుర్గం హనుమంతు తాను సాగు చేస్తున్న భూమికి పట్టాదారు పాసుపుస్తకం జారీ చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాగజ్ నగర్ పట్టణానికి చెందిన కలాపెల్లి రవీందర్ తన కుమారుడికి గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఎస్. భాస్కర్ రావు తనకు దహెగాం మండలం లగ్గాం గ్రామ శివారులో గల భూములకు పట్టా పాస్ పుస్తకాలు జారీ చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ మండలం రహపల్లి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ పి. శ్రీనివాస్ తాను సర్పంచ్ గా పనిచేసిన కాలం పెండింగ్ బిల్లులను ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ మండలం చింతగూడ కోయవాగు గ్రామానికి చెందిన సయ్యద్ జుబేర్ తనకు దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో మాట్లాడుతూ ప్రతి మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం నేటి నుండి నిర్వహించడం జరుగుతుందని, అర్జీదారులు తమ సమస్యలపై మండల స్థాయిలో దరఖాస్తు చేసినట్లయితే అక్కడే పరిష్కరించడం జరుగుతుందని, అక్కడ పరిష్కారం కానట్లయితే జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు సమర్పించవచ్చని తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

# ఘనంగా నాగుల పంచమి.



**ఆసిఫాబాద్, ఆగస్టు16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**రెబ్బెన మండలం ఇందిరానగర్ గ్రామంలో వెలసిన శ్రీ కనక దుర్గాదేవి స్వయంభూ శ్రీ మహంకాళీ దేవస్థానంలో నాగుల పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు..ఉదయం నుండి భక్తులు పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేశారు, శ్రావణ మాసం మొదటి సోమవారం కావడంతో అరుణాచల శివయ్యకు పంచామృతాలతో అభిషేకాలు చేసి నైవేద్యాలు సమర్పించి హోరతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. నాగదేవతతో పాటు అమ్మవారిని కాల భైరవ స్వామిని, శనీశ్వర స్వామిని భక్తులు దర్శించుకొని, ఒడి బియ్యం సారె సమర్పించారు....వచ్చిన భక్తులు ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ స్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

**ప్రజా భద్రత, విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలి**

**రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై నిరంతరం నిఘా.. నాణ్యమైన దర్యాప్తుకు ప్రాధాన్యం**

**వార్షిక తనిఖీల్లో భాగంగా మల్యాల సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ అశోక్‌కుమార్**




**జగిత్యాల/మల్యాల, ఆగష్టు 17 (నేటి మనదేశమ్):** నేరాల నియంత్రణ, ప్రజా భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు విజిబుల్ పోలీసింగ్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశించారు. నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగించాలని సూచించారు.వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం మల్యాల సర్కిల్ కార్యాలయాన్ని ఎస్పీ అశోక్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు, పరిసరాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. సర్కిల్ ఇన్ఫర్మేషన్ బుక్, క్రైమ్ రికార్డు, ప్రాపర్టీ రిజిస్టర్, పిటిషన్ రిజిస్టర్ తదితర ముఖ్యమైన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

**కేసుల దర్యాప్తులో నాణ్యత ముఖ్యం** సర్కిల్ పరిధిలో నమోదైన తీవ్రమైన నేరాలు, దర్యాప్తులో ఉన్న కేసులు, పెండింగ్ ట్రయల్ కేసులకు సంబంధించిన సీడీ ఫైళ్లను ఎస్పీ పరిశీలించారు. కేసుల దర్యాప్తు పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గ్రేవ్ కేసులు, పోక్సో కేసుల్లో నిందితులకు చట్టప్రకారం శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు చేపట్టాలని సూచించారు.

ప్రతి కేసులో నిర్దేశిత ఎస్ఓపీ ప్రకారం దర్యాప్తు కొనసాగాలని, దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తులో ఎలాంటి లోపాలకు తావులేకుండా ఆధారాల సేకరణ, సాక్షుల విచారణ, కేసు డాక్యుమెంటేషన్, ఫోరెన్సిక్ ఆధారాల వినియోగం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.నేరం జరిగిన తర్వాత దర్యాప్తు ప్రారంభించడం మాత్రమే కాకుండా, కేసుల దర్యాప్తులో ప్రతి అంశాన్ని శాస్త్రీయంగా పరిశీలించి పక్కా ఆధారాలను సేకరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్పీ పేర్కొన్నారు. దర్యాప్తులో చిన్నపాటి లోపం కూడా కేసు ఫలితంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

**రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై నిఘా**సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను సీఐ తరచుగా తనిఖీ చేస్తూ సిబ్బంది పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని ఎస్పీ ఆదేశించారు. విధుల్లో అలసత్వానికి తావులేకుండా ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని ఆదేశించారు. ప్రతి నెలా వారి ప్రస్తుత పరిస్థితి, కదలికలు, సంబంధాలు తదితర అంశాలపై నూతన సమాచారాన్ని సేకరించి సంబంధిత రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు.ప్రాంతంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై ముందస్తు సమాచార వ్యవస్థను పటిష్టం చేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు.కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, మహిళలు మరియు బాలల భద్రత తదితర అంశాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని తెలిపారు.ప్రజలు పోలీసులకు సమాచారం అందించేందుకు భయపడాల్సిన అవసరం లేదని, నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. పోలీసు శాఖ--ప్రజల మధ్య సమన్వయం మరింత పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని ఎస్పీ తెలిపారు. ప్రతి గ్రామంలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, మార్కెట్ ప్రాంతాలు, రద్దీ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు.సీసీ కెమెరాల ద్వారా నేరాలను అరికట్టడంతో పాటు నేరం జరిగిన తర్వాత నిందితుల గుర్తింపు, వారి కదలికలను తెలుసుకోవడం సులభమవుతుందని అన్నారు. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు సమన్వయంతో ముందుకు వచ్చి నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు.

**విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి** ప్రజలకు పోలీసుల ఉనికి స్పష్టంగా కనిపించేలా విజిబుల్ పోలీసింగ్‌ను మరింత పెంచాలని ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. ముఖ్యమైన ప్రాంతాల్లో గస్తీని పెంచడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిఘా ఉంచాలని తెలిపారు.మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధిత శాఖలతో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజా భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని, నేరం జరిగిన తర్వాత స్పందించడమే కాకుండా ముందస్తు చర్యల ద్వారా నేరాలను నివారించడంపై దృష్టి పెట్టాలని ఎస్పీ పేర్కొన్నారు.అనంతరం కార్యాలయ ఆవరణలో ఎస్పీ అశోక్‌కుమార్ మొక్కను నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ రవికుమార్, మల్యాల సీఐ రాజ్‌కుమార్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు సందీప్, నరేష్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాలను ప్రభుత్వం రద్దు చేయాటానికి కుట్ర పన్నుతుంది.

**పేదల సంక్షేమానికి సంబంధించిన పథకాల విషయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.**

**ఆర్డీవో కి వినతి పత్రం అందచేసిన మిర్యాలగూడ బి ఆర్ ఎస్ నాయకులు.**



**మిర్యాలగూడ ఆగస్టు 17(నేటి మనదేశమ్ ప్రతినిధి)**తెలంగాణ హైకోర్టు 'కల్యాణ లక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాలపై మధ్యంతర స్టే విధించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ (దీ=హా) పార్టీ మిర్యాలగూడ లో నిరసనలు, ధర్నాలు చేపట్టింది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కోర్టులో స్టే వచ్చింది అని, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాలను రద్దు చేయడానికి కుట్ర పన్నుతోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి హయాంలో ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో అండగా నిలిచాయి. అయితే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాలకు మోక్షం పలికే విధంగా వ్యవహరిస్తూ, అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో ప్రయోజనాలు అందకుండా చేస్తున్న తీరును నిరసిస్తూ మిర్యాలగూడ డివిజన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట టీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్లు మరియు వార్డు ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది.అనంతరం ఆర్డీవో రమణారెడ్డి ని కలిసి వినతిపత్రం అందజేసి, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం అందించాల్సిన ఆర్థిక సహాయాన్ని ఎలాంటి జాప్యం లేకుండా అందించాలని కోరడం జరిగింది.అదేవిధంగా ఒంటరి మహిళ పెన్షన్‌కు దరఖాస్తు చేసుకునే మహిళలకు ఎమ్మార్వో కార్యాలయం ద్వారా అవసరమైన ధృవీకరణ పత్రాలను సులభంగా జారీ చేయాలని, అర్హత కలిగిన మహిళలు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలకు దూరం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డీవో గారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.పేద ప్రజల సంక్షేమానికి ఉపయోగపడే పథకాలను నిర్వీర్యం చేయకుండా, వాటిని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేయడం జరిగింది. ప్రజా సంక్షేమం కోసం టీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. తదుపరి నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ కి కూడా గ్రీవెన్స్ లో వినతి పత్రాన్ని సమర్పించడం జరిగింది.. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎం.డి ఇలియాస్ ఖాన్, కౌన్సిలర్లు దీపిక విజయ్, జానకమ్మ దుర్గాప్రసాద్, లావుడి అరుణ సుధాకర్, సందేశ్ రజిని అంజన్ రాజు, మర్రి అంజిబాబు, తిరుమలగిరి వజ్రం, వడ్డేపల్లి శ్రీనివాస్, జన్నపాల సునీత కిరణ్, ఎర్రమల దినేష్ నాయకులు జి.డి.ఆర్ జానీ, వార్డు ఇంచార్జ్ లు భూక్య రాంబాబు, రమావత్ భీమ్లా నాయక్, ఐల వెంకన్న గౌడ్, కందగట్ల అశోక్, పందిరి వేణు, షేక్ మస్తాన్, షేక్ ఖలీల్, గౌటే కనకయ్య, దుర్గయ్య, ఎండి . గయాస్, ఆలీం, కడియం సైదులు, రాజనబోయిన గోపి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**




**మంచిర్యాల, ఆగస్టు 17, నేటి మనదేశమ్:**రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశానికి నీటిపారుదల శాఖ ఎస్.ఈ. విష్ణు ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం, భూగర్భ జలమట్టాలు తగ్గిపోవడం వంటి పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంటల వైవిధ్యీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్‌తో పాటు రానున్న రబీ సీజన్‌లోనూ నీటి లభ్యత విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటిని మొదటి ప్రాధాన్యతగా త్రాగునీటి అవసరాలకు వినియోగించాల్సిన పరిస్థితి ఉందని, గొల??లవాగు ప్రాజెక్టుతో పాటు ఇతర ప్రాజెక్టులలోనూ వరి సాగుకు అవసరమైన స్థాయిలో నీరు అందుబాటులో ఉండే అవకాశం లేదని తెలిపారు. వరి పంటకు ఒక ఎకరాకు అవసరమయ్యే నీటితో సమానమయ్యే నీటిని వినియోగించి సుమారు 3 నుంచి 4 ఎకరాలలో ఆరు తడి పంటలను సాగు చేయవచ్చని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో రైతులు వరి నాట్లు వేస్తే పంటకు అవసరమైన నీరు పూర్తిస్థాయిలో అందకపోవడంతో పంట ఎండిపోయే ప్రమాదం, దిగుబడి తగ్గడం, ధాన్యం నాణ్యత దెబ్బతినడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. నీటి కొరత కారణంగా వరి గింజ పరిమాణం తగ్గి, దిగుబడి తగ్గడంతో పాటు పంటను మార్కెట్‌లో విక్రయించడంలోనూ రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో మొక్కజొన్న, కంది, పెసలు, మినుములు, అలసందులు వంటి తక్కువ నీటితో సాగు చేయగల పంటలను రైతులు ఎంచుకోవాలని, ఈ పంటలకు అవసరమైన మేరకు నీటిని అందించగలిగే అవకాశం ఉన్నందున పంటలు విజయవంతంగా సాగయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు రైతులకు అవసరమైన విత్తనాలను కూడా అందించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మొక్కజొన్న, కంది, పెసలు, మినుములు తదితర పంటలకు ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పిస్తోందని, మొక్కజొన్నకు బహిరంగ మార్కెట్‌లో గరిష్ట మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభిస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయని తెలిపారు. నీటి లభ్యత, వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జూన్ 1వ తేదీ నుంచే రైతులకు పంటల ఎంపికపై అవగాహన కల్పిస్తున్నామని, అయినప్పటికీ కొంతమంది రైతులు వరి సాగు చేయాలని నిర్ణయిస్తే భవిష్యత్తులో నీటి కొరత కారణంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు. భూగర్భ జలమట్టాలు తగ్గిన నేపథ్యంలో బోర్లపై ఆధారపడే రైతులు సైతం నీటి సమస్యను ఎదుర్కొనే అవకాశం ఉందని, రైతులు పరిస్థితులను అంచనా వేసి నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత నీటి పరిస్థితులపై రైతులకు వాస్తవ పరిస్థితిని వివరించి, పంటల వైవిధ్యీకరణపై అవగాహన కల్పించడంలో మీడియా సంస్థలు కూడా భాగస్వాములు కావాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాలలో నీటి లభ్యత, వర్షపాతం విషయంలో అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టడం అవసరమని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ ఎక్కువ విస్తీర్ణంలో పంటలు పండించాలంటే వరికి బదులుగా తక్కువ నీటితో సాగు చేసే పంటలను ఎంచుకోవాలని, ప్రస్తుత పరిస్థితులలో వరి సాగు చేసి నీటి కొరతతో పంట నష్టపోయే కంటే మొక్కజొన్న, కంది, పెసలు, మినుములు, అలసందులు వంటి పంటలను సాగు చేయడం రైతులకు ప్రయోజనకరమని తెలిపారు. రైతులు నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకొని, వ్యవసాయ, వ్యవసాయ విస్తరణ, సాగునీటి శాఖల అధికారుల సూచనలు పాటిస్తూ పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పాత్రికేయులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్ట్ నీళ్లు విడుదల చేయాలని రైతుల ధర్నా - ఎమ్మెల్యే కోవ లక్ష్మీ మద్దతు.

**ఆసిఫాబాద్, ఆగస్టు16 (నేటి మనదేశమ్ ప్రతినిధి)::**




ఆసిఫాబాద్ మండలంలోని వట్టివాగు ప్రాజెక్టు ఆయకట్టు కింద సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు బూరుగుడా సమీపంలో జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. కెనాల్ ద్వారా సాగునీరు అందించేందుకు వెంటనే ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనకు ఎమ్మెల్యే కోవా లక్ష్మి మద్దతు తెలిపారు. ధర్నాలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ సాగునీరు అందకపోతే రైతులు పంటలు నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. అధికారులు వెంటనే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. .ఎల్‌నినో సాకుతో రైతులకు సాగునీరు విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. వర్షాలు కురిసి వరద నీరు సముద్రంలో కలుస్తున్నప్పటికీ ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. అన్నదాతల సమస్యలను పట్టించుకోకపోతే భవిష్యత్తులో రైతులు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, రెబ్బెన సింగిల్ విండో చైర్మన్లు అలీబీన్ హైమద్, కార్నధం సంజీవ్ కుమార్, నాయకులు కార్నధం వెంకటేశం, బొమ్మినేని శ్రీధర్,వినోద్ జైశ్వాల్, దుర్గం భరద్వాజ్, జీవన్, శ్రీనివాస్, నవీన్ తో పాటు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్ రావు నేతృత్వంలో ఘనంగా గాలి పోచమ్మ ఉత్సవం

ఉస్మాన్ నగర్‌లో వైభవంగా గాలి పోచమ్మ ఫలహారం బండి ఊరేగింపు

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. డప్పు సప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలతో హోరెత్తిన ఉత్సవం



**పటాన్‌చెరు: ఆగష్టు 17 (నేటి మనదేశమ్):** పటాన్‌చెరు నియోజకవర్గంలోని తెల్లాపూర్ డివిజన్ పరిధి ఉస్మాన్ నగర్‌లో గాలి పోచమ్మ అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్శ శ్యామ్ రావు నేతృత్వంలో జరిగిన ఈ ఉత్సవాలకు గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపుతో ఉస్మాన్ నగర్ వీధులు పండుగ శోభను సంతరించుకున్నాయి. డప్పు సప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, దేవతామూర్తుల వేషధారణలో కళాకారుల ఆటపాటలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మహిళలు, యువత, గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొనడంతో ఉత్సవం సందడిగా సాగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పర్శ శ్యామ్ రావు మాట్లాడుతూ.. సుమారు 70 సంవత్సరాల క్రితం గ్రామ పెద్దలు ఒక చెట్టు కింద గాలి పోచమ్మ అమ్మవారిని ప్రతిష్ఠించారని తెలిపారు. అప్పటి నుంచి అమ్మవారు ఉస్మాన్ నగర్ గ్రామస్థుల ఇలవేల్పుగా కొలువుదీరారని, భక్తుల కొంగుబంగారంగా పూజలందుకుంటున్నారని చెప్పారు. కోరిన కోరికలు తీర్చే దైవంగా గాలి పోచమ్మ అమ్మవారిపై గ్రామస్తులకు, భక్తులకు అపారమైన విశ్వాసం ఉందన్నారు. గత తొమ్మిదేళ్లుగా గాలి పోచమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని శ్యామ్ రావు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ఉత్సవాలను ప్రతి ఏడాది మరింత వైభవంగా నిర్వహించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. గ్రామస్తులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఉత్సవాలకు హాజరైన భక్తుల కోసం ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్తులు, భక్తులు, యువత సమష్టి సహకారంతో గాలి పోచమ్మ జాతరను ప్రతి ఏడాది మరింత ఘనంగా నిర్వహిస్తామని శ్యామ్ రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, యువకులు, మహిళలు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల సందడి, జై అమ్మవారి నినాదాలతో ఉస్మాన్ నగర్‌లో గాలి పోచమ్మ ఫలహారం బండి ఊరేగింపు ఉత్సాహభరితంగా సాగింది.

## హిందు స్మశాన వాటికలో మున్సిపల్ కార్మికులను నియమించాలి

కాల్చే యంత్రం ఏర్పాటు చేయాలి చైర్మన్ కు వినతిపత్రం ఇచ్చిన ఆర్యవైశ్యులు



**వనపర్తి ఆగష్టు 17 నేటిమనదేశమ్ ప్రతినిధి** వనపర్తి జిల్లా కేంద్రంలో హిందు స్మశానవాటికలో మున్సిపల్ కార్మికులను నియమించాలని అదేవిధంగా శవాన్ని కాల్చే యంత్రన్ని ఏర్పాటు చేయాలని వనపర్తి పట్టణ ఆర్యవైశ్య సంఘము అధ్యర్యము లో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మీడిదొడ్డి మాదవి రమేష్ కు వినతిపత్రాన్ని అందజేశారుదహనసంస్కారాలకు అక్కడ 20 వేలకు పైగా డిమాండ్ చేస్తుండంతో మధ్యతరగతి ప్రజలు పేద ఆర్యవైశ్యలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నార ని పట్టణ ఆర్యవైశ్య సంఘము అధ్యక్షుడు బచ్చురాశీ యూవజన సంఘము అధ్యక్షులు బచ్చు వెంకటేష్ ఏపూరి శ్రీనివాసులు వై వెంకటేష్ సీనియర్ నేత మారం బాలీస్వరయ్యా తెలిపారు వీటిస్థానంలో విద్యుత్తు దహన కాల్చే యంత్రం ఏర్పాటు చేయలని వారు కోరారు స్మశానవాటికలో కనీస సౌకర్యాలు లేవని నీటివసతి, మరుగుదొడ్లు,లేవని అన్నారు వనపర్తి పట్టణంలో పరిసర ప్రాంతాలలో భూముల ధరలు విపరీతంగా పెరిగినందున ప్రయివేట్ స్థలాల్లో ఖనన సంస్కారాలు చేయనీయడంలేదని వనపర్తి జిల్లా కేంద్రం జనాభాను పరిగణలోకి తీసుకుని నూతనంగా స్మశాన వాటిక ఏర్పాటు చేసి మౌళిక వసతులు ఏర్పాటు చేసి మున్సిపల్ కార్మికులను స్మశాన వాటికలో ఏర్పాటు చేసి డబ్బులు ఫిక్స్ చేసే విధానం అమలు చేయాలని చైర్మన్ ను కోరారు బచ్చు రాం వెంట ఆర్యవైశ్య సంఘం నేతలు ఎలిశెట్టి వెంకటేష్ ఏపూరి శ్రీనివాసులు సీనియర్ నేత లు మారం బాలీశ్వరయ్య శెట్టి లగిశెట్టి అశోక్ దాచ శివ యువజన సంఘం అధ్యక్షుడు బచ్చు వెంకటేశు వర్తక సంఘం అధ్యక్షుడు పాలాది సుమన్ కాంగ్రెస్ పార్టీ నేత చుక్కయ్య శెట్టి యావ నేతలు మారం గోవిందు గుప్త కొండూరు ప్రవీణ్ కల్వ భూపేష్ కుమార్ శెట్టి రఘు ఆర్యవైశ్య నాయకులు తదితరులు ఉన్నారు

## మాతృభూమి స్మార్ట్ క్లాస్‌రూమ్స్, బృందావనం గోశాల ప్రారంభం.




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 17,(నేటి మనదేశమ్)**,భద్రాచలం కూనవరం రోడ్డులోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో ఏర్పాటు చేసిన మాతృభూమి స్మార్ట్ క్లాస్‌రూమ్స్, బృందావనం గోశాలను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సోమవారం ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని విద్యా రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎన్ఆర్ఐలు, పట్టణ ప్రముఖుల సహకారంతో శిశు మందిర్ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు ఆధునిక సదుపాయాలు కల్పించడం అభినందనీయమని, అందుబాటులోకి వచ్చిన స్మార్ట్ క్లాస్‌రూమ్‌లను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పాకాల దుర్గాప్రసాద్, పార్టీ నాయకులు రత్నం రమాకాంత్, నర్రా రాము, భీమవరపు వెంకటరెడ్డి, పెద్దినేని శ్రీనివాస్, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ వెంటనే అమలు పర్చాలి

విజయ్ సాగర్ బి ఆర్ యస్ పట్టణ అధ్యక్షుడు



**న్రాయణ్‌పేట ఆగస్టు 17(నేటి మన దేశమ్ ప్రతినిధి)** జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో జరిగిన ధర్నా కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు విజయ్ సాగర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలను వెంటనే అమలు పర్చాలి. తెలంగాణ రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి కెసిఆర్ గారి హయాంలో పేద ఆడబిడ్డల పెళ్లిలలకు ప్రవేశపెట్టిన లక్షా నూట పదహారు రూపాయల కల్యాణ లక్ష్మీ షాదిముబారక్ పథకాలను కాంగ్రేస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా వాటిని పూర్తిగా నిలిపివేయాడానికి ప్రయత్నం చేస్తుందని తిరిగి వాటిని అమలుపర్చలని,తక్షమనే ప్రభుత్వం స్పందించి తిరిగి కల్యాణ లక్ష్మీ షాదీముబారక్ పథకాలను అమలు పర్చాలని డిమాండ్ చేయడం జరిగింది. అదేవిధంగా కేసీఆర్ ప్రజలకు తలపెట్టిన పథకాలు రైతు బీమా మిషన్ కాకతీయ వంటి ముఖ్యమైన పథకాలను కూడా రద్దు చేయడం జరుగుతుంది కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించాలి స్పందన రాని ఎడల బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముందు ముందు పెద్ద ఎత్తున ఆందోళన చెయ్యడం జరుగుతుంది అని హెచ్చరించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అమ్మకుల శ్రీనివాస్ రెడ్డి మండల అధ్యక్షులు వేపురాములు శరణపల్లి రాములు సుభాన్ రెడ్డి, కాకర్ల నారాయణమ్మ నాడేపల్లి భరత్ చెన్నారెడ్డి సుదర్శన్ రెడ్డి ప్రతాప్ రెడ్డి గురులింగప్ప బుల్లెట్ రాజు శేఖర్ రెడ్డి పల్ల వెంకట రాములు అప్పీ స్వామి శ్రీనివాస్ రెడ్డి గట్టు రఘు రామ్ రెడ్డి పూడూరు శీను కావాలి వెంకటేష్ అంజి పాల్గొన్నారు.

## రాజ్యాంగ విలువలను కాపాడాలి

డిసీసీ అధ్యక్షులు. ప్రశాంత్ కుమార్ రెడ్డి

కుల వివక్షకు వ్యతిరేకంగా గళమెత్తిన కాంగ్రెస్

ఖర్గే కు జరిగిన అవమానంపై నారాయణపేటలో మహాధర్నా



**న్రాయణ్‌పేట ఆగస్టు 17( నేటి మన దేశమ్ ప్రతినిధి)** ఉత్తరఖాండ్ రాష్ట్రంలోని హల్ద్వానీ లో జరిగిన కులావివక్ష ఘటనకు నిరసనగా ఏఐసీసీ మరియు టిపిసిసి కమిటీ పిలుపు మేరకు సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షులు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సత్యాగ్రహ మహాధర్నా నిర్వహించారు. సీవీఆర్ భవన్ నుంచి కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు భారీ ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తా వరకు పాదయాత్ర నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం అక్కడే సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న సభ అనంతరం జరిగిన ఘటన అత్యంత బాధాకరమన్నారు. ప్రజా సభ జరిగిన ప్రదేశాన్ని 'శుద్ధీకరణ' పేరుతో బిజెపి పార్టీ కి చెందిన కొందరు సానుభూతి పరులు గంగజాలం తో శుభ్రం చేయడం కుల వివక్షకు సంబంధించిన ఆలోచనలకు తావిచ్చే చర్యగా కనిపిస్తోందన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. రాజకీయ విభేదాలు ఎన్ని ఉన్నా ఒక వ్యక్తి కులం ఆధారంగా అతని గౌరవాన్ని కించపరిచే చర్యలు జరగడం బాధాకరమన్నారు. అంటరానితనాన్ని రాజ్యాంగం నిషేధించినప్పటికీ ఇలాంటి ఘటనలు బిజెపి పార్టీ ప్రోత్సహించడం సిగ్గుచేటన్నారు. మల్లికార్జున్ ఖర్గే గారికి జరిగిన అవమానం ఒక్క వ్యక్తికి జరిగిన అవమానం కాదని,కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రతి ఒక్కరికీ జరిగిన అవమానమని అన్నారు. ఈ ఘటనకు బీజేపీకి చెందిన కొందరు సానుభూతిపరుల ప్రమేయం ఉందని దీనిపై బీజేపీ నాయకత్వం ఘటనను బహిరంగంగా ఖండించి,సమగ్ర విచారణకు సహకరించాలని డిమాండ్ చేశారు. కుల వివక్షను ప్రోత్సహించే చర్యలకు ఎవరి మద్దతు ఉన్నా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. ఘటనకు బాధ్యులు ఎవరైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సత్యాగ్రహ దీక్షను జిల్లా కేంద్రానికే పరిమితం చేయకుండా ప్రతి మండలం,ప్రతి గ్రామానికి తీసుకెళ్లాలి ఈ ఘటన ను ఖండించాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది ముసాయిదా ఓటర్ల జాబితా వచ్చినప్పుడు కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా నిబంధనల ప్రకారం పరిశీలించాలని కోరారు. బూత్ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. బీఎల్ఏలు ఒక్కరే అన్నీ చేయలేరని, ప్రతి కాంగ్రెస్ నాయకుడు ఇందులో భాగస్వామి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పేట,కోస్గి, మక్తల్ మార్కెట్ చైర్మన్ లు శివారెడ్డి,భీములు,రాధ లక్ష్మారెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. సలీం,జిల్లా అధికార ప్రతినిధి సంతోష్,క్రమశిక్షణ సంఘం జిల్లా అధ్యక్షులు గాజుల శివకుమార్,ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు వెంకటయ్య,మండల, పట్టణ అధ్యక్షులు కోట్ల.రవీందర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్,అనంద్, విజ్ఞప్ప గౌడ్,సూర్య ప్రకాష్ రెడ్డి,శివరాంరెడ్డి,బాలయ్య,మాజీ మార్కెట్ చైర్మన్ లుబండి. వేణుగోపాల్,సుధాకర్,ఎండి. గౌస్,నరహరి,వైస్ చైర్మన్ కె. హన్మంతు,బోయ. శరణప్ప,పళ్ళ అనిల్,పిఏసిఎస్ చైర్మన్ ఈదప్ప,నిరంజన్ రెడ్డి కౌన్సిలర్లు రాజేష్ ఘాట్, కుర్వ మనోజ్,శంకర్,ఉగ్గు రాజు,ఆర్టివో బోర్డ్ డైరెక్టర్ పోషల్ రాజేష్,యూత్ జిల్లా అధ్యక్షులు కోట్ల. మధుసూదన్ రెడ్డి,యూత్ మండల అధ్యక్షులు మహేష్, సర్ఫరాజ్, వేణు గౌడ్,అఖిల్ రెడ్డి,యస్సి సెల్ మండల అధ్యక్షులు చంద్రయ్య,శ్రీను,చందర్, రాజేష్,రాములు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణపేట ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణిని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక



**న్రాయణ్‌పేట ఆగస్టు17 (నేటి మన దేశమ్ ప్రతినిధి)** నారాయణపేట జిల్లాలో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నారాయణపేట ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ప్రియాంక లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలు, వినతులను స్వీకరించి, వాటిని పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కొత్త పింఛన్లకు వచ్చిన దరఖాస్తుల వివరాలను కంప్యూటర్ ఆపరేటర్ ను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ కార్య కలాపాలను పారదర్శకంగా కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎం ఈ వో బాలాజీ, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు

## ఖర్గే సభా వేదిక శుద్ధి ప్రజాస్వామ్యానికి మచ్చ

జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్ పంచమి



**సిద్ద్‌పేట ఆగస్టు 17 నేటి మనదేశమ్ :** ,సిద్దిపేట: ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బహిరంగ సభ నిర్వహించిన అనంతరం సభా వేదికను శుద్ధి చేయడం ప్రజాస్వామ్య విలువలకు, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గణేష్ పంచమి తీవ్రంగా ఖండించారు. ఈ నెల 8న ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హల్ద్వానీ రామ్‌లీల గ్రౌండ్‌లో ఖర్గే ప్రసంగించిన అనంతరం బీజేపీ అనుబంధ వర్గాలు ఆ ప్రదేశం అపవిత్రమైందంటూ శుద్ధి కార్యక్రమం నిర్వహించడం అత్యంత దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గణేష్ పంచమి మాట్లాడుతూ, ఖర్గే ప్రసంగానికి లక్షలాది మంది ప్రజలు హాజరయ్యారని, ఆయన తన ప్రసంగంలో ఎక్కడా కులం లేదా మతం పేరుతో ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా ప్రజల సమస్యలు, దేశ రాజకీయ పరిస్థితులు, రాజ్యాంగ పరిరక్షణ వంటి అంశాలనే ప్రస్తావించారని తెలిపారు. అలాంటి నాయకుడు ప్రసంగించిన వేదికను శుద్ధి చేయడం ద్వారా ఆయనను మాత్రమే కాదు, ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ విలువలను అవమానించినట్లేనని విమర్శించారు. ఇలాంటి చర్యలు దేశంలో సామాజిక విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని, ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ విభేదాలు ఉండొచ్చుగానీ వ్యక్తులను కించపరిచే చర్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కావని అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హల్ద్వానీ సభా వేదికను శుద్ధి చేసిన వారిపై అంటరానితనం నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని గణేష్ పంచమి ప్రభుత్వాన్ని కోరారు. ఇటువంటి సంఘటనలు దేశ ఐక్యతకు, సామాజిక సామరస్యానికి భంగం కలిగిస్తాయని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నాగుల పంచమి శుభాకాంక్షలు తెలిపిన మునిసిపల్ చైర్ పర్సన్ -ఇప్ప ఉమారాణి శ్రీనివాస్



**కామారెడ్డ్,ఆగస్టు 17.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**జిల్లా కేంద్రంలోని పెద్దమ్మ గుడి వద్ద గల పుట్టకి నాగ చవితి సందర్భంగా పూజలు చేసి పెద్దమ్మ ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. అనంతరం అక్కిడికి వచ్చిన భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేసారు, మున్సిపల్ చైర్మన్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రకృతిని, సమస్త జీవకోటిని పూజించే మన భారతీయ సంప్రదాయంలో నాగుల పంచమికి ఎంతో విశిష్టత ఉంది. ఆ నాగదేవత కరుణాకటాక్షాలు, ఆశీస్సులు మన మున్సిపాలిటీ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ పవిత్ర పర్వదినం మీ ఇంట్లో లక్ష్మీదేవి కటాక్షాన్ని, ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆయురారోగ్యాలు, శాంతి, సమృద్ధి, సంతోషాలను నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి దుబ్బాక ప్రసాద్, చిట్యాల రమేష్ ,మంత్రి బాలనర్సింలు, కనకంటి రమేష్, బట్టు నర్సింలు, కాకర్ల ఆశయ్య, కాకర్ల రాజు, నరేష్ ,స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు

శామీర్‌పేటలో నాగదేవతకు ప్రత్యేక పూజలు



**శామీర్‌పేట, ఆగష్టు 17 (నేటి మనదేశమ్):** : నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శామీర్‌పేట గ్రామంలోని అమ్మవారి ఆలయం వద్ద మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో నాగదేవతకు పాలు, పండ్లు, ప్రసాదాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచే మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నాగదేవతకు పాలు సమర్పించి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.



# ధర్మేంద్ర ప్రధాన్‌కు కీలక పదవి?

- నితిన్ నబిన్ టీమ్‌పై ఉత్కంఠ
- సీనియర్లకు కీలక పదవులు
- భారీ మార్పులపై ఊహాగానాలు

న్యూఢిల్లీ: జెన్ జీ పోరాటంతో కేంద్ర మంత్రి పదవి కోల్పోయిన ధర్మేంద్ర ప్రధాన్‌కు బీజేపీలో కీలక పదవి దక్కనుందని వార్తలు వస్తున్నాయి. జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆయనను నియమించే అవకాశం ఉందని జాతీయ మీడియాలో ఊహాగానాలు వెలుడుతున్నాయి. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఆధ్వర్యంలో ఏర్పడబోయే కొత్త టీమ్‌పై పెద్ద ఎత్తున చర్చలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు సీనియర్ నాయకులకు పార్టీలో కీలక పదవులు దక్కనున్నాయని ప్రచారం జరుగుతోంది. బీజేపీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. సీనియర్ నేతలు సతీష్ పూనియా, ధర్మేంద్ర ప్రధాన్, అనురాగ్ ఠాకూర్, స్మృతి ఇరానీలకు పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. మధ్యప్రదేశ్ మాజీ బీజేపీ అధ్యక్షుడు వీడీ శర్మకు కూడా పెద్ద బాధ్యత దక్కవచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అది బీజేపీ సంస్థాగత వ్యవస్థలో కావొచ్చు లేదా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంత్రివర్గంలో కావొచ్చని సమాచారం. త్రిపుర మాజీ ముఖ్యమంత్రి బిప్లబ్ దేవ్ పేరు కూడా కీలక పదవి కోసం పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఆ జాబితాపైనే ప్రధాన దృష్టి!

నితిన్ నబిన్ కొత్త టీమ్‌లో అత్యంత కీలకమైన మార్పులు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శుల విషయంలో ఉండే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం బీజేపీకి ఏడుగురు జాతీయ ప్రధాన కార్యదర్శులు ఉన్నారు. వీరిలో అరుణ్ సింగ్, దుష్యంత్ గౌతమ్, వినోద్ తావ్డే, తరుణ్ చుగ్, సునీల్ బన్సల్, రాధామోహన్ దాస్ అగర్వాల్, బీఎల్ సంతోష్ ఉన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత)గా ఉన్న బీఎల్ సంతోష్ మాత్రం కొనసాగడం దాదాపు ఖాయమని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ పదవిని సాధారణంగా ఆర్ఎస్ఎస్‌కు చెందిన నేతకే కేటాయిస్తారు. అయితే ఆయనకు కొత్త డిప్యూటీలను నియమించే అవకాశం ఉందని తెలుస్తోంది. దుష్యంత్ గౌతమ్, రాధామోహన్ దాస్ అగర్వాల్‌లకు విశ్రాంతి ఇవ్వడం దాదాపు ఖాయమనే ప్రచారం జరుగుతోంది.

వారిద్దరికి కీలక బాధ్యతలు?

ఇదే విభాగంలో కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్, సతీష్ పూనియాలను తీసుకురావచ్చని బీజేపీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. యువత, అనుభవజ్ఞుల కలయికతో టీమ్‌ను ఏర్పాటు చేయాలన్న నితిన్ నబిన్ ఆలోచనలో భాగంగా ధర్మేంద్ర ప్రధాన్‌ను కూడా జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించే అవకాశం ఉందని సమాచారం. అయితే ఈ పేర్లపై బీజేపీ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

ఉత్తరాది నుంచి భాటియా పేరు!

ఉత్తర భారతదేశం నుంచి హర్యానాలోని కర్నాల్‌కు చెందిన రాజ్యసభ ఎంపీ సంజయ్ భాటియా పేరు కూడా బీజేపీ కొత్త టీమ్‌లో కీలక బాధ్యత కోసం వినిపిస్తోంది. ఆయనకు పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో ఏదైనా ముఖ్యమైన పదవి దక్కవచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తంగా చూస్తే, నితిన్ నబిన్ ఆధ్వర్యంలో బీజేపీ జాతీయ సంస్థాగత వ్యవస్థలో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ప్రస్తుతం వినిపిస్తున్న పేర్లు, పదవులపై ఊహాగానాలే తప్ప, తుది నిర్ణయాలు ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు.

## కిమ్ మీద ప్రేమతో..

# దక్షిణ కొరియాకు షాకిచ్చిన ట్రంప్



ఇరాన్ విషయంలో అమెరికాకు మద్దతుగా నిలవడానికి మిత్రదేశం దక్షిణ కొరియా విముఖత వ్యక్తం చేసింది. దీంతో తీవ్ర అసంతృప్తికి గురైన అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దక్షిణకొరియాకు షాకిచ్చారు. ఆ దేశంతో నిర్వహించే సంయుక్త సైనిక విన్యాసాలను గణనీయంగా తగ్గించాలని తమ రక్షణ శాఖను ఆదేశించారు. ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో ఉన్న బంధం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ చెప్పడం గమనార్హం. ఈ మేరకు ఆయన తన ట్రూత్ ఖాతాలో పేర్కొన్నారు. "కిమ్‌తో నాకున్న మంచి స్నేహ బంధం దృష్ట్యా దక్షిణ కొరియాతో అమెరికా చేపట్టాల్సిన సంయుక్త సైనిక చర్యలను తగ్గించాలని అనుకుంటున్నా. ఈ విన్యాసాలు ఖర్చుతో కూడుకున్నవి. అందుకు వెచ్చించాల్సిన మొత్తంలో ఎక్కువ వ్యయాన్ని అమెరికానే భరిస్తోంది. ఇప్పటికే ఈ నిర్ణయం తీసుకోవడం ఆలస్యమైంది. ఇక, ఇరాన్ అణు కార్యక్రమాన్ని అడ్డుకునే చర్యల్లో అమెరికాతో కలిసి రావాలని దక్షిణ కొరియా అధ్యక్షుడిని కోరగా.. ఆయన రాలేమని చెప్పారు" అని ట్రంప్ రాసుకొచ్చారు. కాగా.. ఈ పోస్ట్‌కు కొద్ది గంటల ముందు కిమ్‌తో 2019లో దిగిన ఓ ఫొటోను ట్రంప్ పంచుకున్నారు. ఇక, జపాన్, ఫ్రాన్స్, బ్రిటన్ వంటి మిత్ర దేశాలు కూడా ఇరాన్ విషయంలో అమెరికాకు పూర్తి స్థాయిలో మద్దతు ఇవ్వడంపై వెనుకంజ వేస్తున్నాయని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా.. 'ఉల్చి ఫ్రీడం షీల్డ్' పేరుతో అమెరికా-దక్షిణ కొరియా ఇటీవల సంయుక్త సైనిక విన్యాసాలు ప్రకటించాయి. సోమవారం నుంచి 11 రోజులపాటు ఇవి జరగనున్నాయి. ఇందులో సుమారు 18 వేల మంది దక్షిణ కొరియా సైని కులు పాల్గొంటారు. అయితే ఈ విన్యాసాలు షెడ్యూల్ ప్రకారమే కొనసాగుతాయని సియోల్ స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా.. 2018లో కిమ్‌తో అణు చర్చలు జరిపిన సమయంలోనూ ట్రంప్.. అమెరికా-దక్షిణ కొరియా సైనిక విన్యాసాలను నిలిపివేశారు. తాజాగా కిమ్‌తో మళ్లీ స్నేహపూర్వక సంబంధాలపై మాట్లాడటం, సైనిక విన్యాసాలను తగ్గించాలని ఆదేశించడంతో ఉత్తర కొరియాతో చర్చలకు ట్రంప్ ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.

## విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకుంటే..

# జీతంలో 20శాతం కోత



ఢిల్లీ : బహుభార్యత్వం నిషేధం దిశగా కీలక చర్యలు చేపడుతోన్న అస్సాం ప్రభుత్వం.. తాజాగా మరో నిర్ణయం తీసుకుంది. మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండా రెండో పెళ్లి చేసుకున్న ప్రభుత్వ ఉద్యోగుల జీతంలో కోత పెట్టనుంది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సోమవారం ఈ కీలక ప్రకటన చేశారు. "ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా చట్టబద్ధంగా తన భార్య నుంచి విడాకులు తీసుకోకుండా ఆమెను వదిలేసి మరో మహిళతో వివాహ బంధం ఏర్పరుచుకుంటే.. ఆ వ్యక్తిపై చర్యలు తీసుకుంటాం. సదరు ఉద్యోగి జీతం నుంచి 20శాతం కోత విధించి.. ఆ మొత్తాన్ని మొదటి భార్య బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేస్తాం. అయితే, ఆ ఉద్యోగి మొదటి భార్య దీని గురించి ప్రభుత్వం వద్ద దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది" అని సీఎం హిమంత వెల్లడించారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగుల్లో కొంతమంది విడాకుల ప్రక్రియ పూర్తికాకుండానే మరో మహిళతో కలిసి ఉంటున్న కేసులు వెలుగుచూసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు హిమంత తెలిపారు. విడాకుల అంశం కోర్టు వద్ద పెండింగ్‌లో ఉన్నా కూడా.. జీతంలో కోత కొనసాగుతుందని స్పష్టం చేశారు. న్యాయపరమైన ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎదురుచూడకుండా మొదటి భార్యకు ఆర్థిక సహకారం అందించాలనేదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. ఇక, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల వేతనంలో 10శాతం కోత విధించనున్నట్లు హిమంత తెలిపారు.

# 2వ ప్రపంచ యుద్ధం తర్వాత రాయల్ ఎయిర్ ఫోర్స్‌లో..



భారత సంతతికి చెందిన 28 ఏళ్ల ఫ్లైట్ లెఫ్టినెంట్ అర్ష్‌దీప్ సింగ్ డాంగ్, బ్రిటన్ చెందిన రాయల్ ఎయిర్ ఫోర్స్‌లో ఫైటర్ పైలట్‌గా పట్టా పొందిన తొలి సిక్కు వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఒక సిక్కు యోధుడు ఫైటర్ స్క్వాడ్రన్ నుండి 'వింగ్స్' సాధించడం ఇదే తొలిసారి అని RAF తెలిపింది. నార్త్ వేల్స్‌లోని 'ాలీ వ్యాలీ'లో జరిగిన వేడుకలో అర్ష్‌దీప్ సింగ్ పట్టభద్రుడయ్యారు. తన తండ్రిని పైలట్‌గా చూడాలనేది తాతగారైన సర్దార్ సంతోఖ్ సింగ్ డాంగ్ కల అని, అయితే ఆయన చిన్నతనంలోనే మరణించడంతో ఆ అవకాశం రాలేదని అర్ష్‌దీప్ తెలిపారు. తల్లి దండ్రుల ప్రోత్సాహంతో తాతగారి కలను తాను నిజం చేసినట్లు అర్ష్‌దీప్ వెల్లడించారు. రక్షణ రంగంలో ఫ్రంట్‌లైన్ ఫైటర్ విమానాలను నడిపేందుకు ఆయన మరో ఏడాది పాటు కఠినమైన శిక్షణ తీసుకోనున్నారు. 1998లో చండీగఢ్‌లో జన్మించిన అర్ష్‌దీప్, తన ఆరేళ్ల వయసులో కుటుంబంతో కలిసి యూకే వెళ్లారు. ప్రస్తుతం వారి కుటుంబం ఇంగ్లాండ్ లోని సౌత్ ఆల్‌లో నివసిస్తోంది. ఆయన తండ్రి జగ్‌దీప్ సింగ్ డాంగ్ (లుధియానా), తల్లి గగన్‌దీప్ కౌర్ (అమృత్‌సర్). బ్రిస్టల్ విశ్వవిద్యాలయంలో గణితం మరియు తత్వశాస్త్రం అభ్య సించిన ఆయన, 20 22లో ఆఫీసర్ ట్రైనింగ్ పూర్తి చేశారు. 2025లో ఫాస్ట్ జెట్ శిక్షణ ప్రారంభించి, అక్టోబర్ 2025లో టెక్సాస్‌లో సోలో ఫ్లైట్ పూర్తి చేశారు. జులై 2026లో 'వింగ్స్ టెస్ట్'లో ఉత్తీర్ణులయ్యారు. మొదటి ప్రపంచ యుద్ధ పైలట్ ఇంద్రలాల్ రాయ్, హర్దిత్ సింగ్ మాలిక్, స్క్వాడ్రన్ లీడర్ మోహిందర్ సింగ్ పూజ్జీ సహా, బ్రిటిష్ సైనిక విమానయానంలో సేవలందిం చిన భారతీయ సంతతికి చెందినఈ ఘనత సాధించి భారతీయుల సరసన అర్ష్‌దీప్ చేరారు.

## నాసాకు వీడ్కోలు పలికిన సీనియర్ వ్యోమగామి..



వాషింగ్టన్: దాదాపు మూడు దశాబ్దాలుగా నాసాలో సేవలందించిన సీనియర్ వ్యోమగామి మైక్ ఫింకె నాసాకు వీడ్కోలు పలికారు. ఆగస్టు-12 బుధవారంతో నాసాలో ఆయన సేవలు ముగిశాయని అమెరికా అంతరిక్ష సంస్థ వెల్లడించింది. అయితే అంతరిక్ష పరిశోధనలు, అన్వేషణలో తన వంతు పాత్ర కొనసాగిస్తానని ఫింకె తెలిపారు. 1996లో నాసా వ్యోమగాముల బృందంలో చేరిన ఫింకె.. తన సుదీర్ఘ కెరీర్‌లో నాలుగు అంతరిక్ష యాత్రలు చేశారు. మొత్తం 549 రోజులు అంతరిక్షంలో గడిపిన ఆయన.. నాసా వ్యోమగాముల్లో అత్యధిక కాలం అంతరిక్షంలో గడిపిన వారిలో నాలుగో స్థానంలో ఉన్నారు. అలాగే తొమ్మిది సార్లు స్పేస్‌వాక్ నిర్వహించారు. ఆయన కెరీర్‌లో ఎక్కువ సమయం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం లోనే గడిచింది.

అంతరిక్ష కేంద్రంలో అకస్మాత్తుగా అస్వస్థత..

ఇటీవల ఫింకె చేపట్టిన చివరి అంతరిక్ష యాత్ర మాత్రం అనూహ్య పరిణామాలతో ముగిసింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న సమయంలో ఆయనకు అకస్మాత్తుగా ఓ వైద్య సమస్య తలెత్తింది. దాదాపు 20 నిమిషాల పాటు మాట్లాడే సామర్థ్యాన్ని కోల్పోయినట్లు ఫింకె స్వయంగా వెల్లడించారు. ఆయన పరిస్థితిని గమనించిన సహచరులు వెంటనే స్పందిం చారు. కొన్ని సెకన్లలోనే మొత్తం బృందం అప్రమత్తమై వైద్య సహాయం అందించిందని ఆయన తెలిపారు. అయితే ఈ అస్వస్థతకు అసలు కారణం ఇప్పటికీ స్పష్టంగా తెలియ లేదని, నాసా మరియు వైద్య పరిశోధకులు దానిపై దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు.

ముందుగానే భూమికి తిరుగు ప్రయాణం

ఫింకెతో పాటు స్పేస్‌ఎక్స్ క్రూ-11లో ఉన్న మరో ముగ్గురు సభ్యులు -నాసా వ్యోమగామి జీనా కార్డ్‌మన్, జపాన్‌కు చెందిన కిమియా యుయి, రష్యాకు చెందిన ఒలెగ్ ప్లాటోనోవ్ అనుకున్న సమయం కంటే కొన్ని వారాల ముందుగానే భూమికి తిరిగి వచ్చారు. అంతరిక్ష కేంద్రంలో అందుబాటులో లేని అధునాతన వైద్య ఇమేజింగ్ సదుపాయాలను భూమిపై ఉపయోగించేందుకు సిబ్బందిని ముందుగానే వెనక్కి తీసుకురావాలని నిర్ణయించినట్లు నాసా తెలిపింది. ఈ ఘటన కారణంగా అంతరిక్ష కేంద్రంలో సిబ్బంది నిర్వహించాల్సిన ఓ స్పేస్‌వాక్‌ను కూడా రద్దు చేశారు. అలాగే, ఆరోగ్య కారణాలతో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన సిబ్బంది యాత్రను నాసా ముందుగానే ముగిం చాల్సిన పరిస్థితతి రావడం ఇదే తొలిసారి.నాసా నుంచి వైదొలుగుతున్నప్పటికీ అంతరిక్ష అన్వేషణకు తన నిబద్ధత కొనసాగుతుందని ఫింకె పేర్కొన్నారు.

## ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన ప్రశాంత్ కిషోర్



పాట్నా: జన్ సూరజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్(పీకే) ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం బీహార్ శాసనసభలో స్పీకర్ ప్రేమ్ కుమార్ సమక్షంలో బంకిపూర్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆగస్టు 3వ తేదీన బీహార్‌లోని బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో పీకే ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. 1995 నుండి బీజేపీ కంచుకోటగా ఉన్న ఈ స్థానాన్ని దక్కించుకున్న పీకే.. బీజేపీకి గట్టి దెబ్బ కొట్టి చరిత్రాత్మక ఎన్నికల రంగ ప్రవేశం చేశారు. ఆ ఎన్నికల్లో మొత్తం 64,151 ఓట్లు సాధించిన పీకే.. బీజేపీకి చెందిన నీరజ్ కుమార్‌ను 19,324 ఓట్ల తేడాతో ఓడించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజ్యసభకు వెళ్లడంతో.. బంకీపూర్ అసెంబ్లీ సీటు ఖాళీ అయ్యింది. దీంతో ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది.

# ఆటోడ్రైవర్ ఇంట్లో నోట్ల కట్టలు..

## 4 బ్యాగుల్లో రూ.3 కోట్లు



భోపాల్: ఒక చిన్న ఇల్లు అది.. పోలీసులు తలుపులు తెరిచారు అంతే.. బయటికి కనిపించని ఓ భారీ రహస్యం ఒక్కసారిగా బయటపడింది. సాధారణంగా కనిపించే ఆ ఇంట్లో దాచిన డబ్బును చూసి అక్కడికి వెళ్లిన వారే ఒక్క సారిగా షాక్‌కు గుర య్యారు. మధ్యప్రదేశ్‌లోని సాగర్‌లో ఓ ఆటో డ్రైవర్ ఇంట్లో పోలీసులకు రూ. 3 కోట్లకు పైగా నగదు దొరికింది. అయితే పోలీసులు అక్కడికి వెళ్లింది డబ్బు కోసం కాదు.. సోషల్ మీడియాలో ఆ డ్రైవర్ చేతిలో కనిపించిన పిస్టల్ ఫొటోపై విచారణ కోసం. గోపాల్‌గంజ్ పోలీస్‌లు ఆటో డ్రైవర్ సౌరభ్ అహిర్వార్ ఇంట్లో సోదాలు చేశారు. ఆ సమయంలో ఓ లాక్ చేసిన అల్మారా కనిపించింది. దాని తాళం కుటుంబ సభ్యుల వద్ద లేకపోవడంతో పోలీసులు నిబంధనల ప్రకారం దాన్ని తెరిచారు. అందులో 4 బ్యాగుల్లో భారీగా నోట్ల కట్టలు కనిపించాయి. ఒక్క బ్యాగులోనే సుమారు రూ. 1.33 కోట్లు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. నాలుగు బ్యాగుల్లో కలిపి మొత్తం రూ. 3 కోట్లకు పైగా నగదు ఉన్నట్లు తేలింది. డబ్బును లెక్కించేందుకు కరెన్సీ కౌంటింగ్ మెషీన్ ఉపయోగించారు. సోదాలు, నగదు లెక్కింపు ప్రక్రియను వీడియోలో రికార్డు చేశారు. ఈ డబ్బు తమది కాదని కుటుంబ సభ్యులు చెప్పారు. రమేశ్ అహిర్వార్ అనే బంధువు డబ్బును 8-9 నెలల క్రితం అక్కడ ఉంచి వెళ్లారని వారు తెలిపారు. రమేశ్ అహిర్వార్ భోపాల్‌లోని చునాభట్టి ప్రాంతంలో ఉంటారని, పీడబ్ల్యూడీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నారని కుటుంబం చెబుతోంది.

అయితే రూ. 3 కోట్ల నగదును ఎందుకు ఇంట్లో ఉంచారు? డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? దానికి చట్టబద్ధమైన ఆధా రాలు ఉన్నాయా? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆదాయపు పన్ను, రెవెన్యూ తదితర సంబంధిత విభాగాలకు కూడా సమాచారం ఇవ్వనున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఆ డబ్బు పీడబ్ల్యూడీ ఇంజినీర్‌దేనని పోలీసులు నిర్ధారించ లేదు. అది రమేశ్ అహిర్వార్‌దేనని కుటుంబ సభ్యులు చేసిన వాదన మాత్రమే. పోలీసులు నగదు మూలాన్ని విచారిస్తున్నారు.

## డ్రైనేజ్ తవ్వుతుంటే బయటపడిన రూ.98 కోట్ల బంగారం..

## 18 ఏళ్ల యువకుడికి దొరికిన భారీ నిధి..



బ్రస్సెల్స్ : సాధారణంగా మురుగు కాలువ పనులు చేస్తుండగా మట్టి, రాళ్లు బయటపడటం సహజం. కానీ బెల్జియంలో ఓ 18 ఏళ్ల యువకుడికి మాత్రం ఏకంగా కోట్ల విలువైన బంగారు నిధి దొరికింది. డ్రైనేజీ పైపుల కోసం తవ్వకాలు చేపడుతుండగా అతడికి బంగారు నాణేలు, బంగారు కడ్డీలు కనిపించాయి. ఈ మొత్తం నిధి విలువ సుమారు 90 లక్షల యూరోలు.. భారత కరెన్సీలో దాదాపు రూ. 98 కోట్లు ఉంటుందని అంచనా. సింట్-గిల్లిస్-డెండర్ మొండే ప్రాంతంలో ఓ నిర్మాణ సంస్థలో వేసవి ఉద్యోగిగా పనిచేస్తున్న 18 ఏళ్ల కోబే ఈ నిధిని గుర్తించాడు. సహచరులతో కలిసి మురుగు కాలువ కోసం భూమిని తవ్వుతుండగా ఏదో వస్తువు కనిపించింది. మొదట అవి సాధారణ ఒక యూరో నాణేలు అనుకున్నామని కోబే చెప్పాడు. మరికొంత తవ్విన తర్వాత బంగారు కడ్డీ కనిపించడంతో అసలు విషయం అర్థమైందని వివరించాడు. బంగారు నాణేలు, బంగారు కడ్డీలను ఓ సంచిలో పెట్టి, పాత భవనం కింద ఉన్న నేలమాళిగ గోడలో ఇటుకల మధ్య దాచినట్లు తెలిపాడు

ఈ భవనం 19వ శతాబ్దం చివర్లో బీరు తయారీ వ్యాపారి థియోఫిలస్ వాన్ అస్చే కోసం నిర్మించిన విల్లాగా తెలుస్తోంది. నిధి బయటపడిన వెంటనే కోబే, అతడి సహచరులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అధికారులు బంగారాన్ని స్వాధీనం చేసుకుని బ్రస్సెల్స్‌లోని సురక్షిత ప్రాంతానికి తరలించారు. ప్రస్తుతం బంగారం ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు దాచారు? అసలు యజమాని ఎవరు? అనే అంశాలపై దర్యాప్తు జరుగుతోంది ఈ నిధిపై హక్కు విషయంలో ఇప్పుడు అసలు వివాదం మొదలయ్యే అవకాశం ఉంది. బెల్జియం చట్టం ప్రకారం అసలు యజమానులు లేదా వారి వారసులు నిధిపై హక్కును కోరేందుకు ఐదేళ్ల వరకు అవకాశం ఉంటుంది.

ఈ వ్యవధిలో ఎవరూ హక్కును నిరూపించలేకపోతే తదుపరి చట్టపరమైన ప్రక్రియ అమలవుతుంది. భారీ నిధిని గుర్తించిన కోబే, అతడి సహచరులకు కూడా రివార్డ్ లభించే అవకాశం ఉంది.

# పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వానికి భారమైందా?

**కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి**
**కొత్త పెన్షన్లు మంజూరు చేయాలి**
**బిఆర్ఎస్ ఆధ్వర్యంలో జగిత్యాలలో నిరసన -- ఆర్డీవోకు వినతిపత్రం అందజేత**




**జగిత్యాల, ఆగస్టు 17(నేటి మన దేశమ్ ప్రతినిధి):** పేదలు, వృద్ధులు, బీడీ కార్మికులు, ఆడబిడ్డల సంక్షేమం కోసం గత ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా కేంద్రంలో జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత -సురేష్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీడీ కార్మికులు, వృద్ధులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎలాంటి జాప్యం లేకుండా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు నల్ల రిబ్బన్లు ధరించి, బీడీలు చుడుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దావ వసంత -సురేష్ మాట్లాడుతూ.. పేదలు, బలహీన వర్గాల సంక్షేమ పథకాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ముఖ్యంగా ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కల్యాణ లక్ష్మి పథకానికి సంబంధించి కోర్టు స్టే ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తరఫున కౌంటర్ దాఖలు చేయడంలో జాప్యం చేయడం వెనుక ఉన్న కారణాలను ప్రభుత్వం ప్రజలకు వివరించాలని ఆమె ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన ఆడబిడ్డలకు అండగా నిలిచే ఈ పథకాన్ని రాజకీయ కక్షతో నిలిపివేయడం సరికాదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా పేద కుటుంబాల్లోని ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందించారని వసంత గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను కూడా ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో కల్యాణ లక్ష్మి పథకం కింద లక్ష రూపాయల ఆర్థిక సహాయంతో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీ అమలు విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని విమర్శించారు. కనీసం గతంలో అమలులో ఉన్న ఆర్థిక సహాయాన్ని కూడా సకాలంలో అందించని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. వృద్ధులు, బీడీ కార్మికులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు కొత్తగా పెన్షన్లు మంజూరు చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని వసంత ఆరోపించారు. ఎన్నికల సమయంలో వృద్ధాప్య పెన్షన్‌ను రూ.4 వేల వరకు పెంచుతామని హామీ ఇచ్చారని, అయితే కొత్తగా అర్హులైన వారికి దరఖాస్తులు స్వీకరించి పెన్షన్లు మంజూరు చేయడంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. బీడీ కార్మికుల కుటుంబాలు ఎన్నో ఏళ్లుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, వారికి సామాజిక భద్రత కల్పించేందుకు పెన్షన్ ఎంతో అవసరమని పేర్కొన్నారు. బీడీ కార్మికుల ఓట్లు కావాలి కానీ వారి సంక్షేమం మాత్రం అవసరం లేదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వృద్ధుల జీవితాలతో చెలగాటం ఆడవద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో అమలైన పెన్షన్ పథకాలను కొనసాగించడంతో పాటు కొత్తగా అర్హులైన వారికి కూడా వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మహాలక్ష్మి పథకం కింద 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారని వసంత గుర్తుచేశారు. వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి, ప్రభుత్వం ఏర్పడి చాలా కాలం గడిచినా అనేక హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన రైతు బీమా, దళిత బంధు తదితర సంక్షేమ పథకాలను కూడా పునరుద్ధరించాలని ఆమె డిమాండ్ చేశారు. రాజకీయ కక్షలకు అతీతంగా పేదలు, రైతులు, మహిళలు, కార్మికులు, వృద్ధుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం అనే ప్రచారం కంటే ముందుగా పేద ఆడబిడ్డలకు అండగా నిలిచే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పటిష్టంగా అమలు చేయాలని వసంత డిమాండ్ చేశారు. ఆడబిడ్డల హక్కులను హరించవద్దని, హామీలు మాత్రమే కాకుండా ప్రజలకు హక్కులు కల్పించాలని అన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, పెన్షన్లు తదితర సంక్షేమ పథకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే మహిళలు, లబ్ధిదారులతో కలిసి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని దావ వసంత హెచ్చరించారు. పేద కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎలాంటి జాప్యం లేకుండా కొనసాగించాలని, అర్హులైన వృద్ధులు, బీడీ కార్మికులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని బీఆర్ఎస్ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, పెన్షన్లు అందని బీడీ కార్మిక మహిళలు, కల్యాణ లక్ష్మి లబ్ధిదారులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# కూరగాయల సాగుతో మహిళలకు అదనపు ఆదాయం

**వంటింటి తోటలతో పోషకాహారం.. తక్కువ పెట్టుబడితో అధిక ప్రయోజనాలు**



**మేడ్చల్ మల్కాజ్గిరి, (శామీర్‌పేట), ఆగస్టు 17 (నేటి మనదేశమ్):** మహిళా సంఘాల సభ్యులు, మహిళా రైతులు వంటింటి తోటల పెంపకంతో పాటు కూరగాయల సాగుపై అవగాహన పెంచుకుని, ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని జిల్లా ఉద్యాన అధికారి శ్రీధర్‌రెడ్డి సూచించారు. శామీర్‌పేట మహిళా శక్తి భవన్‌లో సోమవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు వంటింటి తోటలు, కూరగాయల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇంటి పరిసరాల్లో అందుబాటులో ఉన్న స్థలాన్ని వినియోగించుకుని వివిధ రకాల కూరగాయలను సాగు చేసుకోవచ్చన్నారు. వంటింటి తోటల ద్వారా కుటుంబ అవసరాలకు సరిపడే తాజా, నాణ్యమైన కూరగాయలను అందుబాటులో ఉంచుకోవడంతోపాటు, అదనంగా పండించిన ఉత్పత్తులను విక్రయించడం ద్వారా మహిళలు కొంతమేర ఆదాయం పొందవచ్చని తెలిపారు. సేంద్రియ పద్ధతులు, సహజ ఎరువుల వినియోగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మహిళా రైతులు కూరగాయల సాగులో పాటించాల్సిన మెలకువలు, విత్తనాల ఎంపిక, నాటే విధానం, నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం, చీడపీడల నివారణ వంటి అంశాలను శిక్షణలో వివరించారు. తక్కువ విస్తీర్ణంలో అధిక దిగుబడి సాధించే పద్ధతులను అవలంబించాలని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు సూచించారు. కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకట్‌రామ్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి రమేశ్, ఉద్యాన అధికారి వెంకట్‌రమణ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అజయలక్ష్మి, మండల సమాఖ్య అధ్యక్షురాలు లావణ్య, ఏపీఎం నాగశ్రీ, వ్యవసాయ విస్తరణ అధికారులు సుధీర్‌కుమార్, అర్చన, మెప్మా సిబ్బంది ఉమేశ్, మహిళా సంఘాల సభ్యులు, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కాలేజీ అభివృద్ధికి పాయం వెంకటేశ్వర్లు పెద్దపీట..

**రూ.15 లక్షలతో గ్రౌండ్ లెవలింగ్ పనులకు ఎమ్మెల్యే పాయం భూమి పూజ**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ఆగస్టు 17: పెనుపాక నియోజకవర్గం (నేటి మన దేశమ్ ప్రతినిధి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లామణుగూరు మండలం సమితి సింగారంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పెద్దపీట వేస్తున్నారు. కళాశాల ప్రాంగణాన్ని మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు రూ.15 లక్షలతో చేపట్టనున్న గ్రౌండ్ లెవలింగ్ పనులకు సోమవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు మెరుగైన మౌలిక వసతులు, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నామని పేర్కొన్నారు. గ్రౌండ్ లెవలింగ్ పనులు పూర్తయితే కళాశాల ప్రాంగణం మరింత సౌకర్యవంతంగా మారుతుందని, విద్యార్థులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర విద్యా కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుకూలంగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని పాయం వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులో ఉండేలా కళాశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా అభివృద్ధి** విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కళాశాలలో మౌలిక వసతులను మెరుగుపరచడం ద్వారా వారికి మెరుగైన విద్యా వాతావరణం కల్పించవచ్చని నాయకులు పేర్కొన్నారు. రూ.15 లక్షలతో చేపడుతున్న గ్రౌండ్ లెవలింగ్ పనులు పూర్తయిన తర్వాత కళాశాల ప్రాంగణం రూపురేఖలు మరింత మెరుగుపడనున్నాయి. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కళాశాల అధ్యాపకులు, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మైనారిటీ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మీ కొనసాగాలి పేదింటి ఆడబిడ్డ గెలవాలి




**మందమర్రి ఆగష్టు 17 (నేటి మనదేశమ్):** కళ్యాణ లక్ష్మీ షాదీ ముబారక్ పథకం కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మందమర్రి పట్టణ తాసిల్దార్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించడం జరిగింది. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్. కేటీఆర్ పిలుపు మేరకు, చెన్నూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదేశాల మేరకు, కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మీ షాదీ ముబారక్ పథకాన్ని నిలిపివేయడాన్ని నిరసిస్తూ మందమర్రి పట్టణం, మందమర్రి మండలం, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు తాసిల్దార్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూకేసీఆర్ పథకాలను పేదల మనసుల్లో నుంచి తొలగించలేరు. కళ్యాణ లక్ష్మీ కొనసాగాలి పేదింటి ఆడబిడ్డ గెలవాలి! 1,00,116 భరోసా కొనసాగాలి -- కళ్యాణ లక్ష్మీ పథకం నిలవాలి! అని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రానున్న రోజుల్లో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో క్యాతన్ పల్లి మున్సిపల్ చైర్మన్ పర్సన్ సంధ్యారాణి డా: రాజారమేష్ మందమర్రి బిఆర్ఎస్ నాయకులు ఎండి అబ్బాస్ కొంగల తిరుపతిరెడ్డి సూరిబాబు తోటా సురేందర్ మోహరం శ్రీనివాస్ మజార్ సలావుద్దీన్ అద్దె శ్రీకాంత్ శ్రీకాంత్ జూల శ్రీనివాస్ నరసింహులు రాయ నరుసు మరియుమందమర్రి మండలం, క్యాతన్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, టీబీజీకేఎస్ యూనియన్ నాయకులు, , యువజన, విద్యార్థి, సోషల్ మీడియా నాయకులు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి..

**- జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు**



**నిర్మల్ , ఆగస్టు 17 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కాలేశ్వరం ప్రాజెక్టును పరిశీలించేందుకు అశ్వాపురం బీఆర్ఎస్ నాయకుల పయనం..



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ఆగస్టు 17 :పినపాక నియోజకవర్గం (నేటి మన దేశమ్ ప్రతినిధి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాఅశ్వాపురం: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బహుళార్థక కాళేశ్వరం ప్రాజెక్టు స్థితిగతులను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు అశ్వాపురం బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాళేశ్వరం బయలుదేరారు. ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలు, ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, నిర్మాణం--నీటి వినియోగానికి సంబంధించిన వాస్తవాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఈ పర్యటన చేపట్టినట్లు నాయకులు తెలిపారు.

**"ఆరోపణలు విన్నంత మాత్రాన కాదు..** వాస్తవాలను కళ్లారా చూసి ప్రజలకు చెప్పాలి" అని నాయకులు పేర్కొన్నారు. "కాళేశ్వరం ప్రాజెక్టు నిజానిజాలు ప్రజలకు తెలియాలి.. రాజకీయ ఆరోపణలకు అతీతంగా వాస్తవ పరిస్థితులు వెలుగులోకి రావాలి" అని అన్నారు. "ప్రాజెక్టు నిర్మాణంతో తెలంగాణ సాగునీటి రంగంలో వచ్చిన మార్పులు, ప్రస్తుతం ఎదురవుతున్న పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం" అని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన అనంతరం అక్కడి పరిస్థితులపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడిస్తామని నాయకులు పేర్కొన్నారు.

# 22ఏ జాబితా నుంచి కాలనీలను తొలగించాలి

**మల్కాజిగిరిలో నేడు మహాధర్నా**

**నేరేడ్ మెట్, ఆగస్టు 17 (నేటి మనదేశమ్):** :నియోజకవర్గంలోని పలు కాలనీలకు చెందిన స్థిరాస్తులు 22ఏ నిషేధిత జాబితాలో ఉండటంతో క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లకు ఆటంకాలు ఎదురవుతున్నాయని, వాటిని జాబితా నుంచి తొలగించాలని కోరుతూ మంగళవారం మహాధర్నా నిర్వహించనున్నట్లు మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్‌గౌడ్ తెలిపారు. ఉదయం 10 గంటలకు నేరెడ్‌మెట్ వాజ్‌పేయినగర్‌లోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. 22ఏ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీల వాసులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మల్కాజిగిరి, సఫీల్‌గూడ, రక్షణ కాలనీ, నేరెడ్‌మెట్, మౌలాలి, వినాయక్‌నగర్, కాకతీయనగర్, ఆనంద్‌బాగ్, మిర్జాల్‌గూడ, గౌతంనగర్, గీతానగర్, సైనిక్‌పురి, యాప్రాల్, అల్వాల్, వెంకటాపురం, భూదేవినగర్, బలరామ్‌నగర్, సంజయ్‌నగర్, మరికొన్ని కాలనీలు 22ఏ జాబితా ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నాయని తెలిపారు.

# ఎల్లారెడ్డి అభివృద్ధికి ఎమ్మెల్యే మదన్ మోహన్ ప్రత్యేక చొరవ

**పెండింగ్ బిల్లుల విడుదల, 13 నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ల మంజూరుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కి వినతి**



**కామారెడ్డ్/హైదర్‌బాద్:ఆగస్టు 17.(నేటి మనదేశమ్ ప్రతినిధి)** ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే మదన్ మోహన్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయడంతో పాటు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి 13 నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేయాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కకి ఎమ్మెల్యే మదన్ మోహన్ వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నెలకొన్న తక్కువ వోల్టేజ్ సమస్యలు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు, భవిష్యత్‌లో పెరగనున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 13 నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యే ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను త్వరితగతిన విడుదల చేయాలని కోరారు.

**నూతన సబ్‌స్టేషన్ల ప్రతిపాదిత ప్రాంతాలు** గోలి లింగాల గేట్ – నాగిరెడ్డిపేట్ మండలం గిద్ద – రామారెడ్డి మండలం వెల్లుట్ల -- ఎల్లారెడ్డి మండలం సోమార్పేట్– ఎల్లారెడ్డి మండలం దుర్గం – గాంధారి మండలం గౌరారం (కలాన్) – గాంధారి మండలం గుర్జాల్ – గాంధారి మండలంధర్మారావుపేట్ – సదాశివనగర్ మండలం కుప్రియాల్ – సదాశివనగర్ మండలం తిమ్మోజీవాడి -- సదాశివనగర్ మండలం లింగంపల్లి – సదాశివనగర్ మండలం మెంగారం – లింగంపేట్ మండలంలింగంపల్లి ఖుర్ద్ – లింగంపేట్ మండలం,ఎమ్మెల్యే మదన్ మోహన్ అందించిన వినతి పత్రంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. పెండింగ్ బిల్లుల విడుదలతో పాటు 13 నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి, త్వరలోనే అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, అభివృద్ధి పనులకు నిధులు సాధించేందుకు ఎమ్మెల్యే మదన్ మోహన్ చేస్తున్న నిరంతర కృషిపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బిఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం



**సిద్దిపేట ఆగస్టు 17 నేటి మనదేశం :** సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు బిఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది బిఎంఎస్ 161 కేంద్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయంలో ఆగస్టు 17 న జిల్లా కేంద్రంలో కార్మిక సమస్యల పరిష్కారానికై భారీ ధర్నాలు నిరసనలు తెలుపాలని నిర్ణయించడం జరిగింది. దాంట్లో భాగంగా ధర్నాలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు కలాల్ శ్రీనన్న పాల్గొన్నారు మరియు బోలెక్కేశ్వరి రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు జిల్లా అధ్యక్షులు చామకూరి రాజయ్య ప్రధాన కార్యదర్శి ముద్దం రాజిరెడ్డి బీడీ కార్మిక సాంగ్ ప్రధాన కార్యదర్శి కంది కొండల్ రెడ్డి రాష్ట్ర అధ్యక్షులు కలాల్ శ్రీనన్న మాట్లాడుతూ పాల్గొని కార్మిక సమస్యల పైన నిరంతరం పోరాటం చేస్తుంది బిఎంఎస్ అని అదేవిధంగా దేశ రాష్ట్ర రాజకీయాల్లో ఎమ్మెల్యేలకు గాని ఎంపీల గాని జీతాలు పెంచుకుంటూ పోతున్నారు మరియు కార్మిక జీతాలు దొంగలు తొక్కుతున్నారు ఎమ్మెల్యే పదవి గాని ఎంపీ పదవి గానీ పోతే కనీస పెన్షన్ వేల సంఖ్యలో ఉంటుంది కార్మికుల పెన్షన్ మాత్రం వెయ్యి రూపాయలు మాత్రమే ఉంటుంది రాజకీయ ఓట్ల కోసం ఎన్నో మాయమాటలు చెప్పి అధికారంలోకి వస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్ళు తెరిచి కార్మికులకు న్యాయం చేయాలని బిఎంఎస్ నుండి డిమాండ్ చేస్తున్నాం లేనిపక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేస్తున్నాము ఇవి మా ప్రధానమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ధర్నాలో భాగంగా సిద్దిపేట జిల్లా జెంట్ కలెక్టర్ వినతి పత్రం సమర్పించడం జరిగింది

**డిమాండ్లు :** ఈపీఎస్ కనీస పెన్షన్ వెయ్యి రూపాయల నుండి 7500 రూపాయలు పెంచాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వేతనాలు జీవోలను వెంటనే సవరించి కనీస వేతనం 30 వేల రూపాయలకు పెంచాలి బిరాష్ట్ర ప్రభుత్వం బీడీ కార్మికులకు జీవన భృతిని రూపాయలు 4016 రూపాయలను వెంటనే అమలు చేయాలి మరియు ఎలాంటి ఆంక్షలు లేకుండా అందరికీ జీవన భృతి అమలు చేయాలి బీడీ కార్మికులందరికీ జీవన భృతి దరఖాస్తు దరఖాస్తులను స్వీకరించి అమలు వెంటనే అమలు చేయాలి అసంఘటిత కార్మికులకు సంక్షేమబోర్డును ఏర్పాటు చేసి ఈఎస్ఐ పిఎఫ్ కల్పించాలి స్కీం వర్కర్స్ అయినటువంటి ఆశా అంగన్వాడీ మిడ్ డే మీల్స్ సిహెచ్ వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి సామాజిక భద్రత పాటించి పెన్షన్ విధానాన్ని ప్రకటించాలి ఈఎస్ఐ పిఎఫ్ సీలింగ్ రెండింతల అమలు చేయాలి లేకేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లను ఓపిహెచ్ ,డబ్ల్యుని మరియు పారిశ్రామిక చట్టాలలో మార్పు చేయాలిఈరోజు ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు దొంతు మల్లేశం వసంత అక్క లక్ష్మి బుచ్చిలింగం విష్ణు రాజు చల్ల శీను కృష్ణమూర్తి శీను తదితరులు బీడీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## టీ ఆర్ ఎస్ పార్టీ ని గ్రామ స్థాయి నుంచి బలోపేతం కావల్సిన అవసరం ఉంది

### గవినోళ్ల శ్రీనివాస్ టీ ఆర్ ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్



**న్ారాయణ్‌పేట ఆగస్టు 17(నేటి మన దేశమ్ ప్రతినిధి)** నర్సాపూర్ గ్రామంలో తెలంగాణ రక్షణ సేన గ్రామ కమిటీ ఎన్నిక నర్సాపూర్ గ్రామంలో తెలంగాణ రక్షణ సేన గ్రామ కమిటీని ఏర్పాటు చేసి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామస్థులు, తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్యకర్తల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.నూతన కమిటీ గ్రామ అధ్యక్షుడిగా పకీరప్ప, ఉపాధ్యక్షుడిగా మహిపాల్, ప్రధాన కార్యదర్శిగా కురుమయ్య, ఉపకార్యదర్శిగా నర్సింలు, యూత్ అధ్యక్షుడిగా కర్రె నాగేష్, సోషల్ మీడియా ఇంచార్జిగా లాలప్ప ఎన్నికయ్యారు.అదేవిధంగా మీటింగ్ నిర్వాహకులుగా చంద్రప్ప నారాయణ, అనంతప్ప ఆనంద్ కుమార్ వ్యవహరించగా, గ్రామ సభ్యులుగా. చిన్న చంద్రప్ప, హనుమంతు తదితరులు ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులను తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షులు, నారాయణపేట నియోజకవర్గం ఇంచార్జి గవినోళ్ల శ్రీనివాస్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో తెలంగాణ రక్షణ సేనను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని నూతన కమిటీ సభ్యులకు సూచించారు.గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని, యువతను భాగస్వామ్యం చేస్తూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గవినోళ్ల జనార్ధన్, పల్లెబండ నర్సింలు, కేశవులు, అశోక్ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

## మాణిక్ ప్రభు మందిరం ఆలయ నూతన కమిటీ ఎన్నిక



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 17 (నేటి మనదేశమ్)** సంగారెడ్డి పట్టణంలోని మాణిక్య ప్రభు మందిరం ఆలయ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చీఫ్ అడ్వైజర్ గా తోపాజి అనంత కిషన్, అధ్యక్షునిగా అమేటి కృష్ణ, ప్రధాన కార్యదర్శి గా కొవ్వూరు హనుమంతు, కోశాధికారిగా నాయి కోటి నాగరాజు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, అశోక్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్ గౌడ్, కొండాపురం జగన్ ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా పరమేశ్వర్ గౌడ్, గుండ్లపల్లి నరేష్ కుమార్, సహాయ కా దర్శులుగా నామ శ్రీనివాస్, అమేటి రాజేంద్ర ప్రసాద్,గౌరవ అధ్యక్షులుగా ఆమెటి మహేందర్, సలహాదారులుగా మిఠాయి నారాయణ, ఆమెటి ప్రభులింగం, కొంపల్లి విద్యా సాగర్, పంపాటి కృష్ణ మూర్తి, ప్రహ్లాద్, అంజయ్య, కార్యవర్గ సభ్యులుగా సురేష్, బలవంతరావు, ర్యాకల సంతోష్ కుమార్, కాంశెట్టి శంకర్, శంకర్, వెంకట్, మధు, పెంటయ్య, అనుముల సంతోష్, శేఖర్ ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు ఆమెటి కృష్ణ మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి కార్యవర్గ సభ్యులు పూర్తిస్థాయిలో కృషి చేస్తారని చెప్పారు.

## ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలి : జిల్లా కలెక్టర్ అంకిత్

### ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి
### ప్రజలకు చేరువగా ప్రజావాణి - మండలాల్లోనూ నిర్వహణ



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ఆగస్టు 17: ( నేటి మన దేశమ్ ప్రతినిధి)**సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అతను కలెక్టర్ విద్యా చందన, డి ఆర్ వో పద్మావతి తో కలసి స్వీకరించారు. భూ సంబంధిత వివాదాలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, పెన్షన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ప్రభుత్వం కల్పించిన ముఖ్యమైన వేదిక అని అన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖలకు వెంటనే పంపించాలని సూచించారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.శాఖల మధ్య సమన్వయంతో ప్రజల సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ, పరిష్కార స్థితిని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా స్పందించి, ప్రభుత్వ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందించాలని తెలిపారు.జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని మండలాల్లో కూడా ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. మండల స్థాయిలోనే ప్రజలు తమ సమస్యలు, వినతులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందే అవకాశం ఉందన్నారు. ప్రజలు తమకు సమీపంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రజలు తమ వినతులతో పాటు సమస్యకు సంబంధించిన అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించేందుకు ప్రతి అధికారి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**ప్రజావ్ణిలో వచ్చిన దరఖాస్తులు కొన్ని** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్‌లో నివాసం ఉంటున్న బానోత్ చంద్రమౌళి, తమ ప్రాంతంలోని రేషన్ షాపును స్థానికులకు కాకుండా స్థానికేతరులు నిర్వహిస్తున్నారని, రేషన్ షాపును స్థానికులకు అప్పగిస్తే ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని, దరఖాస్తు సమర్పించారు. ఈ దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు విచారణ, చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.టేకులపల్లి మండలం మద్రాస్ తండా గ్రామానికి చెందిన శరభ నరసింహారావు, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రుణ సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నానని, తన దరఖాస్తు చాలా రోజులుగా పెండింగ్‌లో ఉందని, త్వరితగతిన దరఖాస్తును పరిశీలించి రుణం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం టేకులపల్లి ఎంపీడీవోకు ఎండార్స్ చేశారు.ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు, జోడిపంపుల వెనుక ప్రాంతానికి చెందిన ప్రజలు తమ ప్రాంతంలోని కొంతమంది ప్రభుత్వ ఆరడుగుల గల్లీని ఆక్రమించారని, దీంతో మున్సిపాలిటీ తాగునీటి పైపులైన్ ఏర్పాటుకు, అత్యవసర రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, గల్లీ ఆక్రమణలను తొలగించి సమస్యను పరిష్కరించాలని దరఖాస్తు సమర్పించారు. ఈ దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం ఇల్లందు మున్సిపల్ కమిషనర్‌కు ఎండార్స్ చేశారు.ములకలపల్లి మండలం కమలాపురం గ్రామానికి చెందిన జక్కా యమున, కమలాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని చలమన్న నగర్‌లో అంగన్వాడీ ఆయా పోస్టు ఖాళీగా ఉండటంతో తాను దరఖాస్తు చేసుకున్నానని, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా పూర్తయిందని, దరఖాస్తు చేసుకున్న వారిలో తానే మెరిట్ జాబితాలో ముందున్నానని పేర్కొంటూ తనకు అంగన్వాడీ ఆయా పోస్టు కల్పించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు.చర్ల మండలం కంటేపల్లి గ్రామానికి చెందిన గోలి గోపయ్య, కంటేపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 1లో తనకు ఎకరం ఏడు కుంటల వ్యవసాయ భూమి ఉందని, ఈ భూమి తనకు వారసత్వంగా సంక్రమించిందని తెలిపారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా గత కొన్ని సంవత్సరాలుగా భూమిలో వ్యవసాయం చేయకపోవడంతో బీడు భూమిగా మారిందని తెలిపారు . తన వద్ద ఉన్న భూమికి సంబంధించిన పత్రాలను పరిశీలించి, పట్టాదారు పాస్‌బుక్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం భద్రాచలం సబ్ కలెక్టర్‌కు ఎండార్స్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ చేతుల మీదుగా తెలంగాణ ఓపెన్ స్కూల్స్ సొసైటీ వాల్‌పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు

### 35 ఫిర్యాదులు స్వీకరణ.. అధికారులకు మల్కాజ్‌గిరి జోనల్ కమిషనర్ ఆదేశాలు



**మల్కాజ్‌గిరి, ఆగష్టు 17 (నేటి మనదేశమ్):** : ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అందజేసే ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని మల్కాజ్‌గిరి జోనల్ కమిషనర్ ఆదేశించారు. సోమవారం మల్కాజ్‌గిరి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో సమీక్షించి, సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ప్రజావాణిలో మల్కాజ్‌గిరి జోన్ పరిధిలోని వివిధ సర్కిళ్లకు చెందిన 35 ప్రజా ఫిర్యాదులు అందాయి. వీటిలో కీసర సర్కిల్ నుంచి అత్యధికంగా 16 ఫిర్యాదులు వచ్చాయి. మౌలాలి సర్కిల్ నుంచి 10, మల్కాజ్‌గిరి సర్కిల్ నుంచి 7, బోయిన్‌పల్లి సర్కిల్ నుంచి ఒకటి, అల్వాల్ సర్కిల్ నుంచి ఒక ఫిర్యాదు నమోదయ్యాయి.ప్రజావాణికి హాజరైన అధికారులు ఫిర్యాదుల వివరాలను పరిశీలించి, ఆయా సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్య స్వరూపాన్ని బట్టి పరిష్కార చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ సూచించారు. ఫిర్యాదుదారులకు వీలైనంత త్వరగా ఉపశమనం కల్పించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

## ఆర్ఎంపీలు అనుభవం ఉన్నా.. పరిధి దాటొద్దు




**కోదాడ ఆగష్టు 17 (నేటి మనదేశమ్):** ఆర్ఎంపీలు తమ పరిధికి మించి వైద్యం చేయకుండా నిబంధనలు పాటించాలని జిల్లా ఆర్ఎంపీల సంఘం అధ్యక్షుడు దొంతగాని రవిబాబు సూచించారు. కోదాడ పట్టణంలో నిర్వహించిన ఆర్ఎంపీ, పీఎంపీల అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యవసర, అబార్షన్ కేసులను స్వయంగా చికిత్స చేయకుండా సంబంధిత విభాగాల నిపుణులైన వైద్యుల వద్దకు పంపించాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలను ప్రోత్సహించవద్దని, పరిధికి మించి వైద్యం చేసి ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని అన్నారు. కొత్తగా ఆర్ఎంపీలుగా వస్తున్న వారు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సంఘం సభ్యుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు భూతం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకటప్పయ్య, అంజిరెడ్డి, సిద్ధారెడ్డి, ఉపేందర్, శ్రీశైలం, ఖాజా, శౌరీ, నాగరాజు, లింగయ్య, శ్రీకాంత్, నాని తదితరులు పాల్గొన్నారు.

## రైతుల గోసను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

### -రైతు బీమాను వెంటనే పునరుద్ధరించాలి-.ఎమ్మెల్యే పాయల్ శంకర్



**ఆదిలాబాద్ అక్టోబర్ 17 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** రాష్ట్రంలోని రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సోమవారం ప్రెస్‌మీట్ నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతు కుటుంబానికి అత్యవసర సమయంలో అండగా నిలిచే రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.రైతు ఆకస్మికంగా మరణించినప్పుడు ఆ కుటుంబానికి రైతు బీమా అందించే ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగ పడుతుందని,అయితే కొత్తగా అర్హత పొందిన రైతుల నమోదు,మార్గదర్శకాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.రైతు బీమా పథకాన్ని బలోపేతం చేసి అర్హత ఉన్న ప్రతి రైతును వెంటనే పథకంలో చేర్చాలని కోరారు.రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తూ నిధులు అందిస్తున్నప్పటికీ,రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను సకాలంలో విడుదల చేయకపోవడం,పథకాలను సమర్థవంతంగా అమలు చేయకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన అన్నారు.రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతు బీమా పునరుద్ధరణ,రైతు భరోసా పెండింగ్ నిధులు, రుణమాఫీ,ఇన్‌పుట్ సబ్సిడీ,కేంద్ర పథకాల నాణ్యమైన విత్తనాలు,వ్యవసాయ యాంత్రీకరణ,మైక్రో ఇరిగేషన్,పంట బీమా వంటి అన్ని అంశాలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు.కార్యక్రమంలో రాందాస్ ,దయాకర్,కార్తీక్,సన్న ,కరుంకర్ రెడ్డి,అశోక్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణకు చలో ట్యాంక్‌బండ్

### వినాయక్‌నగర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో గోడపత్రిక ఆవిష్కరణ



**నేరెడ్ మెట్ , ఆగష్టు 17 (నేటి మనదేశమ్):** : బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించనున్న నేపథ్యంలో వినాయక్‌నగర్ గౌడ సంఘం సభ్యులు పెద్దఎత్తున కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం వినాయక్‌నగర్‌లో 'చలో ట్యాంక్‌బండ్' గోడపత్రికను ఆవిష్కరించారు.పాపన్న గౌడ్ చరిత్రను, ఆయన పోరాట స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే ఉద్దేశంతో గోడపత్రికను ఆవిష్కరించినట్లు సంఘం సభ్యులు తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ జరగడం గౌడ సమాజంతోపాటు బహుజన వర్గాలకు గర్వకారణమని పేర్కొన్నారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన గొప్ప యోధుడిగా చరిత్రలో నిలిచారని వారు గుర్తుచేశారు. ఆయన ధైర్యసాహసాలు, సామాజిక సమానత్వం కోసం చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి గౌడ సంఘాల ప్రతినిధులు, సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో భాష గౌడ్, నందం గౌడ్, పోచయ్య గౌడ్, నరసింహ గౌడ్, బాలేష్ గౌడ్, కృష్ణమూర్తి గౌడ్, విష్ణుమూర్తి గౌడ్, కృష్ణ గౌడ్, శేఖర్ గౌడ్, శశి గౌడ్, జగన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రాములు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from # 5-5-426, M.J. Road, Hyderabad and
Printed at SKYLINE PRESS, # D.No. 5-5-426, M.J. Road, Hyderabad - 500 001 . Ph: 24734846, 9701891645, E-mail: netimanadesam96@gmail.com